


రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ။160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 79 | సోమవారం | 8-09-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


హాకీ ఆసియాకప్
**విజేత భారత్**
09
కొరియాపై ఘనవిజయం

## ప్రశాంతంగా నిమజ్జనోత్సవం
# సిఎం అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు గణ నాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఘనంగా వీడ్కోలు పలికారన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించేందుకు సహకరించిన ప్రజలందరికి సిఎం అభినందనలు తెలిపారు. తొమ్మిది తరువాయి 2లో

## ఆర్చరీ చరిత్రలో
# భారత్ సంచలనం!

**ఒక స్వర్ణం, ఒక రజతం సాధించిన ఆర్చర్లు**




**గ్వాంగ్‌జూ :** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ఒక స్వర్ణ పతకం, ఒక రజత పతకం సాధించి భారత్ ఆర్చరీకి కొత్త ఊపునిచ్చింది. ఈ విజయం భారత క్రీడల చరిత్రలో ఓ సువర్ణాధ్యాయంగా నిలిచిపోయింది. భారత పురుషుల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఆదివారం జరిగిన ఫైనల్లో బలమైన ఫ్రాన్స్ జట్టును ఓడించి ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో తమ మొదటి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ జట్టులో ప్రథమేశ్ ఫుగే, అమన్ సైనీ, రిషబ్ యాదవ్ ఉన్నారు. ఫైనల్లో భారత జట్టు ఫ్రాన్స్‌ను 235–233 పాయింట్ల తేడాతో తరువాయి 12లో

# ఓటమి భయంతోనే...

**తొమ్మిదేళ్ల తర్వాత జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపు : సిపిఐ విమర్శ**

- జిఎస్‌టి కౌన్సిల్‌ను సంస్కరించాలి
- ట్రంప్ ప్రలోభాలకు లొంగిన మోదీ
- వివిధ రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలకు బిజెపి భస్మాసుర హస్తంగా మారింది
- బిఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిపై కవిత చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేయాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో పాటు బిహార్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తొమ్మిదేళ్ల తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిఎస్‌టి స్లాబులను తగ్గించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు.జిఎస్‌టి కౌన్సిల్‌ను సంస్కరించాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకమైన అన్ని దేశాలనూ కలుపుకున్నప్పుడే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగొస్తారని ప్రధాని మోదీకి సూచించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయకపోతే బిజెపి, బిఆర్‌ఎస్‌ల మధ్య అవగాహన ఉందని అనుకునే పరిస్థితి వస్తుందని నారాయణ అన్నారు. హైదరాబాద్‌లని మఖ్దూం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహతో కలిసి నారాయణ మాట్లాడుతూ తాము మొదటి నుంచి కూడా జిఎస్‌టి వల్ల ప్రజలకు భారమని చెబుతున్నప్పటికీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదని, తొమ్మిదేళ్ల పాటు ప్రజలను దోచుకున్నారని దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రస్తుతం ప్రధాని మోదీ లొంగిపోయారని, బానిసమనస్తత్వంతో ఉన్నారని మండిపడ్డారు. వివిధ రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలకు బిజెపి ఒక భస్మాసూర హస్తంగా మారుతోందని ఎద్దేవా చేశారు. వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ తరువాయి 2లో

## ‘ప్రాణహిత-చేవెళ్ల’ను తిరిగి చేపట్టండి

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్‌ఎస్ ఓటు వేస్తుందో లేదో స్పష్టంచేయాలి**

యూరియా సరఫరాపై సిఎం కేంద్రానికి లేఖ రాయాలి : కూనంనేని

గత ఉప రాష్ట్రపతి ఎన్నికలో తెలుగు వ్యక్తి అని వెంకయ్యనాయుడుకు మద్దతు ఇచ్చిన బిఆర్‌ఎస్, ప్రస్తుత ఎన్నికల్లో కూడా తెలుగువ్యక్తి, తెలంగాణ బిడ్డ, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేస్తుందా?, లేదా? స్పష్టత ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో కేంద్రంలోని బిజెపికి మద్దతుగా బిఆర్‌ఎస్ ఎప్పుడూ ఓటు వేయకుండా లేదని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ విలీనం అవుతందా? ఉంటుందా? కబళించ బడుతుందా? అనే రకరకాల ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత కీలక సమయంలో ఇప్పటికైనా బిఆర్ఎస్ స్పష్టత ఇవ్వాలన్నారు. ఉప రాష్ట్రపతి తరువాయి 2లో

## ఉపరాష్ట్రపతిని దేశంపై ప్రేమతో
# ఎన్నుకోండి

- రాజ్యసభను ప్రజాస్వామ్యదేవాలయంగా మారుస్తా
- ఎంపీలకు ‘ఇండియా’ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** తమ తమ రాజకీయపార్టీల పట్ల విధేయతతో కాకుండా దేశంమీద ప్రేమతో ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాలని ప్రతిపక్ష ‘ఇండియా కూటమి’ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పార్టీకి విధేయత ప్రకటించి అందుకు అనుగుణంగా ఆ మార్గదర్శకత్వంలో ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎన్నుకోవద్దని, ఈ పదవీ బాధ్యత తనకు అప్పగిస్తే రాజ్యసభను ఒక నిజమైన ప్రజాస్వామ్య దేవాలయంగా తీర్చిదిద్ది అందరికీ పూర్తి భరోసా ఇస్తానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. తనకోసం ఎంపీల మద్దతు కోరడంలేదని, దేశ సార్వభౌమాధికార ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ నిర్వచించిన విలువలకు మద్దతు ఇచ్చేందుకు తనకు ఓటు వేయాలని ఎంపీలను తరువాయి 2లో

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి
# మద్దతు ఇవ్వండి

- మేధావులు, సీనియర్ సంపాదకులు విజ్ఞప్తి
- టిడిపి, జనసేన, వైసిపి కూడా పునరాలోచన చేయాలని వినతి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి తీర్పులు మైలురాయిగా నిలిచాయని ప్రశంస



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరాష్ట్రపతి అభ్యర్థి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్‌ఎస్ మద్దతు తెలపాలని మేధావులు, సీనియర్ సంపాదకులు కోరారు. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాన్, వైఎస్‌ఆర్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పునరాలోచన చేసి తెలుగువారైన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సంఘీభావంగా పౌర సమాజం తరపున హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల తరువాయి 2లో

## పక్కా ప్లాన్‌తో కార్మికుడిగా చేరి

డ్రగ్స్ తయారీ సంస్థపై ముంబయి పోలీసుల దాడి

స్వాధీనం చేసుకొన్న ముడి సరుకు ముంబయికి తరలిస్తున్న పోలీసులు 03



## క్షిపణి దాడుల్లో ఉక్రేన్
# మంత్రివర్గ భవనం ధ్వంసం

**805 డ్రోన్లు, 13 క్షిపణులతో రష్యా భీకరదాడి**

చంటిబిడ్డ సహా నలుగురు మృతి

రష్యా ఆయిల్ పైపులైనుపై ఉక్రేన్ దాడి

కీవ్: ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీల వివాదం ముదిరిపాకాన పడుతున్న తరుణంలో రష్యా మరోసారి కీవ్ నగరంపై భారీ దాడులు చేసింది. మొట్టమొదటిసారి ఉక్రేన్ ప్రధాన ప్రభుత్వ కార్యాలయ భవంతులు క్షిపణి దాడుల్లో ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో ఉక్రేన్ మంత్రివర్గ భవంతి మంటల్లో చిక్కి పొగలుకక్కింది. నివాసిత ప్రాంత భవంతులపై జరిగిన దాడుల్లో ఏడాది వయసుగల చంటి బిడ్డ సహా నలుగురు మరణించగా, మరో 44 మంది గాయపడినట్లు దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. 56 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు 37 ప్రాంతాల్లో దాడులు చేశాయి. ఉక్రేన్ కూడా రష్యా ఆయిల్ పైపు లైన్లపై దాడులు చేసింది. 69 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా సైనికవర్గాలు ప్రకటించాయి. ఆదివారం తెల్లవారకముందే 805 డ్రోన్లు, క్షిపణులు, డెకోయ్‌లు, జెట్‌లతో రష్యా దాడులు తరువాయి 12లో

## ట్రంప్ సుంకాలతో
# మోదీ దేశానికి శత్రువయ్యారు!

- వారిద్దరూ స్నేహితులు కావచ్చు కానీ... ముందు దేశమే, ఆ తరువాతే స్నేహం : ఖర్గే



**కలబురగ్గి :** అమెరికా భారత్‌పై విధించిన సుంకాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్నేహితులు కావచ్చు, కానీ మోదీ దేశానికి శత్రువు అయ్యారన్నారు. ఆదివారం ఖర్గే కలబురగిలో విలేకరులతో మాట్లాడారు. మోదీ, ట్రంప్ ఒకరికొకరికి ఓట్లు కావాలి అందువల్ల వారు మారు మంచిగా ఉండవచ్చని అన్నారు. మోదీ–డోనాల్డ్ ట్రంప్ పొత్తు భారత్‌కు ఖర్చుతో కూడుకున్నదని ఖర్గే పేర్కొన్నారు. ట్రంప్, మోదీ స్నేహితులు కావచ్చు, కానీ మోదీ దేశానికి శత్రువుగా మారారని, అతను వాతావరణాన్ని పాడుచేశారని ఆరోపించారు. అమెరికా సుంకాలు భారతదేశంపై చూపిన ప్రభావంపై ఖర్గే వ్యాఖ్యానిస్తూ ట్రంప్ భారీ సుంకాన్ని తరువాయి 12లో

## బిసిలకు 42 శాతం కోటాను
# బిజెపి అడ్డుకుంటోంది



- మతం, దేవుడి పేరు చెప్పి రాజకీయం చేస్తోంది
- టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ


మంత్రులతో కలిసి 15న కామారెడ్డిలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/నిజామాబాద్/ కామారెడ్డి

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకాకుండా బిజెపి అడ్డుకుంటోందని, ఆ పార్టీ ఎప్పుడూ మతం, దేవుడి పేరు చెప్పి రాజకీయం చేస్తోందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్రమంత్రి బండిసంజయ్, ధర్మపురి అర్వింద్ బిసిల గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. అవినీతి తరువాయి 12లో


Chandra Rajeswara Rao Foundation for Social Progress

గౌరవ సలహాదారు, మాజీ పార్లమెంట్ సభ్యులు




శ్రీ సురవరం సుధాకర రెడ్డి గారి

సంస్మరణ సభ

08 సెప్టెంబర్, 2025(సోమవారం) - ఉ॥ 10:30 ని॥లకు
ఇంద్రజిత్ గుప్తా మెమోరియల్ హాల్,
సిఆర్ ఫౌండేషన్, కొండాపూర్, హైదరాబాద్‌లో జరుగుతుంది

సభాధ్యక్షులు:
డా॥ కె.నారాయణ, సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు

ఈ సందర్భంగా తెలంగాణ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా॥ రియాజ్ గారిచే నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉన్న గ్రంథాలయానికి "సురవరం సుధాకర రెడ్డి లైబ్రరీ" గా నామకరణం చేయడం జరుగుతుంది

ఈ సంస్మరణ సభలో మీరు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించవలసిందిగా కోరుతున్నాం

పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎం.ఎల్.ఎ.
ప్రధాన కార్యదర్శి, సి.ఆర్. ఫౌండేషన్.



# ప్రపంచం
WORLD NEWS

## వచ్చేనెల ఎపెక్ సదస్సులో ట్రంప్–జిన్‌పింగ్ భేటీ!

**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వచ్చేనెల దక్షిణకొరియాలో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు (ఎపెక్) అక్టోబరునెలలో దక్షిణ కొరియాలో జరుగుతుంది. ఈ సదస్సుకు ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరూ హాజరవుతున్నారు. ఈ సందర్భంగానే వారిద్దరూ విడిగా ముఖాముఖీ సమావేశం జరిపే అవకాశాలు ఉన్నాయని అమెరికా మీడియా ఆదివారం ప్రకటించింది. ఐతే దీనికి సంబంధించి అధికారిక ఒప్పందం ఏదీ ఇంతవరకూ జరగలేదు. ఎపెక్ సదస్సుకు ట్రంప్ హాజరవుతున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు ధృవీకరించాయి. ఈ సదస్సులో ఆర్థిక,వాణిజ్య, ఇంధన,రక్షణ,పౌర సంబంధ సహకార ఒప్పందాలపై ట్రంప్ చర్చల్లో పాల్గొంటారు. అక్టోబరు 31, నవంబరు 1వ తేదీలలో గ్యోంగ్జులో ఈ సదస్సు జరుగుతుంది. ఈ సమావేశం తర్వాత ట్రంప్ ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్‌ను కూడా కలుసుకునే అవకాశాలున్నాయని కూడా మీడియా తెలియజేసింది.



### జెరూసలెంలో 15వేలమంది
# నిరసన ర్యాలీ
నెతన్యాహూపై ఇజ్రాయెల్ ప్రజల ఒత్తిడి

**జెరూసలెం :** హమాస్‌వద్ద ఉన్న బందీలను విడిపించేందుకు ఒక ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ జెరూసలెంలో ఆదివారం సాయంత్రం వేలాది మంది ఇజ్రాయెలీ ప్రజలు భారీ ప్రదర్శన చేశారు. అదేసమయంలో రాజధాని టెల్‌అవీవ్‌లో కూడా భారీ ప్రదర్శన జరిగింది. ఇటీవలికాలంలో ఇంత భారీ ప్రదర్శన వేలాదిమందితో జరగలేదు. గాజాలో హమాస్ సంస్థ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేందుకు ప్రధానమంత్రి నెతన్యాహూ ఒప్పందం చేసుకోవాలి, గాజాలో యుద్ధం విరమించాలి, మా ఆత్మీయులను మాకు అప్పగించాలి'' అని డిమాండ్ చేస్తూ బందీల బంధువులు,ఆత్మీయులు,మిత్రులు,గల్లంతైనవారి కుటుంబాల వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. హమాస్‌వద్ద ఇంకా 40 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారని, వీరిలో 20 మందిపైగా సజీవులుగా ఉన్నారని బందీల బంధువులు ఆశపడుతున్నారు. వారిని ఒకేసారి విడిపించాలని కోరుతూ గడచిన రెండునెలలుగా ఇజ్రాయెల్‌లో దాదాపు ప్రతిరోజూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. హమాస్‌తో ఒక ఒప్పందానికి చేరువైనట్లు ట్రంప్ ప్రకటించిన తర్వాత ఈ నిరసన ప్రదర్శనలు మరింత ఉద్ధృతరూపం దాల్చాయి.

## చైనాలో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన

**బీజింగ్ :** చైనా ఫుజియన్ రాష్ట్రం జియామిన్‌లో సోమవారం నుండి గురువారం వరకూ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శనలో 120 దేశాలు పాల్గొంటున్నాయి. 1.2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. 100 మంది పెట్టుబడిదారులు పాల్గొంటారు. దాదాపు 500 కంపెనీలు, బహుళజాతి సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయి. అనేక సెమినార్లు, పరిశ్రమల అభివృద్ధి,ప్రోత్సాహానికి సంబంధించిన సదుపాయాల వివరణలు ఇక్కడ తెలియజేస్తారు.

# జపాన్ ప్రధానమంత్రి ఇషిబా 'రాజీ'నామా



**టోక్యో :** జపాన్ పధానమంత్రి షిగెరు ఇషిబా (78)పై అధికార లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి)లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత పెరుగుతున్న తరుణంలో ఆయన రాజీనామా ప్రకటన చేశారు. ప్రస్తుతం ఆయనే పార్టీ అధ్యక్షుడు కూడా. సెప్టెంబరులో పార్టీ అధ్యక్ష పదవి ఎన్నికల్లో పోటీ చేయదలచుకోలేదని ఇంతకుముందే ఆయన ప్రకటించారు. అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలా? వద్దా? అని పార్టీ నిర్ణయించడానికి ఒకరోజు ముందుగానే రాజీనామా ప్రకటన చేశారు. పట్టుమని ఆయన ఏడాది కూడా పదవిలో కొనసాగలేదు. తదుపరి ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు కొయిజుమి తోపాటు మాజీ మంత్రి సనాయే తకైచి, ప్రధాన మంత్రివర్గ కార్యదర్శి యషిమాసా హయషి, మాజీ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదాలకు అవకాశాలు ఉన్నాయి. జులైలో జరిగిన పార్లమెంటరీ (హౌస్ ఆఫ్ కౌన్సిలర్స్) ఎన్నికల్లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ చారిత్రక అపజయాన్ని మూటగట్టుకుంది. వరుసగా రెండు ఎన్నికల్లో ఆయన హయాంలో పార్టీ ఓటమి ఎదుర్కొంది. దీనికి బాధ్యతవహిస్తూ ఆదివారం పదవి నుండి వైదొలగాలన్న ఉద్దేశాన్ని ప్రకటించారు. 248 మంది సభ్యులున్న ఎగువసభకు గడచిన జులై 20న జరిగిన ఎన్నికల్లో పార్టీ పేలవమైన ఫలితాలు సాధించింది. గడచిన సెప్టెంబరులో ఎల్‌డిపి అధ్యక్ష పదవి చేపట్టి అక్టోబరు న 25వ ఎల్‌డిపి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపటవ్ట 9న దిగువసభను రద్దు చేశారు. తర్వాత ఎన్నికల్లో స్వల్పమెజారిటీతో గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి పదవిలో కొనసాగారు. ఉభయసభల్లోనూ ఎల్‌డిపికి తగిన మెజార్టీ లేకపోవడంతో తదుపరి ప్రధానమంత్రి బిల్లులను ఆమోదించడానికి పార్లమెంటులో ప్రతిపక్షాలతో సమన్వయంతో అణగిమణిగి వ్యవహరించాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. గతంలో ఆయన పదవిలో కొనసాగాలని బలంగా ఆశించినప్పటికీ, ఇటీవల ప్రజల్లో ఆయనపట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. దేశంలో పెరుగుతున్న ధరలు, సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం కారణంగా ఇషిబా ప్రజల మద్దతు కోల్పోయారు. దీంతో అధికారపార్టీలో కూడా తీవ్ర అసంతృప్తి పెరిగింది. దీంతో షిగెరు ఇషిబా ఆదివారం రాజీనామా ప్రకటన చేసినట్లు జపనీస్ దినపత్రిక ప్రకటించింది. గత ఏడాది అక్టోబరు ఒకటో తేదీన నేషనల్ డైట్ ఆమోదంతో ఇషిబా ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది సెప్టెంబరు ఏడో తేదీన రాజీనామా ప్రకటన చేశారు. 1986 నుండీ ఆయన జపాన్ పార్లమెంటు ప్రతినిధులసభలో సభ్యుడుగా కొనసాగుతున్నారు.రక్షణమంత్రిగా, హోంశాఖామంత్రిగా, వ్యవసాయశాఖామంత్రిగా, అటవీ,మత్స్యశాఖామంత్రిగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గత ఏడాది ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా చేపట్టారు. ఇషిబా రాజకీయ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి జిరో ఇషిబా తొట్టోరి ప్రిఫెక్చర్ గవర్నర్‌గా పనిచేశారు.

# థాయ్‌లాండ్ ప్రధానిగా అనుటెన్ ప్రమాణస్వీకారం

మళ్ళీ త్వరలో ఎన్నికలకు వాగ్దానం



**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్ ప్రధానమంత్రిగా అనుతిన్ చార్న్ విరాకుల్ (58) ఆదివారం పదవీబాధ్యతలు తీసుకున్నారు. త్వరలో దేశంలో ఎన్నికలు నిర్వహిస్తాననీ, ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతానని వాగ్దానం చేశారు. అనుతిన్ దేశంలో సీనియర్ రాజకీయవేత్త, వ్యాపారవేత్త. గడచిన జూన్ నెలలో కాంబోడియా మాజీ నేతతో టెలిఫోన్ వివాదంలో చిక్కుకున్న ప్రధానమంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్ర గతవారంలో న్యాయస్థానం ద్వారా పదవీచ్యుతురాలయ్యారు. అనుతిన్ చార్న్ విరాకుల్ ఇంతకుముందు అధికార ఫూథాయ్‌పార్టీ కూటమి ప్రభుత్వంలోనే ఉండేవారు. పేటోంగ్‌టార్న్ షినవత్రతో విభేదించి పార్టీ నుండి బయటకువెళ్ళి భూంజైథాయ్ పార్టీ నాయకుడుగా కూటమిలో ఉంటూ సమయంకోసం వేచి ఉన్న తర్వాత ఇప్పుడు ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. పేటోంగ్‌టార్న్ షినవత్ర తండ్రి తక్షిన్ షినవత్ర స్థాపించిన థాయ్ రాక్ థాయ్ పార్టీలో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన అనుతిన్ క్రమంగా ఎదుగుతూ వచ్చారు. 2019 2023లలో జరిగిన ఎన్నికల్లో కూడా రాజకీయ పండితులు ప్రధానమంత్రి పదవికి అనుతిన్ పేరును ముందుకు తీసుకువచ్చారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో ఆరోగ్యశాఖామంత్రిగా అనుతిన్ చక్కటి నిర్వహణతో తన ప్రతిభ నిరూపించుకున్నారు. 2022లో గంజాయిపై నిషేధం తొలగింపజేసే చట్టం తీసుకురావడంలో ప్రధానపాత్ర పోషించారు. థాయ్‌లాండ్ రాజరిక వ్యవస్థ ఆధిపత్యాన్ని నియంత్రించడంలో కూడా ఆయన పాత్రపోషించారు. రాజకీయ,వ్యాపార కుటుంబంలో జన్మించిన అనుతిన్ అమెరికాలో చదువుకుని 1990లో తండ్రి స్థాపించిన సినో– థాయ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో చేరారు. 2004లో ఆరోగ్యశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. 2007లో రాక్ థాయ్ రాక్ పార్టీ కోర్టు ఉత్తర్వుతో రద్దు కావడం, అనుతిన్‌పై ఐదేళ్ళు రాజకీయ నిషేధం పూర్తయిన తర్వాత 2012లో తిరిగి ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. 2023 నుండి ఇప్పటివరకూ ఫూథాయ్ అధికార కూటమిపార్టీలో రెండుసార్లు హోంమంత్రిగా పనిచేశారు.




## నేషనల్ గార్డ్స్‌కు వ్యతిరేకంగా వాషింగ్టన్ డిసిలో వేలాదిమంది భారీ ప్రదర్శన

**వాషింగ్టన్ :** నేషనల్ గార్డ్ ట్రూప్స్ గస్తీ, భద్రతల నుండి దేశ రాజధాని వాషింగ్టన్ డి సిని విముక్తి చెయ్యాలని, ఎన్‌జిటి మోహరింపు చర్యలు తీసుకోవద్దని ట్రంప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వేలాదిమంది ప్రదర్శన చేశారు. దేశరాజధానిలో నేషనల్ గార్డ్స్‌ను మోహరించేందుకు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం వేలాదిమంది గార్డ్స్ వాషింగ్టన్ వీధుల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ఉంటారు. ఈ గస్తీ దళాలనుండి రాజధాని నగరాన్ని విముక్తి చేయాలని కోరుతూ వేలాదిమంది ప్రజలు ఈ ఏడాదిలో ఎన్నడూలేనంత భారీస్థాయిలో ప్రదర్శన జరిపారని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది. ఈప్రదర్శనలో వలస వ్యతిరేక నినాదాలతోపాటు ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు కూడా హోరెత్తాయి. అధికారిక డాక్యుమెంటు లేవనే సాకుతో లక్షలమంది ప్రజలను దేశం నుండి బయటకు తరలించడాన్ని కూడా ప్రదర్శకులు తీవ్రంగా వ్యతిరేకించారు. నినాదాలు చేశారు. గాజాలో యుద్ధం విరమించాలని కూడా వారు డిమాండ్ చేశారు. రాజధానిలో ఫెడరల్ ప్రభుత్వ పెత్తనం ఉండకూడదని, వాషింగ్టన్ డిసి హోమ్‌రూల్ అమలు చేయాలని, ఈ రూల్స్‌కు పూర్తి రక్షణ కల్పించాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. దేశరాజధానిలో నేరాలు పెరిగిపోయాయంటూ గతనెలలో నేషనల్ గార్డ్స్‌ను ట్రంప్ మోహరించారు. ఈ నగరాన్ని నేరుగా ఫెడరల్ ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకున్నారు. దీనిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



# మద్దతు ఇవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో సీనియర్ సంపాదకులుకె.రామచంద్రమూర్తి, సీనియర్ సంపాదకులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ హరగోపాల్, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర రావు మాట్లాడారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పులు మైలురాయిగా నిలిచిపోయాయని ప్రొఫెసర్ హరగోపాల్ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. చరిత్రలో రాజ్యాంగం కాలక్రమేణ ఎలా పరిణామం చెందింది, రాజ్యాంగ చరిత్ర,న్యాయశాస్త్రం,విశాల సమాజం,భవిష్య సమాజంపైన సుదర్శన్ రెడ్డికి సమగ్రమైన అవగాహన ఉన్నదన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, విశ్వవిద్యాలయాల్లో ఎందుకు తీవ్రమైన సంక్షోభంలో పడ్డాయని, వాటి భవిష్యత్ ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్న తరుణంలో, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు పార్లమెంట్ సభ్యులు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేయాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన సుదర్శన్ రెడ్డిని తాము మద్దతు ఇవ్వబోమని బిఆర్‌ఎస్ చెప్పిందని, కానీ తెలంగాణ అస్తిత్వం కోసం పని చేసిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అని హరగోపాల్ గుర్తు చేశారు. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నీరు గారిపోయిందని, రాజ్యాంగ విలువలు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో సుదర్శన్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత తెలుగు రాష్ట్రాల్లోని పార్లమెంట్ సభ్యులపై ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ఐదు రాజకీయ పార్టీలకు చెందిన ఎంపిల ఓట్లు పడితే సుదర్శన్ రెడ్డి గెలుస్తారన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే రాజ్యాంగం నిలబడుతుందన్నారు.డాక్టర్ వనమాల మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ జస్టిస్ సుదర్శన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన గెలుపు తెలుగు రాష్ట్రాల ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర రావు మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి సల్వాజుడుం ప్రైవేట్ సైన్యానికి సంబంధించి తీర్పునిస్తే, ఆయన నక్సలైట్లకు అనుకూలమని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపునకు అందరూ కృషిచేయాలని కోరారు.రాజ్యాంగ విలువలకు కట్టుబడి, రాజ్యాంగ పునాదులపైన భారత నిర్మాణానికి నిబద్ధతతో పని చేస్తున్న వ్యక్తి గెలవడం వల్ల భారతదేశానికి ఉపయోగమని అన్నారు. ఇండియా కూటమిలో లేని రాజకీయ పార్టీలు కూడా ఆయనను బలపరుస్తున్నాయని, ఆప్ కూడా మద్దతు ఇస్తుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లు రూపకల్పనలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కీలక బాధ్యత వహించారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకునే నైతిక బాధ్యత బిఆర్‌ఎస్ పైన ఉందని అన్నారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మప్రబోధం సాక్షిగా ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవాలని కోరారు. టిడిపి, వైఎస్‌ఆర్ పార్టీలు పునరాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉప రాష్ట్రపతి పదవి రాజ్యాంగాన్ని రక్షించే హోదా అని అన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలైట్ అనుకూల వ్యక్తి అని బిజెపి ప్రచారం చేసిందని, అలాంటి వ్యక్తిని పదవీ విరమణ చేసిన తర్వాత గోవాలో లోకాయుక్తకు ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. సోషల్ సెక్యూలిరిజం, సెక్యూలరిజం లాంటి పదాలను తొలగించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. సామాజిక న్యాయం అమలుకావడం లేదని, పబ్లిక్ సెక్టార్‌లో రిజర్వేషన్‌లు లేవని అన్నారు. సామాజిక న్యాయాన్ని కాపడటం, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించిన వ్యక్తికి ఓటు వేయబోమని చెప్పిన బిఆర్‌ఎస్, ఈ విషయంలో మరోసారి పునరాలోచనచేయాలని సూచించారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా వెంకయ్య నాయుడుకు బిఆర్‌ఎస్ ఓటు వేసిన విషయాన్ని శ్రీనివాస రెడ్డి గుర్తు చేశారు. ఇది రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్నఎన్నిక అని అన్నారు. దేశంలో ఇతర రాజకీయ పార్టీలు కూడా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతునిస్తున్నాయని,కెసిఆర్ పునరాలోచన చేయాలని,లౌకికవాది,సెక్యూలరిజంకాపాడే వ్యక్తిగా చంద్రబాబు,అలాగే జగన్‌మోహన్ రెడ్డి, పవన్ కళ్యాన్ కూడా ఆలోచన చేసి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

# 'ప్రాణహిత–చేవేళ్ల'ను తిరిగి చేపట్టండి
(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తనకంటూ ఒక విధానాన్ని స్పష్టం చేయాలన్నారు. కమ్యూనిస్టులుగా తాము అధికారంలో లేకపోయినా నిత్యం ప్రజల పక్షాన నిలబుడుతామని,బిఆర్‌ఎస్ కూడా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామన్నారు.బిజెపి నరమాంస భక్షకులని, అలాంటి బిజెపిని నమ్ముకుంటే దెబ్బతింటారని ఆయన బిఆర్‌ఎస్‌కు సూచించారు.

ప్రాణహితచేవేళ్ల ప్రాజెక్టను తిరిగి చేపట్టాలని, 5వ ప్యాకేజీ వద్ద చిన్న ఎత్తిపోతలను నిర్మించాలని సూచించారు. సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ఉపయోగిస్తారా? లేదా? ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఈ బ్యారేజీలను ఉపయోగిస్తే రూ.14వేల కోట్ల విద్యుత్ బిల్లుల ఖర్చు అవుతుందని వివరించారు. రూ. 36 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టను జస్టిస్ పి.సి ఘోష్ నివేదిక ప్రకారం రూ.1,46,000 కోట్ల అంచనాలు పెరిగాయన్నారు. ఈ ప్రాజెక్టలో ఏదో పద్ధతిలో ఆర్థిక లాబాలు, దుర్వినియోగం జరిగిందని, కేవలం ఇద్దరు, ముగ్గురు అధికారుల వద్దనే వెయ్యి కోట్ల రూపాయలు దొరికాయని కూనంనేని తెలిపారు.

రాష్ట్రంలో ఎంత మేరకు యూరియా డిమాండ్ ఉన్నది..?,సరఫరా ఎంత చేయాలనే విషయమై ముఖ్యమంత్రి వెంటనే కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా ఎంత అవసరం?, ఇందులో కేంద్రం ఎంత వరకు సరఫరా చేసిందనే విషయమై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా సరఫరాలోని లోపాలను గుర్తించి, ఒక వేళ బ్లాక్‌మార్కెటింగ్ ఉంటే బయటికి తీయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రైతాంగ అసంతృప్తికి తగ్గించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

**రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బిజెపికి వ్యతిరేక పోరాటానికి సిఎం పిలుపునివ్వాలి : కూనంనేని**

ప్రతి పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టేందుకు ముఖ్యమంత్రి పిలుపునివ్వాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. జిఎస్‌టి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడిందన్నారు. ప్రధాని మోదీ పెద్దన్న పాత్రను పోషించడంలేదని, రాష్ట్రంపై పెత్తనం చెలాయిస్తున్నారని దుయ్యబట్టారు. బిసిలకు నష్టం జరిగితే ఊరుకోబమని సిఎంను హెచ్చరిస్తున్న బిజెపి, తెలంగాణ రాష్ట్రం ఆమోదించిన బిల్లులను ఆపుతున్నారని, దొంగ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. బిసి బిల్లులను ఆమోదించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన బిజెపికి సూచించారు.సిబిఐ తన స్వతంత్రతను కోల్పోయిందని, కేంద్ర ప్రభుత్వ ప్రలోభాలకు లొంగుతుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సిబిఐ పారదర్శక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసు విషయంలో సిబిఐ న్యాయబద్ధంగా ఉంటుందా?, రాజకీయ ప్రయోజనాలకు సిబిఐని వాడుకుంటారా? లేదా బిఆర్‌ఎస్ మెడపైన కత్తి పెట్టి లొంగతీసుకునేందుకు ప్రయత్నిస్తారా? అనేది చూడాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. సిబిఐ స్వతంత్రంగా వ్యవహరిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు.రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులు విడదల చేస్తే తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఎందుకొస్తుందని ప్రశ్నించారు. కొన్ని వస్తువులకు జిఎస్‌టి తగ్గించి, మరి కొన్ని వస్తువులకు అదనంగా పెంచారని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జిఎస్‌టి నిధులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం బకాయిల చెల్లింపులు, అప్పులలో ఉన్నదని, విభజన హక్కుల చట్టం నుంచి మొదలు అనేక రూపాల్లో కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, నిధులతో పాటు అదనంగా నిధులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పోలవరం తరహా తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టకు జాతీయ హోదా ఇవ్వాలని, వివిధ రంగాలకు కేంద్రం సహాయం చేస్తే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల నుంచి కొద్దిగా బయట పడుతుందని తెలిపారు.

# డిజిటలైజేషన్ దిశగా టిటిఇ విధులు

రైల్వే సిపిఆర్ఓ ఎ.శ్రీధర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వేలో విధులు నిర్వహిస్తున్న ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టిటిఇ) విధులు ఇకపై డిజిటలైజేషన్ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా చేయడం ద్వారా టిటిఇ విధులు పారదర్శకంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే టికెట్ తనిఖీ సిబ్బంది కోసం బయోమెట్రిక్ సైన్‌ఆన్‌ను ప్రవేశపెట్టడం ద్వారా మరో అడుగు ముందుకు వేసిందని శ్రీధర్ తెలిపారు. వీరి విధులు పారదర్శకంగా చేయడానికి ప్రస్తుతం , జోన్ వ్యాప్తంగా ఆరు ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టిటిఇ)లాబీలను సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్‌లో ప్రయోగాత్మకంగా 'బయో మెట్రిక్ సైన్‌ఆన్/సైన్‌ఆఫ్' ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఆ తరువాత ఈ వ్యవస్థను జోన్ వ్యాప్తంగా ఉన్న అన్ని 73 టిటిఇ లాబీలలో అమలుచేయనున్నట్లు తెలిపారు. గతంలో టికెట్ తనిఖీ సిబ్బంది యొక్క సైన్ ఆన్/సైన్‌ఆఫ్ కార్యాచరణ వినియోగదారు పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి జరిగేది ..ప్రస్తుతం టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్ విధానాన్ని క్రమబద్ధీకరించడానికి, టీ.టి.ఈ లాబీలలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సైన్‌ఆన్,సైన్‌ఆఫ్ కార్యాచరణను ప్రవేశపెట్టారు. టిటిఇ లాబీ అప్లికేషన్‌లో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని సి డి.ఎ.సి పోర్టల్‌తో సరిగ్గా అనుసంధానించడం ప్రారంభించబడింది. దీని ద్వారా వారి సోర్స్ స్టేషన్, గమ్యస్థాన స్టేషన్‌లో టికెట్ తనిఖీ సిబ్బంది భౌతికంగా ఉండడాన్ని తెలియజేస్తుంది. టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్,లాగౌట్ సమయాలను వాస్తవ సమయ ప్రాతిపదికన రికార్డ్ చేయబడుతుంది . జోన్‌లో ఈ సాంకేతిక పురోగతిని అమలు చేసినందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందిని అభినందించారని ఆయన తెలిపారు. డిజిటల్ టెక్నాలజీలను అమలు చేయడంలో దక్షిణ మధ్య రైల్వే ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ఇందులో భాగంగా ఈ బయో మెట్రిక్ సైన్‌ఆన్ , సైన్‌ఆఫ్ వ్యవస్థ అటువంటి మరొక డిజిటల్ చొరవ అని, వ్యవస్థలో పారదర్శకతను పెంచుతుందని తెలిపారు.

# సిఎం అభినందనలు
(మొదటి పేజీ తరువాయి)

రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పని చేసిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పంచాయతీ రాజ్ పారిశుధ్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు, భక్తులందరిని సిఎం అభినంధించారు.

# ఓటమి భయంతోనే
(మొదటి పేజీ తరువాయి)

పార్టీలతో జతకట్టడం లేదా స్నేహంగా ఉంటూ ఆయా పార్టీల నెత్తిపైన భస్మాసూర హస్తంగా మారుతోందన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పిడిపి, మహారాష్ట్రంలో శివసేన, ఎన్‌సిపిని చీల్చిందని, ఆ పార్టీలను ధ్వంసం చేసిందని, కుటుంబాల్లో చిచ్చుపెట్టిందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారని, ఇక తెలంగాణ వంతు అయిందని, కవిత కూడా జైలుకు పోయిందన్నారు. బిఆర్‌ఎస్ ఎప్పుడైతే బిజెపి పంచన చేరిందో ఆ పార్టీ కొంప కొల్లేరయిందని, చివరకు కవిత బయటికి వచ్చి రాజకీయ పార్టీ పెట్టుకునే పరిస్థితికి వచ్చిందన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని, ఈ సభలో జాతీయ రాజకీయ, ఇతర పలు అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు. కవిత వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి విచారించాలి: బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అంశంలో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్వీకరించి,విచారణ చేపట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. కవిత చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదని హరీశ్‌రావు తప్పుకున్నప్పటికీ, కెసిఆర్ మాత్రం బాధ్యతగా సమాధానం చెప్పాలని, లేదంటే కవిత ఆరోపణలు వాస్తవంగా భావించాల్సి వస్తుందన్నారు. బిఆర్‌ఎస్‌లోని అంతర్గత వ్యవహారాలు తమకు సంబంధంల లేదని, కానీ టిఆర్‌ఎస్‌లో మొదటి నుంచి ఆ పార్టీలో క్రీయశీలకంగా ఉన్న కవిత స్వయంగా నిర్దిష్టమైన అవినీతి ఆరోపణలు చేశారని, ఇది ప్రజాసొమ్ముకు సంబంధించిన అంశమని నారాయణ అన్నారు.

# దేశంపై ప్రేమతో ఎన్నుకోండి
(మొదటి పేజీ తరువాయి)

కోరుతున్నానని ఆ సందేశంలో తెలియజేశారు. ''ఇక్కడేమీ పార్టీ విప్ లేదు, ఓటింగ్ ప్రక్రియలో రహస్య బ్యాలెట్ విధానం అమలులో ఉంది, ఈ ఎన్నిక ఏ రాజకీయపార్టీపట్ల విధేయత చూపించడానికి కాదు, దేశంమీద ప్రేమను చూపించడానికి అనివార్యంగా ఎంపీలు అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలి, మన ప్రియమైన భారతజాతి మూలధర్మాన్ని,అంతఃకరణశుద్ధిని కాపాడుకునేందుకు మీలో ప్రతిఒక్కరూ తమ తమ నైతిక బాధ్యతను ముందుకు తీసుకువెళ్ళాలి'' అని పార్లమెంటు సభ్యులకోసం రూపొందించిన 12 నిమిషాలకుపైగా నిడివిగల ఆ వీడియో సందేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు.

''ఉపరాష్ట్రపతి పదవీ బాధ్యతలు నాకు అప్పగించడంద్వారా మీరు పార్లమెంటరీ సంప్రదాయాలను మీరు రక్షించినట్లవుతుంది, చర్చల సందర్భంగా సభలో సభ్యులపట్ల ఉండే గౌరవ మర్యాదలను పునరుద్ధరించినట్లవుతుంది, రాజ్యసభను నిజమైన ప్రజాస్వామ్యదేవాలయంగా తీర్చిదిద్దడానికి పూర్తి భరోసా కల్పించినట్లవుతుంది'' అని తెలియజేశారు. ఇది కేవలం మీరు ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవడానికి వేసే ఓటు మాత్రమే కాదనీ, భారతదేశ స్ఫూర్తికి వేసే ఓటు అనీ ఉద్ఘాటించారు. ''మనందరం కలిసి భారతదేశ గణతంత్రాన్ని పటిష్టపరుద్దాం, భవిష్యత్ తరాలు తమ వారసత్వ సందపను చూసి గర్వపడేవిధంగా ఈ ఎన్నిక ద్వారా దేశ స్వాభావిక విలువలను సృష్టిద్దాం'' అని కోరారు. మహోన్నతమైన భారత గణతంత్రవ్యవస్థకు ఉపరాష్ట్రపతి పదవికోసం పోటీపడే అభ్యర్థిగా, బాధ్యతగల లోతైన ఆలోచనాదృక్పథంతో, ఎంతో వినయవిధేయతలతో మీ ముందు తాను నిలబడ్డానని ఎంపీలను ఆ వీడియో సందేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కోరారు.

''మన స్వాతంత్ర్యపోరాట యోధుల మహోన్నతమైన త్యాగాల పునాదుల పైన,అనేక దశాబ్దాలుగా వారు పెంచిపోషించిన దార్శనిక దృక్పథంపైన భారత ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మితమైంది, కానీ అలాంటి విభిన్న ప్రజాస్వామ్య అల్లిక వ్యవస్థను సంరక్షించుకుని,పటిష్టపరచుకోవాలంటే సమష్టి కృషి ఎంతో అవసరం'' అని ఎంపీలకు మరోసారి గుర్తుచేశారు.

ఈనెల తొమ్మిదో తేదీన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరుగుతుంది. అధికార ఎన్‌డిఏ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మధ్య ఈ ప్రత్యక్షపోటీ జరుగుతోంది. ఈసారి ఉపరాష్ట్ర పదవికి పోటీపడే అభ్యర్థులు ఇద్దరూ దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారే. వీరిలో ఎన్‌డిఏ అభ్యర్థి తమిళనాడకు చెందినవారు కాగా, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. ఉపరాష్ట్రపదవికి జరిగే పోటీని ప్రతిపక్షాలు సైద్ధాంతిక యుద్ధంగా పేర్కొన్నాయి. ఐతే సంఖ్యారీత్యా అధికారపార్టీకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సుందర్శన్‌రెడ్డి (79) సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి 2011 జులైలో పదవీ విరమణ చేశారు. నాటి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ అనేక ప్రముఖ తీర్పులు ఆయన వెలువరించారు. నల్లధనానికి సంబంధించి కేంద్రం బనాయించిన అనేక బలహీనమైన కేసుల విషయంలో ఆయన కేంద్రాన్ని దునుమాడారు. నక్సలైట్లతో పోరాటం చేసేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సల్వాజుడుంను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ఆయన ప్రకటించారు. దేశంలో లెక్కలు చూపించకుండా విదేశాలకు తరలించి అక్కడి బ్యాంకులలో దాచిపెట్టిన భారీ నగదు మొత్తాన్ని తిరిగి స్వదేశం తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని జస్టిస్ రెడ్డి తన తీర్పు ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. గువహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణలో కులగణనకు నిర్దేశించిన ఒక కమిటీకి ఆయన నాయకత్వం వహించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎంఆర్ అప్పగించని మిల్లర్లపై కఠిన చర్యలు : మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పాత బకాయిలను చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అవసరమనుకుంటే రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆయా మిల్లుల యజమానుల నుంచి రికవరీ చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సిఎంఆర్ బకాయిలపై వనపర్తి జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంత వరి ధాన్యం సేకరించారు? జిల్లాల వారీగా మిల్లర్ల నుంచి రావాల్సిన పాత బకాయిలు ?, ధాన్యం సేకరణ? తిరిగి సిఎంఆర్ డెలివరీ ఎంత చేశారు? ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయి?, బకాయిదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? స్టాక్ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.కీమ్యా నాయక్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎస్ఒ కాశీ విశ్వనాథం, జిల్లా మేనేజర్ జగన్మోహన్, అసిస్టెంట్ మేనేజర్ బాలు నాయక్, సిఐ కృష్ణయ్య పాల్గొన్నారు



## సత్ఫలితాలిస్తున్న ‘మహిళా సమాఖ్య నారాయణపేట పెట్రోల్ బంక్’

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ‘మహిళా సమాఖ్య నారాయణపేట పెట్రోల్ బంక్’ సత్ఫలితాలనిస్తోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆరు నెలల కాలంలో ఆ ‘మహిళా సమాఖ్య’ రూ.15.50 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ‘ఇందిరా మహిళా శక్తి’ పాలసీని పటిష్టంగా అమలు చేస్తోంది. ఒకప్పుడు ఇంట్లో కూర్చుని కుట్లు, అల్లికలు, చిన్న వ్యాపారాలు చేసి కుటుంబానికి చేదోడు,వాదోడుగా నిలిచే మహిళలు ప్రస్తుతం వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. దేశ అభ్యున్నతికి చోదక శక్తిగా ఎదుగుతున్నారు. నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్యలో ఉన్న 8196 మహిళా సంఘాలలో మొత్తం 91,369 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందిరా మహిళాశక్తి పాలసీలో భాగంగ నారాయణపేట జిల్లా సింగారం క్రాస్ రోడ్డులో రూ.1.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన జిల్లా ‘మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్’ను ఈ ఏడాది ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి నెలా రూ.10వేల అద్దె చొప్పున 20ఏళ్ల వరకు పెట్రోల్ బంక్ నిర్వహణ నిమ్మితం బిపిసిఎల్‌తో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకున్నది. దీనికి అనుగుణంగా పెట్రోల్ బంక్ నిర్వహణకు సంబంధించిన 11 మంది మహిళలకు ముందస్తుగా జడ్చర్ల, షాద్ నగర్‌లలోని పెట్రోల్ బంక్‌లలో మేనేజర్,సేల్స్ ఉమెన్‌లుగా ప్రభుత్వం తగిన శిక్షణను ఇప్పించింది. మొత్తం వ్యయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.15లక్షలు ఖర్చు చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పెట్రోల్ బంక్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తున్నారు. మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌లో రోజుకు 4 వేల లీటర్ల పెట్రోల్, 6 వేల లీటర్ల డీజిల్‌ను విక్రయిస్తున్నారు. అందులో విధులు నిర్వర్తించే 10 మంది సేల్స్ ఉమెన్‌లకు ఒక్కొక్కరికి నెలకు రూ.13,200 చొప్పున,మహిళా మేనేజర్‌కు నెలకు రూ.18,000లను వేతనంగా జిల్లా సమాఖ్య నుండి తీసుకుంటున్నారు. రాష్ట్ర మహిళా పెట్రోల్ బంక్ ద్వారా వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను 6 నెలలలో రూ.15.50లక్షల ఆదాయాన్ని ఆర్జించినట్లు జిల్లా సమాఖ్య నుండి పెట్రోల్ బంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రకళ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇదొక ముందడుగుగా ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. దీనికి తెలంగాణ రాష్ట్రంలోనే కాదని, దేశం మొత్తంలో జిల్లా మహిళా సమాఖ్యతో నడిచే మొదటి పెట్రోల్ బంక్ గా గుర్తింపు పొందిందని ప్రభుత్వం తెలిపింది.



## పక్కా ప్లాన్‌తోనే ..

### డ్రగ్స్ తయారీ సంస్థపై ముంబయి పోలీసుల దాడి
### స్వాధీనం చేసుకొన్న ముడి సరుకు ముంబయికి తరలిస్తున్న పోలీసులు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : తమకు చిక్కిన బంగ్లాదేశ్ మహిళా నిందితురాలిచ్చిన సమాచారాన్ని ఖచ్చితంగా నిర్ధారించుకొనేందుకు ముంబయి పోలీసుల్లో ఒకరు చర్లపల్లి ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరి డ్రగ్స్ తయారీ అవటాన్ని ధృవీకరించుకోవటం ద్వారా పక్కా ప్లాన్‌తో దాడులు నిర్వహించారు. ఫలితంగా ఇక్కడి నిందితులను అరెస్టు చేయటంతోపాటు డ్రగ్స్, ముడి సరుకును పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకొన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు గాను అరెస్టయిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకొన్న డ్రగ్స్, ముడి సరుకును ముంబయికి వాహనాల్లో తరలించారు. ముంబయి మీరా రోడ్ ఈస్ట్ ప్రాంతంలో నివసించే బంగ్లాదేశ్ దేశస్తురాలైన ఫాతిమా మురాద్ అలియాస్(23)ను మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు గత ఆగస్టు 8న కాశ్మీరా బస్‌స్టాప్ ఎటిఎం సమీపంలో అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా అదుపులో తీసుకొని 105 గ్రాముల మెఫోడ్రోన్ అనే డ్రగ్స్ స్వాధీనం చేసుకొన్నారు. ఆమెను విచారించిన పోలీసులు అనంతరం మరో 10 మందిని అరెస్టు చేసి 178 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేశారు. మరింత లోతుగా కొనసాగించిన దర్యాప్తులో తెలంగాణా రాష్ట్ర రాజధాని సమీపంలోని మేడ్చల్ జిల్లా చర్లపల్లి పారిశ్రామిక వాడలోని వాగ్దేవి కెమికల్స్ పేరిట ఉన్న పరిశ్రమలో పెద్ద ఎత్తున డ్రగ్స్ సరఫరా చేస్తున్న విషయాన్ని తెలుసుకొన్నారు. దీన్ని పూర్తిగా నిర్ధారించుకొనేందుకు ముంబయి పోలీసులు పథకంలో భాగంగా ముందుగా ఓ పోలీసు సిబ్బంది నెల రోజుల క్రితం చర్లపల్లి చేరుకొని ఆ ఫ్యాక్టరీకి సాధారణ వ్యక్తిగా వెళ్లి పని కావాలంటూ కార్మికుడిగా చేరాడు. అప్పటి నుండి ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా కార్మికుడిగా పని చేస్తూ అక్కడ ఏం జరుగుతోంది, నిజంగా డ్రగ్స్ తయారీ అవుతున్నాయా లేదా, ఎక్కడెక్కడికి సరఫరా అవుతున్నాయి, ఎవరెవరు వస్తున్నారన్న విషయాలన్నిటినీ ఆధారాలతో సహా సేకరించి తన ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేశాడు. అప్పటికే తమకు చిక్కిన నిందితుల సమాచారాన్ని క్రోడీకరించుకొని పూర్తిగా నిర్ధారించుకొన్న మీదట ముంబయి పోలీసుల బృందం శుక్రవారం చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజ్ 5, నవోదయ కాలనీలోని వాగ్దేవి లాబొరేటరీస్ కర్మాగారంపై దాడులు నిర్వహించి శ్రీనివాస్ విజయ్ వోలేటి, తానాజి పండరీనాథ్ పట్వారిలను అదుపులోకి తీసుకొని 5 కిలోల 790 గ్రాముల మెఫోడ్రోన్ అనే డ్రగ్స్, డ్రగ్స్ తయారు చేసేందుకు వినియోగిస్తున్న 35500 లీటర్ల కెమికల్స్, 950 కిలోల పౌడర్ స్వాధీనం చేసుకొన్నారు. పెద్ద పెద్ద డ్రమ్స్‌లో ఉన్న ఈ ముడిసరుకునంతా శనివారం ముంబికి తరలించి మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నారు.

## మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వెన్నులో వణుకు పుట్టించిన
# పోరాట యోధుల్లో రావి నారాయణరెడ్డి ధీరుడు



### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ వర్గాల నుంచి ప్రజలను రక్షించడంతో పాటు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తే లక్ష్యంగా సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వెన్నులో వణుకు పుట్టించిన పోరాట యోధుల్లో రావి నారాయణరెడ్డి ధీరుడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. హైదరాబాద్, బంజారాహిల్స్, రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం ‘‘పద్మవిభూషణ్’ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సభ జరిగింది. ముందుగా రావి నారాయణరెడ్డి విగ్రహానికి నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రాజిరెడ్డి, స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్ రావు, రావి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడిదే భూమి అనే నినాదం స్ఫూర్తితోనే రావినారాయణరెడ్డి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటాలు ప్రారంభించారన్నారు. నిజాం వ్యతిరేక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలతో కలిసి రావి నారాయణ రెడ్డి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగంగా తన కున్న 700ఎకరాల్లో 500ఎకరాలను పేదలకు పంచారని, ఈ స్ఫూర్తితోనే ఆచార్య వినోబాభావే భూదాన ఉద్యమం ప్రారంభించారని వివరించారు. 1951–52లో స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) పార్టీ అభ్యర్థిగా పోటీచేసి దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పార్లమెంటు సభ్యుడినిగా రికార్డు సృష్టించారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా నిజాం నిరంకుశ పాలనను పెకిలించేందుకు పిడికిలి బిగించిన ధీశాలి అని, నమ్మిన సిద్ధాంతాన్ని తుదిశ్వాస వరకూ ఆచరించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని, అయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాటాలు నిర్మించాలని కె. నారాయణ కోరారు.

**రావినారాయణ రెడ్డి సేవలు భావితరాలకు ఆదర్శనీయం: కూనంనేని**

కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణ రెడ్డి వంటి కమ్యూనిస్టుల త్యాగాలతోనే హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్ లో విలీనమైందన్నారు. ఆనాడు హిందువులు, ముస్లింలు అంత ఏకమై నియంతృత్వ నిజాం కు వ్యతరేకంగా పోరాడి నిజాం సంస్థానాన్ని కూల్చివేశారని, నేడు కొందరు దీనిని మతం రంగు పులిమి తమ రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని, దీనిని సహించబోమని హెచ్చరించారు. రావి నారాయణరెడ్డి సేవలు ఈ నేలపై అజరామరం. భావితరాలకు ఆదర్శనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.ప్రేమ్ పావని, విజయలక్ష్మి పండిత్, రామస్వామి, ప్రభులింగం, కె.నరసింహరెడ్డి, ఆరుట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు గర్వించదగిన నాయకుడు రావి నారాయణ రెడ్డి

### సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజలు గర్వించదగిన నాయకుడు రావి నారాయణ రెడ్డి అన్ని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావినారాయణరెడ్డి 34 వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, నాయకులు కొండలరావు, రవి, సైదులు విజయ్ అడివయ్య, ఎఐఎస్ఎఫ్ నాయకులు అనిల్, అరుణ్ సుశాంత్, కె.అరుణ్, మౌలాలి, కార్యాలయ సిబ్బంది శ్రీరాములు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గాంధీ చేస్తున్న ఉద్యమానికి ప్రభావితుడైన రావి నారాయణరెడ్డి కాకినాడలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారని, నిజం రాచరికానికి వ్యతిరేకంగా భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా రావి నారాయణ రెడ్డి ఆంధ్రమహాసభలో చేరారని వివరించారు. రావి నారాయణ రెడ్డి సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని, కేంద్ర ప్రభుత్వం రావి నారాయణరెడ్డికి ‘పద్మ విభూషణ్’ అవార్డు ఇచ్చి గౌరవించిందని తెలిపారు. యువతరాన్ని ప్రోత్సహించిన ఆదర్శ నాయకులు రావి నారాయణరెడ్డి అని రామకృష్ణ అన్నారు.

ఈటి నరసింహ మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి పార్టీ, ప్రజాప్రతినిధిగా అనేక అవకాశాలు ఉన్నప్పటికీని వాటన్నింటిని త్యజించి యువతరానికి అవకాశాలు కల్పించాలని క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ స్టేట్‌లో సంవత్సరాల తరబడి వివక్ష అనుభవిస్తూ విద్యకు దూరంగా ఉన్న దళితుల కోసం అనేక పాఠశాలలను ఏర్పాటు చేసి, వారికి ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో రావి నారాయణరెడ్డి పాత్ర చిరస్మరణీయమని గుర్తు చేశారు. భవిష్యత్తులో రావి నారాయణ రెడ్డి స్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలను నిర్వహించి, ఆయనకు ఘనమైన నివాళులు అర్పిస్తామన్నారు.



## పామాయిల్ ఫ్యాక్టరీని మంత్రి తుమ్మల తనిఖీ

ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరచూ ఫ్యాక్టరీ బ్రేక్ డౌన్‌పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా పదిలక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు అవుతుందని, 31జిల్లాల్లో 20లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు తెలిపారు. ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాలు చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు. సిద్దిపేట పామాయిల్ ఫ్యాక్టరీని త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించినట్లు తెలిపారు. ఆత్మగౌరవంతో ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికే హబ్ మారనుందని అన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, రైతులు ఆదిశగా అంతర పంటలను వేయాలని సూచించారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీలు ఏర్పాటుతో ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా, మండల అధికారులు, ఇతర శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మనుషులు చేసిన పోరాటమే సాయుధ పోరాటం

### ఈనెల 11నుండి 17వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు
### నల్లగొండలో 10న సురవరం సంస్మరణ సభ
### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




ప్రజాపక్షం/నల్లగొండ : భూమికోసం, భుక్తి కోసం దొరలు, భూసాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బిజెపి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో మాగ్ధుమ్ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం తెలంగాణ అగ్నికణంగా మారిందని అన్నారు. ఈ పోరాటంలో నాలుగువేల అమరవీరుల రక్త తర్పణంతో చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా దొరలు, భూస్వాముల లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంపిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మట్టి మనుషులు చేసిన మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావలసిన పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గుచేటని, దీనిని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17 వరకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా సాయుధ పోరాట చరిత్ర గలిగిన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో 11వ తేదిన అమరవీరుల స్థూపం వద్ద సాయుధ పోరాటం వారోత్సవాలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలాన వ్యాపారస్తులు కూడా యూరియాను కృత్రిమ కొత్తగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్ రెడ్డి, లోడింగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం,బంటు వెంకటేశ్వర్లు బొల్లగిరినరసింహ,తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్ అంజ చారి, తూము బుచ్చి రెడ్డిలు పాల్గొన్నారు.

**10న సురవరం సంస్మరణ సభ**

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ ఈనెల 10న నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్ లోగల జిఎల్ గార్డెన్ లోనిర్వహించడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట రెడి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. కావున సంస్మరణ సభలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంలో..
# గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర గొప్పది

### గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల కోసం రూ.వంద కోట్లతో ప్రత్యేక నిధి
### రిటైర్డ్ జర్నలిస్టులకు ఇహెచ్‌ఎస్ పెన్షన్ కల్పించేందుకు కృషి
### గ్రూప్ తగాదాలు లేని సంఘంగా గజ్వేల్ ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు
### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్ : తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరినీ ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంలో గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర గొప్పదని మాజీమంత్రి హరీశ్ రావు కొనియాడారు. అలాగే మెతుకు సీమలో రైతులు ఆత్మహత్యల నివారణపై కార్యాచరణ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారని తెలిపారు. మనం చేసిన మంచి పనులే జీవితంలో శాశ్వతంగా నిలుస్తాయని చెప్పారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్, ప్రజ్ఞాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లతో పాటు గ్రామీణ విలేకరులకు బస్సు పాసులు అందించారని, జర్నలిస్టుల కోసం వంద కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ఇహెచ్ఎస్ ఏర్పాటుకు అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పారు.

**ప్రజల భావాలను తెలిపేది విలేకరులే : మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

ప్రజల భావాలను తెలిపేదే విలేకరులని, చట్టాన్ని, రాజ్యాంగాన్ని అమలుపరిచేది న్యాయవ్యవస్థ, పత్రికా వ్యవస్థ అని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాజీ మంత్రి హరీష్‌రావుతో కలిసి మాట్లాడారు. తెలంగాణలో గజ్వేల్ ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక పేరు ప్రతిష్ఠలు ఉన్నాయని, గజ్వేల్ జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికి తీసి చైతన్యానికి మేలితం చేశారని, ఎన్నో సామాజిక కార్యక్రమాలకు పురుడుపోశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి సెంట్రల్ జైలుకు పంపితే ఆ సమయంలో జర్నలిస్టుల పక్షాన బషీర్‌బాగ్‌లో విధులను బహిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు దిగివచ్చి సెంట్రల్ జైలు నుండి జర్నలిస్టులను విడుదల చేశారని గుర్తుచేశారు. అలాగే మెదక్‌లో జర్నలిస్టు యాదగిరిని హత్య చేయగా ఆ కుటుంబానికి న్యాయం చేసేవరకు పోరాటం చేసి అప్పటి సిఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించడం వెనుక ఉమ్మడి మెదక్ జిల్లా జర్నలిస్టుల ఐక్యత ఘనత అన్నారు. జర్నలిస్టులు పావురాల్లాంటి వారని శాంతి, అభివృద్ధి కోరుకుంటారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో గతంలో పనిచేసిన మాజీ సిఎంలు జర్నలిస్టులకు 150 ఎకరాలకు పైగా ఇంటి స్థలాల కోసం భూములు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ అంశం ప్రస్తుతం సమస్యగా మారిందని, సుప్రీం కోర్టుకు వెళ్లారని చెప్పారు. వ్యవస్థలన్నీ సవరించినప్పుడే న్యాయం జరుగుతుందని అన్నారు. మరో వారంలో రోజుల్లో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకోసం సిఎం రేవంతో చర్చించినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజానికి ఎంతో కొంత మంచి చేయాలని తపన ఉన్నవారు మాత్రమే జర్నలిజం వృత్తిలోకి రావాలని సూచించారు. మీడియా అకాడమీ ద్వారా విలువల్లేని జర్నలిస్టులను పక్కన పెట్టేందుకు వెనుకాడవద్దని కోరారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ప్రెస్‌క్లబ్‌లు ఉన్నప్పటికీ గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఏకైక ప్రెస్‌క్లబ్ గజ్వేల్ ప్రెస్ క్లబ్ అని అన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్‌పై బురద జల్లడం, ఐక్యతలో విచ్ఛినం చేసేందుకు కొన్ని శక్తులు కుట్రపన్నగా, ఆ శక్తులకు మేము తెచ్చిన సావనీర్ సమాధానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కార్పొరేషన్ చైర్మన్లు ఎలక్షన్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్, ఎఎంసి చైర్మన్లు వంటేరు నరేందర్ రెడ్డి, మోహన్, టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, డియూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు రంగాచారి, టియుడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ లోకసత్తా ఉమ్మడి రాష్ట్రాల సమన్వయ కర్త బండారు రామ్మోహన్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బట్టు దయానందరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సంధబోయిన ఎల్లయ్య, సీనియర్ విలేకరులు సత్యనారాయణ, ఎల్లారెడ్డి, విజయానందరెడ్డి, సురేందర్, మధు సూదన్, యాదగిరి, కిరణ్, కృపాకర్, నర్సింలు, మునీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నిజాంసాగర్ ద్వారా 28,852 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మొత్తం 28,852 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుందని నీటిపారుదలశాఖ అధికారులు ఆదివారం సాయంత్రం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు 17.802 టీఎంసీలు కాగా ప్రస్థుతం 1404.92 అడుగులు, 17.687 టీఎం సీల నీరు నిల్వ ఉందని ఎగువ ప్రాంతం నుండి 22,160 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోగా వస్తుందన్నారు. కాగా ప్రధాన పంట కాలువ ద్వారా 1500ల క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు 4 వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది.



## రావి నారాయణరెడ్డికి సిఎం నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీర తెలంగాణ ముద్దుబిడ్డ, రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఆదివారం ఘనంగా నివాళుల ర్పించారు.

## ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి కొనసాగే అర్హత లేదు

-ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలే మార్గం

-సిసిఏ సదస్సులో పరకాల ప్రభాకర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓట్లు చోరీ చేసి గెలిచిన కేంద్ర ప్రభుత్వానికి, చోరీకి సహకరించిన కేంద్ర ఎన్నికల సంఘానికి కొనసాగే అర్హత లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీ తోనే అధికారంలోకి వచ్చిందని ఈ విషయాన్ని జన బహుళ్యంలోకి తీసుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఏ) ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో కంచె చేను మేసినట్లు ఎన్నికల సంఘం ఓట్లను తొలగించిన నేపథ్యంలో ప్రక్షాళన ప్రారంభం ఎన్నికల సంఘం ఎవరి పక్షం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి 2024 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజ్యాంగ సవరణ కమ్యూనల్, జమ్ము అండ్ కశ్మీర్ తదితర అంశాలతో ఎన్నికలకు వెళ్లాలని భావించిందని తొలి దశలోనే ప్రజల్లో వ్యతిరేకత కనపడడంతో ఓట్ల చోరీపై దృష్టి సారించిందని ప్రభాకర్ తెలిపారు. 2024 ఎన్నికలు అవకవతకలతో కూడిన ఎన్నికలని ఇంత చేస్తేనే అధికారంలోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ కారణంగా పార్లమెంట్ పవిత్రతను కోల్పోయిందని పవిత్రత కోల్పోయిన పార్లమెంటుకు కొనసాగే అర్హత లేదన్నారు. జనాభిప్రాయంతో ప్రస్తుత పార్లమెంటు ఏర్పాటు కాలేదని ప్రస్తుత ఎన్నికల సంఘం చోరీ కారణంగానే అధికారంలో కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్యం ఊపిరిపోసుకోవాలంటే ప్రస్తుత కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుత బిజెపి ప్రభుత్వ పాలనపై ప్రజలు బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఒక రోజో రెండు రోజులకో పరిమితమై ఆందోళనలు చేస్తే మార్పు రాదన్నారు. సుదీర్ఘ ఉద్యమాలు జరగాలని ప్రజాస్వామ్య పరిరక్షణకు ఖమ్మం నాంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు. మణిపూర్ ఆందోళనల మాదిరి ఒకట్రెండు ఆందోళనలకు పరిమితమైతే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం సుదీర్ఘ కాలం బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా జాతీయత పరంగా నష్టం చేస్తున్న బిజెపిని సాగనంపడంతోనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని పరకాల ప్రభాకర్ తేల్చి చెప్పారు. ఈ సదస్సుకు డాక్టర్ యలమంచిలి రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించగా రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంఘాల ప్రముఖులు, ప్రత్యామ్నాయ పౌర సమాజం బాధ్యులు హాజరయ్యారు.

# పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు కీలక దశకు





ప్రజాపక్షం/హైదరాబాద్ : పాతబస్తీ మెట్రో రైలు కారిడార్ నిర్మాణానికి అవసరమైన స్థలం (రైట్ ఆఫ్ వే) లభించే కీలక దశకు పనులు చేరుకున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 7.5 కిలోమీటర్ల ఈ కారిడార్‌లో ప్రభావిత ఆస్తుల స్వాధీనం, వాటి కూల్చివేతలు, రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పాతబస్తీ ప్రజల కలల ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రభావిత ఆస్తుల సంఖ్య తగ్గింపు..

మొదట 1100గా అంచనా వేసిన ప్రభావిత ఆస్తుల సంఖ్య, వినూత్న ఇంజినీరింగ్ పరిష్కారాలను అమలు చేయడం ద్వారా 886కు తగ్గిందని ఎన్‌విఎస్ రెడ్డి రెడ్డి చెప్పారు. ఇప్పటికే దాదాపు 550కి పైగా ఆస్తుల కూల్చివేతలు పూర్తయ్యాయి. మిగిలిన ఆస్తులను కూడా కూల్చివేసే పనులు జరుగుతున్నాయి. ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇప్పటివరకు రూ. 433 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్టు ఆయన తెలిపారు. వర్షాలు, పండుగలు, మొహర్రం వంటి సందర్భాలలో కూడా స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహిస్తున్నామన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం..

మెట్రో స్తంభాలు, స్టేషన్ల నిర్మాణానికి సన్నాహక పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం సజావుగా సాగేందుకు నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి పెట్టినట్టు ఆయన తెలిపారు.


డిజిపిఎస్ సర్వే ఖచ్చితత్వాన్ని పెంచడానికి 'డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్' (డిజిపిఎస్) సర్వేను ఉపయోగిస్తున్నారు. ఇది సాంప్రదాయ సర్వే పద్ధతులకు భిన్నంగా వేగవంతమైన, బహుముఖ డిజిటల్ ఫలితాలను అందిస్తుంది. ఈ డేటాను గతంలో చేసిన డ్రోన్ సర్వే డేటాతో అనుసంధానించడం వల్ల ప్రాజెక్టు అమలు మరింత వేగవంతం అవుతుంది. పురాతనమైన రోడ్ల కింద ఉన్న నీటి సరఫరా లైన్లు, మురుగునీరు, విద్యుత్, టెలికాం లైన్లను గుర్తించడానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జిపిఆర్) సర్వే నిర్వహిస్తున్నారు. మెట్రో స్తంభాల పునాదులు వేసే ముందు ఈ యుటిలిటీలను పక్కకు మళ్లించడంలో హైదరాబాద్ జల మండలి, జిహెచ్‌ఎంసి, టిజిఎస్‌పిడిసిఎల్, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి ఏజెన్సీల సహకారం తీసుకుంటున్నారు. మెట్రో నిర్మాణాల బరువును తట్టుకునేలా నేల బలం, భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేయడానికి భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలైన్‌మెంట్‌కు మార్గంలో ఉన్న సున్నితమైన నిర్మాణాలను గుర్తించి, వాటికి ఎటువంటి నష్టం కలగకుండా పనులు చేస్తున్నారు. పనులను సజావుగా చేపట్టేందుకు నిర్దేశిత నిడివిలో 100 మీటర్లకు ఒకటి చొప్పున మైలురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సాంకేతిక, సన్నాహక పనులు పూర్తయిన వెంటనే మెట్రో రైల్ నిర్మాణాలు ప్రారంభం అవుతాయని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు.

## పోలీసులకు హ్యాట్సాఫ్: కమిషనర్ సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసినందుకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ పోలీసులకు హ్యాట్సాఫ్ చెప్పారు. ఆదివారం రెండో రోజు హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనం పూర్తి అయ్యింది.ఈ సందర్భంగా హుస్సేన్‌సాగర్ వద్ద సివి ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ..48 గంటల పాటు స్టాండ్ డ్యూటీ నిర్వహించిన పోలీసులకు ఆయన అభివాదం చేశారు. పోలీసు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా హైదరాబాదు నగరంలో 12030 విగ్రహాలు నమోదయ్యాయని, వీటిలో ప్రదాన నిమజ్జనానికి ముందురోజుల్లో 7330 విగ్రహాలు నిమజ్జనము చేశాకరని, మిగతావి 4,700 విగ్రహాలు ప్రధాన నిమజ్జన కార్యక్రమములో నిమజ్జనము ఆదివారం పూర్తయ్యిందన్నారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర దాదాపు 40 గంటల పాటు కొనసాగిందన్నారు. ఈసారి కొన్ని విగ్రహాల ఎత్తు 40 అడుగుల కంటే ఎక్కువగా ఉండడం వల్ల శోభాయాత్ర కొంత ఆలస్యమైందన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేయడానికి పోలీసులు రెండు రోజులు నిద్ర లేకుండా పనిచేశారని తెలిపారు. 9 డ్రోన్లు, 35 హైరైజ్ భవనాలపై కెమెరాలను ఉపయోగించి నిఘా పెట్టామని తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో నిమజ్జనం ముందుగానే పూర్తయిందనాన్నారు. సెంట్రల్ జోన్ పోలీసులు, జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌టిఎ, హెచ్‌ఎండిఎ వంటి వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం వల్ల నిమజ్జనం విజయవంతమైందన్నారు.నిమజ్జన ఊరేగింపులో చిన్నపాటి గొడవలకు సంబంధించి 5 కేసులు నమోదుకాగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 170 మందిని, పిక్ పాకెటింగ్ కేసుల్లో మరికొందరిని పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి నేరాల సంఖ్య తగ్గిందని కమిషనర్ మండప నిర్వాహకులు ఆలస్యంగా నిమజ్జనానికి బయలుదేరినా, అన్ని విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కు పంపించగలిగామని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం శాంతియుత వాతావరణంలో జరుగుతున్నందుకు ప్రజలకు, గణేశ్ ఉత్సవ సమితి వారికి మండప నిర్వాహకులకు హైదరాబాద్ సిటీ పోలీస్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయడంలో పోలీసులకు సమన్వయంతో సహకరించినందుకు మండప నిర్వాహకులను ఆయన అభినందించారు. దాదాపు 40 గంటల పాటు అవిశ్రాంతంగా కృషి చేసిన పోలీసు సిబ్బంది మరియు అధికారులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిజిఐసిసిసి మల్టీ ఏజెన్సీ వార్ రూమ్‌లో అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేస్తూ, సమస్యలను పరిష్కరించి, నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా పోలీసులకు సహకరించారని, అందుకు వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.అదనపు సిపిలు విక్రం సింగ్ మాన్, పి. విశ్వప్రసాద్, ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డి. జోయల్ డెవిస్, సిసిఎస్ డిసిపి ఎన్. స్వేతా, సెంట్రల్ జోన్ డిసిపి కె.శిల్పా వలి, సిఎఆర్ డిసిపి రక్షిత కృష్ణ మూర్తిలు పాల్గొన్నారు.

## కాళోజీ కళాక్షేత్రంలో కళాకారులకు పురస్కారాలు



**ప్రజాపక్షం/వరంగల్ సిటి :** శాంతి కృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ లో ఉన్న 108 మంది కళాకారులకు కాకతీయ కళావైభవం పేరిట ఘనంగా పురస్కారం అందించారు. అనంతరం గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత డాక్టర్ శాంతి కృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల్లో ఒక వెయ్యి 112 మహోన్నతమైన అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల్ని నిర్వహించడం జరిగిందని, ప్రపంచంలోనే అత్యధిక ఎక్కువ ప్రోగ్రాం చేసినటువంటి ఆర్గనైజేషన్ గా శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డును కూడా సాధించి అటు తెలంగాణ రాష్ట్రానికి ఇటు మన ఓరుగల్లు కీర్తిని ప్రపంచ స్థాయిలో నిలిపినటువంటి సంస్థగా శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ముందున్నదని చెప్పారు. ఎంతో కళలకు కాణాచిగా ఉన్నటువంటి ఓరుగల్లును ఇష్టపడి కాళోజి కళాక్షేత్రం బ్రహ్మాండమైనటువంటి కళాకారులను గుర్తించే దిశగా ముందుకెళ్లాలనే అంశంతో గత ప్రభుత్వం వారు శంకుస్థాపన చేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి పనిని పూర్తి చేసి ప్రారంభించారని, ఈ కళాక్షేత్రం కళాకారులకు అందుబాటులోకి రావాలని తాను మనస్ఫూర్తిగా ప్రభుత్వం వారికి విజ్ఞప్తి చేస్తున్నాని చెప్పారు.

## శోభాయాత్రలో అపశ్రుతులు...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో సాగిన గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమంలో ఆయా ప్రాంతాల్లో కొన్ని అపశ్రుతులు దొర్లాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

**అగ్నిప్రమాదం..**

గోషా మహల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బేగంబజార్‌లోని నాగర్ ఖానా నుండి 2 అడుగుల ఎత్తు గల గణేష్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనం కోసం టస్కర్ వాహనంలో తీసుకెళ్తుండగా చుడీ బజార్ సమీపంలోకి రాగానే విద్యుత్ ఘాతంలో మంటలు అంటుకున్నాయి.నిర్వాహకుడు అనుజ్ ఓఝా వెంటనే మంటలను ఆర్పివేసి, ట్యాంక్ బండ్‌కు బదులుగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో గణేష్ విగ్రహ నిమజ్జనం చేశారు.

**యువకుడిపై దాడి..**

ఆసిఫ్ నగర్ లోని జెబా బాగ్ కు చెందిన హమీద్ ఉద్దీన్ అనే వ్యక్తి మహమ్మద్ ఇలియాజ్ (21) జిమ్ నుండి తిరిగి వస్తుండగా, మెహ్రాజ్ ఎక్స్ రోడ్ వద్ద రోడ్డు దాటుతుండగా, మూడు బైక్ లపై 4–5 మంది అబ్బాయిలు గణేష్ విగ్రహం టస్కర్ లారీ వెనుక నుండి వచ్చి, అతని బైక్ ను ఢీకొట్టి, అతనితో వాదించి, అతని చేతులతో దాడి చేశారు. అక్కడ ఉన్న పోలీసు అధికారి జోక్యం చేసుకున్నాడు, ఆ తర్వాత వారిని చెదరగొట్టారు.ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది

**కారుపై పడ్డ గణేషుడు..**

మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వాహకుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో మారుతి మందిర్ నుండి గణేష్ విగ్రహాన్ని సరూర్‌నగర్ సరస్సు వైపు నిమజ్జనం కోసం తీసుకెళ్తుండగా, విగ్రహం దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ సమీపంలో కేబుల్ వైర్‌కు తగిలి రోడ్డుపై ఉన్న కారుపై పడింది, దీని వలన కారు దెబ్బతింది. విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. ప్రజలకు ఎటువంటి గాయాలు కాలేదు. ఇంకా పడిపోయిన విగ్రహాన్ని మరొక టస్కర్ వాహనంపైకి మార్చి నిమజ్జనం కోసం సరూర్‌నగర్ సరస్సుకు తరలించారు.

**కూలిపోయిన గణేషుడు..**

మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో 20 అడుగుల ఎత్తు గల గణేష్ విగ్రహం దిల్‌సుఖ్‌నగర్ నుండి నిమజ్జనం కోసం సరూర్‌నగర్‌కు తీసుకెళ్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా టెంపుల్ వద్ద యు తీసుకున్నారు. ఈ క్రమంలో గణేష్ వాహనం డిసిఎం ఎపి 29 యు 1656 ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టడంతో, వెంటనే డిసిఎం నుండి గణేష్ విగ్రహం కూలిపోయింది.

**యువకుడిపై మద్యం బాటిల్‌తో దాడి..**

మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో సలీంనగర్‌లో జరుగుతున్న శోభాయాత్రలో పాల్గొన్న వైష్ణవ్‌సింగ్ అలియాస్ సోను తనను దుర్భాషలాడిన వివేక్ సింహా (22)పై మద్యం బాటిల్‌తో దాడి చేఇస తలకు గాయం చేశాడు.

**ఊరేగింపులో కత్తితో సంచారం..**

లంగర్‌హౌస్ పోలీసు స్టేషన్ పరిధిలో కత్తితో సంచరిస్తున్న శ్రీవైష్ణవి కళాశాలకు చెందిన విద్యార్థి నమన్ ప్రసాద్ (18)తోపాటు మరో వ్యక్తిని ఎస్‌ఐ సతయ్యగౌడ్ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కత్తి ఎందుకు పట్టుకుని తిరుగుతున్నాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**డిజెను సీజ్..**

ఐఎస్ సదన్ పోలీసు స్టేషన్ పరిధిలో సౌత్‌ఈస్ట్ జోన్ డిసిపి శోభాయాత్రలో ఉపయోగించిన డిజెను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత గణేష విగ్రహాన్ని నిర్వాహకులు రవితేజ వినయ్‌నగర్ వద్ద డిసిపితో వాగ్వివాదానికి దిగడంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది.

**జిహెచ్‌ఎంసి స్వీపర్ మృతి..**

సైఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో విధినిర్వహణలో ఉన్న గుడిమల్కాపూర్‌కు చెందిన జిహెచ్‌ఎంసి స్వీపర్ రేణుఖ (35) బషీర్‌బాగ్‌లిబర్టీ రోడ్డులో ప్రమదావశాత్తు నిమజ్జనానికి తరలుతున్న టాస్కర్ వాహనం టైర్ కింద పడింది. ఆమె తలకు తీవ్ర గాయమై లిబర్టీలోని ఆద్య నర్సింగ్ హోమ్ కు తరలించారు, అక్కడ డ్యూటీ డాక్టర్ ఆమెను చనిపోయినట్లు ప్రకటించారు. ఈ వాహనం మలక్ పేట్ నుండి ట్యాంక్ బండ్ వరకు జరిగిన గణేష్ ఊరేగింపులో పాల్గొంది.

**ప్రార్థనమందిరంలోకి విసిరిన బాటిల్స్..**

అఫ్జల్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వర్గానికి చెందిన ప్రార్థన మందిరంపై గుర్తు తెలియని దుండగులు బీర్ బాటిల్స్‌ను విసిరారు. నిందితులను సిసిటివి కెమెరాల ద్వారా గుర్తించి అరెస్టు చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు.




తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రజాపక్షం ఎగ్జిక్యూటివ్‌ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, టియూడబ్ల్యూజే డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాములు, కార్యదర్శి వి.యాదగిరి, హైదరాబాద్ ప్రెస్ కోశాధికారి రాజేష్ ,హెచ్ యుజె అధ్యక్షులు శిగ శంకర్ గౌడ్ వెంకటేష్ ,అనిల్ కుమార్

# ఎన్నాళ్లీ యాతన

• ముందుకు సాగని రిజర్వేషన్ ప్రక్రియ


• జరగని స్థానిక ఎన్నికలు • సమస్యల వలయంలో పల్లెలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రిజర్వేషన్ చిక్కుముడి నడుమ స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. స్థానిక సంస్థల్లో వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి రకరకాల కారణాలతో కాలయాపన జరుగుతుంది. ఎన్నికలు లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి వచ్చినా ఏమి చేయలేని సంకట స్థితిలో ఉన్నది. ఈ స్థితిలో 42 శాతం రిజర్వేషన్ లేకుండా పార్టీ పరమైన పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఎన్నికలకు వెళితే ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఒకవేళ 42 శాతం రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధతతో ముందుకు వెళ్లాలంటే చట్టపరమైన అనేక చిక్కులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఇప్పుడు తెలంగాణ పరిస్థితి విడవమంటే పాముకు కోపం కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ వర్గాలు ఏమి చెబుతున్నా ఎన్నికల జాబితాలు తుదిదశకు చేరుకున్న ఎన్నికల ప్రక్రియ కోసం మరి కొంత కాలం వేచిచూడక తప్పదన్నది వాస్తవం. 42 శాతం బిసిలకు రిజర్వేషన్ అమలుకు సంబంధించి కొంత వేచిచూసే ధోరణి అవలంభించిన ఫర్వాలేదన్న సానుకూల ధృక్పథం అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న కానీ పంచాయతీల్లో సమస్యలు మాత్రం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగిసి 20 మాసాలు కావస్తున్నా ఎన్నికలు జరగకపోవడంతో స్థానిక సంస్థలకు నిధులు లేవు. విధులు తప్ప నిధులు లేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిస్సయ స్థితిలో ఉన్నారు. బ్లీచింగ్ పౌడర్ అందించే వారు ఉన్న దానిని చల్లేందుకు కూలీలు దొరకడం లేదు. ప్రతి పని ఆర్థికపరమైంది కావడంతో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులుకానీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కానీ అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పల్లెలు సమస్యల పుట్టలుగా మారాయి. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా సహా ఏ సమస్యను పరిష్కరించలేని దయనీయ స్థితి. నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు రావడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల రుణాలు గ్రామ పంచాయతీల మెడకు చుట్టుకున్నాయి. రేపో మాపో బ్యాంకర్లు ట్రాక్టర్లను జప్తు చేసే పరిస్థితి. వీటన్నింటి నడుమ ఏమి చేయాలో పాలుపోక అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో స్థానికులు ముందుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు. వీధి దీపాలు కూడా కొన్ని గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయం. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిధుల రాకకు ముడిపడి ఉన్నందున ఎన్నికలు జరపాలి. ఎన్నికలు జరపాలంటే రిజర్వేషన్ తేలాలి. ఈ రెండింటి నడుమ స్థానిక ఎన్నికలు మరికొంత కాలం ఆలస్యం కావడం అదే సమయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక ఇబ్బందులు కూడా మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్రాంటును విడుదల చేసి పారిశుధ్యం, విద్యుత్, త్రాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉన్నది. ఆ దిశగా ఆలోచన చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇదే సమయంలో గ్రామ పంచాయతీలు తీసుకున్న రుణాలకు సంబంధించి మరికొంత కాలం వాయిదా వేయాల్సిన అవసరం ఉంది.

అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు :

గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గతంలో పంచాయతీలకు నిధులు వస్తాయన్న ఆలోచనతో పంచాయతీ కార్యదర్శులు పనుల నిర్వహణకు అప్పులు తెచ్చారు. కొందరు కార్యదర్శులు రూ. 50వేల నుండి రెండు లక్షల వరకు పంచాయతీ పనుల నిర్వహణకు అప్పులు తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడంతో ఆ అప్పులు అలాగే మిగిలిపోయాయి. ఇంత వరకు గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న కార్యదర్శులు సైతం అప్పులు తెచ్చి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకృతి విపత్తుల నిధుల నుంచి గ్రామ పంచాయతీలకు రెండు లక్షల చొప్పున నిధులను కేటాయించింది. ఆ నిధులతో బ్లీచింగ్, సున్నం చల్లే పనులను పూర్తి చేశారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీల నుండి నిధులను సమకూర్చే వారు. ఇప్పుడు ప్రభుత్వమే మూడు నెలలకు ఒకసారి మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు ఇస్తుంది. గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉన్న ట్రాక్టర్లకు సంబంధించి డీజిల్ సరఫరా చేసిన పెట్రోల్ బంక్ యజమానులు, మెకానిక్ షెడ్ల యజమానులు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెండేళ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. ఇదిలా ఉండగా గతంలో ఇంటి పన్నులను వసూలు చేసి పంచాయతీ కార్యదర్శులు ట్రెజరీల్లో జమ చేసేవారు. ఆ నిధులను పంచాయతీ అవసరాల దృష్ట్యా చెక్కుల రూపంలో డ్రా చేసుకునే వారు. రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు నిధులను డ్రా చేసే పరిస్థితి కనిపించడం లేదు. మొత్తంగా గ్రామ పంచాయతీలు సమస్యల వలయంలో కూరుకుపోయాయి. ఇదిలా ఉండగా గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లుగా ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మూడుసార్లు ఓటర్ల జాబితాలను జిరాక్స్‌లు తీశారు. జిరాక్స్ సెంటర్ల వద్ద ఈ బాకీలు పేరుకుపోవడం గమనార్హం.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రజ్వల్ రేవణ్ణకు జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని..

**బెంగళూరు:** అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న కర్ణాటకలోని హాసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు పరప్పన అగ్రహార జైలులో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటి రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు ఆయన నిర్వహించాలి. ఈ పని చేసినందుకు రోజుకు రూ.522 చెల్లిస్తారు. కాగా, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనవడు, జెడి(ఎస్) సీనియర్ నేత, హోలెనరసిపుర ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ రేవణ్ణపై నమోదైన అత్యాచారం కేసులో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించింది. జైలు నిబంధనల ప్రకారం జీవిత ఖైదు శిక్ష పడిన వారు జైలులో ఏదో ఒక పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిపాలనా పరమైన పనులు చేయడానికి రేవణ్ణ ఆసక్తి చూపినట్లు జైలు అధికారులు తెలిపారు. అయితే ఆయనకు లైబ్రరీ క్లర్క్ పని అప్పగించినట్లు చెప్పారు. మరోవైపు ఖైదీలు సాధారణంగా వారానికి మూడు రోజులు, నెలలో కనీసం12రోజులు జైలులో పనిచేయాల్సి ఉంటుంది. ఆయనకు కేటాయించిన లైబ్రరీ క్లర్క్ పని షెడ్యూల్ పరిమితంగా ఉన్నదని వెల్లడించారు.

## మణిపూర్‌లో ప్రధాని హడావిడి పర్యటన
# రాష్ట్ర ప్రజలను అవమానించడమే

29 నెలలుగా మోదీ రాకకోసం
ఎదురుచూస్తున్న వారికి తీవ్ర నిరాశ : కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 13వ తేదీన కల్లోలిత మణిపూర్‌లో పర్యటించనున్నారు. అయితే ఆయన కేవలం మూడు గంటల పాటు మాత్రమే రాష్ట్రంలో తన పర్యటనను కొనసాగించనున్నారు. దీంతో ప్రధాని తమ రాష్ట్రానికి ఎప్పుడు వస్తారా? తమ సమస్యను ఎలా పరిష్కరిస్తారా? అని గత 29 నెలలుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న రాష్ట్ర ప్రజలు ప్రధాని పర్యటన తీవ్ర నిరాశను కలిగించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని హడావిడి పర్యటన ఆ రాష్ట్ర ప్రజలను అవమానపర్చడమేనని మండిపడింది. 13న మణిపూర్‌లో ప్రధానమంత్రి ప్రతిపాదించిన పర్యటనను ఆయన వీరవిధేయ ప్రశంసిస్తు నానని, కాని ఆయన రాష్ట్రంలో కేవలం 3 గంటలు హడావిడి పర్యటనతో ఆయన ఏమి సాధించాలని ఆశిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో ప్రశ్నించారు. ఈ చర్య సుదీర్ఘకాలంగా ప్రధాని రాకకోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానకరమన్నారు. ప్రధాని మరో సారి మణిపూర్ ప్రజల పట్ల తన నిర్లక్ష్యాన్ని సున్నితత్వాన్ని బయటపెట్టారన్నారు. ప్రధాని మణిపూర్‌లో దాదాపు మూడుగంటల పాటు ఉంటారని ఎక్స్‌లో పేర్కొన్న మీడియా కూడా ఆయన పంచుకున్నారు. కాగా, సెప్టెంబర్ 13న ప్రధాని మణిపూర్‌ను సందర్శించే అవకాశం ఉంది. మే 2023లో మెయితీస్, కుకీ జో మధ్య జాతి హింస చెలరేగిన తర్వాత ప్రధాని రాష్ట్రంలో అడుగుపెట్టనున్నారు. ఈశాన్య రాష్ట్రాన్ని ఉద్దేశ్యంగా సందర్శించడానికి ప్రధాని మోదీ చివరకు ధైర్యం, సాయంత్రానికి కూడగట్టుకుని ఉండవచ్చు, కానీ అది 'చాలాఆలస్యం' కావచ్చు అని కాంగ్రెస్ గతవారం పేర్కొంది. మే 2023 నుండి మెయితీస్, కుకి జో గ్రూపుల మధ్య జరిగిన జాతిహింసలో 260 మందికి పైగా మరణించారు, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. 2027వరకు పదవీకాలం ఉన్న రాష్ట్ర అసెంబ్లీని సస్పెండ్ చేశారు.

## మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ రాష్ట్రాల
# గణేశ్ నిమజ్జనోత్సవాల్లో విషాదం

వేరువేరు ఘటనల్లో ఏడుగురు మృతి

**ముంబయి/భోపాల్ :** మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవాలలో విషాదం చోటుచేసుకుంది. వేరు వేరుచోట్ల జరిగిన ఘటనల్లో ఏడుగురు మరణించారు. వీరిలో కొందరు నీట మునిగి మరణించారు. పదిరోజులపాటు జరిగిన గణపతి ఉత్సవాలు,నిమజ్జనోత్సవాలలో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. మహారాష్ట్రలోపి థానే,పుణె,నాందేడ్,నాసిక్, జల్‌గావ్,అమరావతి జిల్లాలలోని వివిధ చెరువులు, కాలువల వంటి ప్రదేశాలలో గణేశ్ నిమజ్జనాల సందర్భంగా నీట మునిగి నలుగురు మరణించారు. మరో 13 మంది జాడతెలియలేదని అధికారులు ఆదివారం ప్రకటించారు. ముంబయి నగరంలో గణపతి మహారాజ్‌కు ఈ ఏడాదికి తుది వీడ్కోలు పలికేందుకు లక్షలాదిమంది ప్రజలు అనేకచోట్ల ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విద్యుదాఘాతం కారణంగా ఒక వ్యక్తి మరణించగా, మరో ఐదుగురికి గాయాలు తగిలాయి. సకినాక ప్రాంతంలోని ఖైరాని రోడ్డులో గణేశుడి విగ్రహం రోడ్డుమీద వేలాడుతున్న ఒక విద్యుత్ వైరును తాకడంతో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ రైసన్‌జిల్లా ఘట్కేడా గ్రామంలో గణేశ నిమజ్జనం సందర్భంగా శనివారం రాత్రి ఇద్దరు టీనేజీ విద్యార్థులు నదిలో మునిగిపోవడంతో మరణించారు. అదేవిధంగా ఆదివారం ఉదయం ముంబయిలోని గిరిగావ్ ఛౌపట్టివద్ద జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ వేలాదిమంది భక్తులు లాల్‌బౌగ్చా, ఇతర గణపతుల నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. ముంబయి పొరుగున పాల్ఘర్‌జిల్లా విరార్‌లోని నారంగ్‌జెట్టీలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా శనివారం సాయంత్రం నదిలో ముగ్గురు కొట్టుకుపోయారు. ఐతే తర్వాత వారిని రో–రో బోటు సహాయంతో నీటి ప్రవాహం నుండి కాపాడారు.



### లాల్‌బాగ్చారాజా తరలింపులో సాంకేతిక సవాళ్ళు, జాప్యం

ముంబయిలోని లాల్‌బౌగ్చా రాజా విగ్రహ నిమజ్జనోత్సవం అనేకగంటల పాటు జాప్యం జరిగింది. ఎంతో బరువైన విగ్రహాన్ని తరలించేందుకు సాంకేతికంగా పెద్ద సవాళ్ళు ఎదురయ్యాయి. ఎట్టకేలకు విగ్రహాన్ని ఊరేగింపు గద్దెమీదకు ఎక్కించి తరలించారు. ఈ విగ్రహాన్ని సాధారణంగా అరేబియా సముద్రంలో రాత్రి తొమ్మిది గంటలలోపే నిమజ్జనం చేస్తారు. కానీ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ప్రదేశం నుండి తరలించడానికి అనేక సవాళ్ళు ఎదురుకావడంతో ఎనిమిది గంటలపాటు ఆలస్యం జరిగింది. లాల్‌బాగ్ నుండి ఈ విగ్రహ ఊరేగింపు శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన 28 గంటల తర్వాత గిర్‌గావ్ ఛౌపట్టికి వద్దకు చేరింది. ఎట్టకేలకు వందలమంది వాలంటీర్లు విగ్రహాన్ని మోసి కొత్తగా నిర్మించిన ఫ్లాట్‌ఫాం మీదకు తరలించి ఎట్టకేలకు సముద్రంలో నిమజ్జన కార్యక్రమం పూర్తిచేశారు.

## పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో 9న మోదీ పర్యటన



**చండీగఢ్ :** హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లోని వాటి పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షం కారణంగా ఉప్పొంగిన సట్లెజ్, బియాస్, రావి నదులు, వాగులు పంజాబ్‌లోని అనేక ప్రాంతాలను ముంచెత్తాయి. అంతేకాకుండా, గత కొన్ని రోజులుగా పంజాబ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు వల్ల వరదలు మరింత తీవ్రతరం చేశాయి. పంజాబ్ ప్రస్తుతం దశాబ్దాలలో అత్యంత దారుణమైన వరద విపత్తును ఎదుర్కొంటోంది. వరదల కారణంగా ఇప్పటివరకు 46 మంది మరణించగా, 1.75 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వరద పరిస్థితిని సమీక్షించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 9న రాష్ట్రంలో పర్యటిస్తారని బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సునీల్ జాఖర్ ఆదివారం తెలిపారు. పంజాబ్‌లో వరద పరిస్థితిపై మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, దానిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. పంజాబ్ ప్రజలకు గరిష్ట సహాయం అందించడానికి స్థానిక పరిస్థితులను వ్యక్తిగతంగా అంచనా వేయడానికి, వాస్తవాలను అర్థం చేసుకోవడానికి మోదీ మంగళవారం పంజాబ్‌లో పర్యటించనున్నట్లు జాఖర్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రంలో పరిస్థితిని అంచనా వేయడానికి పంజాబ్‌ను సందర్శించారు. వరదల వల్ల సంభవించిన నష్టాన్ని అంచనా వేయడానికి సందర్శించిన రెండు కేంద్ర ప్రభుత్వ బృందాలు తమ పర్యటన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి తమ నివేదికలను సమర్పించనున్నాయి. భారత ప్రభుత్వం పంజాబ్ ప్రజలకు అండగా నిలుస్తుంది అని జఖర్ పేర్కొన్నారు. పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను చౌహాన్ ఈనెల 4న సందర్శించి పంట నష్టం ఎంతవరకు ఉందో పరిశీలించి, దానిని 'జల్ ప్రలై (వరద)' పరిస్థితిగా అభివర్ణించారు. ఈ సంక్షోభం నుండి రైతులకు ఉపశమనం కలిగించడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అమృత్‌సర్, గురుదాస్‌పూర్, కపుర్తల జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను మంత్రి సందర్శించారు.

## దేశ రాజకీయాలలో పరివర్తన కలిగించిన
# 'భారత్ జోడో యాత్ర'



3వ వార్షికోత్సవం సందర్భంగా స్పందించిన కాంగ్రెస్
ప్రజాసమస్యలు ఎలుగెత్తడమే యాత్ర ఉద్దేశం : జైరామ్‌రమేష్

**న్యూఢిల్లీ :** భారత్ జోడో యాత్ర 3 వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ దీనిపై స్పందించింది. భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాలలో ఒక పరివర్తన కలిగించే మైలురాయి అని అభివర్ణించింది. ఈ యాత్ర నిరవధికంగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర 3ఏళ్ల క్రితం ఇదే రోజున కన్యాకుమారి వద్ద ప్రారంభమైందన్నారు. స్వామి వివేకానంద శిలా స్మారక చిహ్నాలు, ఇతర ప్రసిద్ధ ప్రదేశాల సందర్శించి చివరిగా ఒక బహిరంగ సభలో పాల్గొననున్నారని తెలిపారు. పెరుగుతున్న అసమానతలు, లోతైన సామాజిక ధృవణత, అధికమవుతోన్న రాజకీయ నిరంకుశత్వం వంటి ఆందోళనకరమైన ప్రజా సమస్యలను నొక్కిచెప్పుతూ హైలెట్ చేసేందుకు ఈ భారత్ జోడో యాత్రను చేపట్టడం జరిగిందని జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. 'రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర 4,000కి.మీ.ల పాదయాత్ర. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ 200మందికి పైగా భాతర్ యాత్రికులు కాలినడకన ఈ యాత్రలో ప్రయాణించారు. ఇది 145 రోజులకు పైగా కొనసాగింది.12రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేసింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చెప్పారు. 'మన దేశ రాజకీయాలలో ఈ భారత్ జోడో యాత్ర ఒక పరివర్తన కలిగించే మైలురాయి' అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఈ మార్చ్ సందర్భంగా రాహుల్ గాంధీ 12 పబ్లిక్ మీటింగ్‌ల్లో, 100కి పైగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల్లో, 13 ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో, 275కి పైగా నడక సంభాషణలు, 100కి పైగా సిట్టింగ్ సంభాషణలు ప్లాన్ చేయబడినవని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ వివరించారు. 4,000కి.మీ.లకు పైగా ఉద్దేశించబడిన ఈ యాత్ర ద్వారా రాహుల్ గాంధీ తన మద్దతుదారుతో పాటు వ్యతిరేకుల దృష్టిని కూడా ఆకర్షిస్తున్నారు. ఈ యాత్రలో సమాజంలోని పెద్దలు సినిమా, టీవీ సెలబ్రిటీలు కమల్‌హాసన్, పూజాభట్, రియాసేన్, స్వరభాస్కర్, రషమి దేశాయ్, ఆకాంక్ష పురి, అమోల్ పాలేకర్ తదితరులు ఉన్నారు. రచయితలు, మిలిటరీ ప్రముఖులతో పాటు పూర్వ ఆర్మీ చీఫ్ జనరల్ (రిటైర్డ్) దీపక్ కపూర్, మాజీ నౌకాదళాధిపతి(విశ్రాంత) దీపక్ కపూర్,మాజీ నావీ చీఫ్ అడ్మిరల్ (రిటైర్డ్) ఎల్.రాందాస్, పూర్వ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురామ్ రాజు, మాజీ ఆర్థికశాఖ కార్యదర్శి అర్‌విండ్ మయారామ్ కూడా ఈ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ తరపున మోహబూబా ముఫ్తీ, శివసేన (యుబిటి) నాయకులు ఆదిత్య థాకరే, ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) నేత సుప్రీయా సూలే కూడా రాహుల్‌గాంధీతోపాటు ఈ భారత్ జోడో యాత్రలో నడిచినవారిలో ఉన్నారు.తి(విశ్రాంత) దీపక్ కపూర్,మాజీ నావీ చీఫ్ అడ్మిరల్ (రిటైర్డ్) ఎల్.రాందాస్, పూర్వ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ రఘురామ్ రాజు, మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి అర్‌విండ్ మయారామ్ కూడా ఈ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ తరపున మోహబూబా ముఫ్తీ, శివసేన (యుబిటి) నాయకులు ఆదిత్య థాకరే, ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) నేత సుప్రీయా సూలే కూడా రాహుల్‌గాంధీతోపాటు ఈ భారత్ జోడోయాత్రలో నడిచినవారిలో ఉన్నారు.

## అమెరికా దిగుమతులపై
# ధైర్యంగా 75% సుంకం విధించాలి

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



**న్యూఢిల్లీ :** అమెరికా దిగుమతులపై ధైర్యంగా 75 శాతం సుంకం విధించాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకు ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలకు ప్రతిస్పందనగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీ వరకు అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని మినహాయించాలన్న కేంద్రం నిర్ణయం భారత పత్తి రైతులను దెబ్బతీస్తుందన్నారు. 'ప్రధానిధైర్యం చూపించాలని కోరుతున్నాం. దేశం మొత్తం మీ వెనుక ఉంది. భారత దేశం నుంచి వచ్చే ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. మీరుఅమెరికా నుంచి వచ్చే దిగుమతులపై 75 శాతం సుంకం విధించండి. దేశం దానిని భరించడానికి సిద్ధంగా ఉంది. దానిని విధించండి. అప్పుడు ట్రంప్ తలొగ్గుతుందో లేదో చూడండి' అని కేజ్రీవాల్ అన్నారు.

**ట్రంప్ ఎదుట మోకరిల్లిన మోదీ ప్రభుత్వం!**

అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకం విధించాలని, కనీస మద్దతు ధరను నిర్ణయించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 20 కిలోలకు రూ. 2,100 చొప్పున పత్తిని సేకరించాలని, అలాగే ఎరువులు, విత్తనాలపై సబ్సిడీని కూడా ఆయన డిమాండ్ చేశారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకం వజ్రాల కార్మికులను కూడా ప్రభావితం చేసిందని, ఎందుకంటే మోదీ ప్రభుత్వం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లిందని ఆరోపించారు. డిసెంబర్ 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును పొడిగించాలనే నిర్ణయం ఎగుమతి మార్కెట్లలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని కేజ్రీవాల్ తెలిపారు. ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకం విధించినప్పుడు, మోదీ దానికి ప్రతిగా పెంచలేదని తెలిపారు. కానీ దానిని (అమెరికా నుంచి పత్తి దిగుమతులపై) 11 శాతం తగ్గించారని, ప్రధాని ఎందుకు వంగి బలహీనంగా మారారని ప్రశ్నించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అని, ఇక్కడి ప్రజలు మోదీ వెనుక నిలబడతారన్నారు. 'దేశం మొత్తం మోదీజీ వెనుక నిలబడి ఉంది. ఆయన (ట్రంప్) 50 శాతం సుంకం విధించారు. మోదీజీ పత్తిపై 100శాతం సుంకం విధించి ఉండాలి. ట్రంప్ తలవంచాల్సి వచ్చేది. ట్రంప్ ఒక పిరికివాడు. తనను ధిక్కరిస్తే అన్ని దేశాల ముందు ఆయన తలవంచుతారు. నాలుగు అమెరికన్ కంపెనీలను మూసివేయండి, వారు ఇబ్బందుల్లో పడతారు' అని ఆయన పేర్కొన్నారు. అమెరికా నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం సుంకాన్ని తొలగించాలనే భారత్ విధాన నిర్ణయం కారణంగా, అక్టోబర్–నవంబర్‌లో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వారి ఉత్పత్తులను విక్రయించబోమని కేజ్రీవాల్ అన్నారు. 'అమెరికా నుంచి పత్తి (భారతదేశంలోకి) వచ్చినప్పుడు, ఇక్కడి రైతులకు మార్కెట్లో రూ.900 కంటే తక్కువ లభిస్తుంది. రైతుల విషయంలో ఇదేజరుగుతోంది. అమెరికా రైతులు ధనవంతులుగా మారుతున్నారు. గుజరాత్ రైతులు పేదలుగా మారుతున్నారు' అని తెలిపారు. 'ఇప్పుడు మన దేశంలోని రైతులు తమ పత్తిని అమ్మడానికి మార్గం లేదు. మన దేశంలోని రైతు రుణం తీసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాడు, (వ్యవసాయ) కార్మికులకు డబ్బు చెల్లించారు. ఇప్పుడు ఆయన రుణాన్ని ఎలా తిరిగి చెల్లిస్తాడు? బలవన్మరణకు పాల్పడడం తప్ప వేరే మార్గం ఉండదు' అని ఆప్ కన్వీనర్ పేర్కొన్నారు. అమెరికా ముందు భారత్ నిస్సహాయతను కూడా ఆయన ప్రశ్నించారు. ట్రంప్ సుంకాలు విధించిన ఇతర దేశాలు తీవ్రంగా స్పందించాయని కేజ్రీవాల్ తెలిపారు. కానీ భారత్ ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు.

# పశ్చిమబెంగాల్‌లో టీచర్‌పోస్టుల పరీక్షకు బిహార్, యుపి నిరుద్యోగులు

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్‌సి స్కూలుస్థాయిలో పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయుల ఎంపిక పరీక్ష(ఎస్ఎల్ఎస్‌టి) తొమ్మిది సంవత్సరాల తర్వాత ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు బిజెపి పాలిత బీహార్,ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిమంది హాజరయ్యారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలని చెప్పుకుంటున్న బిజెపి పాలిత బీహార్, ఉత్తర ప్రదేశ్‌ల నుండి అభ్యర్థులు పశ్చిమ బెంగాల్‌కు వచ్చి టీచర్‌పోస్టుల ఉద్యోగాలకు పరీక్ష రాయడాన్ని తృణమూల్ కాం గ్రెస్ అధికార ప్రతినిధి కునాల్‌ఘోష్ తీవ్రంగా విమర్శించారు. బిజెపిపై విమర్శల దాడి చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒకపోస్టింగ్ పెట్టారు. బెంగాల్‌లో నిర్వహించే పరీక్షలు కేవలం బెంగాలీయులకు మాత్రమే కాదని, ఈ విషయంలో ఎవ్వరూ ఎవ్వరినీ అవమానించడంగానీ, వేధింపులకు గురిచేయడంగానీ జరగబోదని, వారిని ఎవ్వరూ అడ్డుకోరనీ కూడా పేర్కొన్నారు. 3.19 లక్షలమందికిగాను 91శాతం హాజరయ్యారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూళ్ళల్లో 26,000 మంది ఉద్యోగాలను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు గడచిన ఏప్రిల్ నెలలో తీర్పుచెప్పిన తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగాల ఎంపికకు పశ్చిమబెంగాల్‌లో మొదటిసారి ఈపరీక్ష నిర్వహించారు. కోర్టు వ్యవహారాల వల్ల పరీక్ష జాప్యం జరిగింది. భారీ భద్రతమధ్య 636 కేంద్రాలలో ఆదివారం ఈ పరీక్ష నిర్వహించారు. మూడు అంచెల భద్రతావ్యవస్థ ఏర్పాటు చేశారు. బార్‌కోడ్ స్కానర్లు ఉపయోగించారు. మొబైల్ ఫోన్లు అనుమతించలేదు.డబ్ల్యుబిఎస్ఎస్‌సి ఛైర్మన్ సిద్ధార్థ మజుందార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, 3.19లక్షలమంది అభ్యర్థులకుగాను 91 శాతంమంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. వీరిలో ఎక్కువమంది బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఉన్నా రు. బయట రాష్ట్రాల నుండి మొత్తం 31,000 మంది వచ్చి పరీక్ష రాశారని చెప్పారు. 9,10 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి అసిస్టెంట్ టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి ఈ పరీక్ష నిర్వహించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అభ్యర్థి ఉమేశ్‌యాదవ్ మాట్లాడుతూ, సైన్స్‌లో తాను మా స్టర్స్ డిగ్రీ పొందాననీ, పశ్చిమబెంగాల్‌లో తన అ దృష్టం పరీక్షించుకోవడానికి వచ్చానని చెప్పారు. ప్రశ్నలు సులభంగా ఉన్నాయని కోల్‌కతా బసంతిదేవి కాలేజిలో పరీక్ష రాసిన శతాబ్దికంజీలాల్ చెప్పారు.

## 'ట్రంప్ టారిఫ్ టెర్రర్'
# బిజెపి సర్కార్ పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

మాయావతి



**లక్నో :** భారతీయ వస్తువులపై అమెరికా విధించిన భారీ సుంకాల పెంపును 'ట్రంప్ సుంకాల టెర్రర్'గా బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి అభివర్ణించారు. పరిస్థితిని ఎదుర్కోవడానికి దృఢమైన చర్యలు ప్రారంభించాలని బిజెపి నేతృత్వంలోని కేంద్రాన్ని డి మాండ్ చేశారు. 'ట్రంప్ సుంకాల టెర్రర్ నుండి ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి, అధికార బిజెపి ప్రజాప్రయోజనం కోసం బలమైన, అర్థవంతమైన సంస్కరణలను ప్రారంభించడం అత్యవసరం' అని ఆమె అన్నారు. లేనిపక్షంలో పేదరికం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వలసలు వంటి దేశ ప్రజలను పీడిస్తున్న సమస్యలు మరింత దిగజారిపోతాయని, దేశ గౌరవం, ప్రపంచ స్థాయిని ప్రభావితం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాయావతి ఆదివారం లక్నోలో జరిగిన బిఎస్‌పి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ట్రంప్ భారత వస్తువులపై సుంకాలను 50 శాతానికి రెట్టింపు చేయడంతో పాటు, రష్యా ముడి చమురు కొనుగోలుపై 25 శాతం అదనపు సుంకాలను విధించిన తర్వాత న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అమెరికా చర్య అన్యాయం, అసమంజసమైనదని భారత్ అభివర్ణించింది. భారత దిగుమతులపై అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో యుపిలోని ప్రముఖ ఎగుమతి కేంద్రాలు సతమతమవుతున్నందున, ఎగుమతిదారులు ఉద్యోగ నష్టాలు, నిలిచిపోయిన ఆర్డర్లు, మార్కెట్ ప్రాప్యత తగ్గిపోతుందని హెచ్చరించడంతో బిఎస్‌పి చీఫ్ ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆగస్టులో అనేక జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చెలరేగినప్పటికీ, సుంకం సంవత్సరాల శ్రమతో కూడిన మార్కెట్ నిర్మాణాన్ని ప్రమాదంలో పడేసిందని నోయిడా, కాన్పూర్, వారణాసిలకు చెందిన పారిశ్రామిక నేతలు అన్నారు. భదోహిలో కార్పెట్ ఎగుమతిదారులు, రాంపూర్‌లోని మెంథా చమురు ఉత్పత్తిదారులు, మొరాదాబాద్‌లోని ఇత్తడి సామాను ఎగుమతిదారులు పెద్దఎత్తున ఆందోళన చేసిన తరువాత మరిన్ని నిరసన ప్రదర్శనలు జరిగాయి.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నేడు
# ప్రతిపక్ష ఎంపిలకు మాక్ పోలింగ్

సాయంత్రం విందు ఇవ్వనున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి ఈనెల 9న ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటు వేసే విధానంపై సోమవారం ప్రతిపక్ష ఎంపిలకు వివరణ ఇవ్వనున్నారు. అదేరోజు సాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షు మల్లికార్జున్ ఖర్గే వారికి విందు ఇస్తారని ఇండియా కూటమి వర్గాలు ఆదివారం తెలిపాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై వివరణ ఇచ్చిన తర్వాత సోమవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 'మాక్ పోల్' నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పార్లమెంట్ అన్నెక్సేలో ప్రతిపక్ష ఎంపిలకు విందు ఇస్తారని ఆ వర్గాలు తెలిపాయి. ఉపరాష్ట్రపతి పదవికి అధికార ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్, ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ప్రత్యక్ష పోటీ జరుగుతుంది. ఈసారి ఇద్దరు అభ్యర్థులు దక్షిణ భారతదేశానికి చెందినవారే. రాధాకృష్ణన్‌ది తమిళనాడు కాగా, సుదర్శన్‌రెడ్డి తెలంగాణ బిడ్డ. అధికార కూటమికి సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికను ప్రతిపక్షాలు సైద్ధాంతిక యుద్ధంగా అభివర్ణించాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి. మోదీ మాట్లాడుతూ మంగళవారం పార్లమెంట్ హౌస్‌లోని వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్ 101లో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 9న ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం ఎలక్టోరల్ కాలేజీలో పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఉంటారు. రాజ్యసభకు నామినేట్ చేయబడిన సభ్యులు కూడా ఎలక్టోరల్ కాలేజీలో చేర్చడానికి అర్హులు, అందువల్ల ఎన్నికల్లో పాల్గొనడానికి అర్హులు. పార్లమెంట్ హౌస్‌లో పోలింగ్ ఏర్పాట్లను పి.సి. పర్యవేక్షిస్తున్నట్లు రాజ్యసభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఓట్ల లెక్కింపు అదే రోజు సాయంత్రం ప్రారంభమవుతుందని, ఫలితం వెంటనే ప్రకటించబడుతుందని పేర్కొంది. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన బిజెపి అనుభవజ్ఞుడు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ అయితే, సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి.

### బిహార్‌లో ఎస్ఐఆర్ నిర్వహించాలనే ఇసి నిర్ణయాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై
# 'నేడు' సుప్రీంకోర్టు విచారణ



**న్యూఢిల్లీ :** త్వరలోనే ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలని జూన్ 24న ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాజకీయ పార్టీలు సహా పలువురు దాఖలు చేసిన ఎన్నికల సంఘం పిటిషన్ల బ్యాచ్‌ను సుప్రీంకోర్టు నేడు(సోమవారం) విచారించనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకవాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగీలతో కూడిన ధర్మాసనం రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి), ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తేహాద్‌ఉల్‌ముస్లిమీన్(ఏఐఎంఏఎం), ఇతర పిటీషన్ల ప్రతిస్పందనను పరిశీలిస్తోంది. ముసాయిదా ఓటర్ల బాజితాలోని7.24కోట్లమంది ఓటర్ల జాబితాలలో 99.5శాతం మంది ఎస్ఐఆర్ కసరత్తులో తమ అర్హత పత్రాలను కలిగిఉన్నారని ఎన్నికల సంఘం సమర్పించిన నోట్‌పై ఆర్‌జెడి, ఎఐఎంఐఎం,ఇతర పిటిషన్‌దారుల ప్రతిస్పందనను ఈ ద్విసభ్య ధర్మాసనం పరిశీలిస్తోంది. బిహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెలిజెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తులో భాగంగా ఓటర్ల జాబితా ముసాయిదానుంచి పేర్లు తొలగించబడిన ఓటర్లు తమఅభ్యంతరాలను ఆన్‌లైన్ మోడ్ ద్వారా సమర్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆగస్టు 22నుంచి రాజకీయ పార్టీలు సహా ఎన్‌జిఓ దాఖలు చేసిన పిటిషన్ల బ్యాచ్ ను అత్యున్నత న్యాయస్థానం విచారణను తిరిగి ప్రారంభిస్తుంది. సెప్టెంబరు 1న గడువు పొడిగింపు కోసం రాజకీయ పార్టీలు దాఖలు చేసిన కొన్ని దరఖాస్తులను విచారిస్తున్న సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ కసరత్తు కింద బిహార్‌లో తయారు చేసిన ముసాయిదా ఎన్నికల జాబితా సంబంధిత వాదనలు, అభ్యంతరాలు, దిద్దుబాట్లను సెప్టెంబరు తర్వాత దాఖలు చేయవచ్చని, అయితే ఓటర్ల జాబితా తయారు అయిన తర్వాత వీటిని పరిశీలిస్తామని ఎన్నికల సంఘానికి తెలిపింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ ఫారమ్‌లకు ముసాయిదా జాబితాలోని క్లెయిమ్‌లు, అభ్యతరాలను చివరితేదీగా పరిగణించవచ్చని పేర్కొంది. బిహార్‌పై ఉన్న గందరగోళాన్ని 'ఎక్కువగా నమ్మక సమస్య' అని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పారాలీగల్ వాలంటీర్లను వ్యక్తిగత ఓటర్లకు, రాజకీయ పార్టీ వాదనలు, అభ్యంతరాలకు సహాయం చేయాలని ఆదేశించింది. ఇది ఆగస్టులో ప్రచురించబడింది. అయితే షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి సెప్టెంబరు 1గడువును పొడిగించడాన్ని వ్యతిరేకించిన ఎన్నికల సంఘం, ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఆగస్టు 30న ఇచ్చిన ఉత్తర్వు తర్వాత చేర్చడానికి 22,723 క్లెయిమ్‌లు మాత్రమే దాఖలు అయ్యాయని, మినహాయింపు కోసం అభ్యంతరాలు దాఖలు అయ్యాయని సమర్పించింది. రాజకీయ పార్టీలు తమను తాము చురుకుగా చేసుకోవాలి అని ధర్మాసనం చెబుతూ విచారణను సెప్టెంబరు 8కు వాయిదా వేసింది.

# జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ : నక్సల్ హతం


**చాయ్‌బాస :** జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో ఆదివారం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఎనకౌంటర్‌లో తన తలపై రూ.10 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గోయిల్‌కేరా పోలీస్ స్టేషన్ పరిధి రేలా పారల్ ప్రాంతంలోని పంచలతబురు కొండల అడవుల్లో ఈఎన్‌కౌంటర్ జరిగింది. కొల్హాన్ డిఐజి అనురంజన్ కిస్పోట్టా పిటిఐతో మాట్లాడుతూ మాట్లాడుతూ మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య తెల్లవారుజామున ఎదురు కాల్పులు జరిగాయని, ఆ జరిగిన సెర్చ్ ఆపరేషన్‌లో ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐజి (ఆపరేషన్స్) జార్ఖండ్ పోలీసు ప్రతినిధి మైఖేల్ రాజ్ ఎస్ పిటిఐతో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న మృతదేహం సిపిఐ (మావోయిస్ట్) జోనల్ కమిటీ సభ్యుడు అమిత్ హన్స్‌డా అలియాస్ అప్తాన్‌గా గుర్తించామన్నారు. అతని తలపై రూ.10 లక్షల రివార్డు ఉన్నదన్నారు. రేలా పారల్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు శనివారం సమాచారం అందిందని వెస్ట్ సింగ్‌భూమ్ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్‌పి) రాకేష్ రంజన్ తెలిపారు. సమాచారం ఆధారంగా, చైబాసా పోలీసులు, 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) సంయుక్త బృందం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా, ఉదయం 5.45 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగిందని ఆయన తెలిపారు. సెర్చ్ ఆపరేషన్‌లో హన్స్‌డా మృతదేహంతో పాటు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స, కొన్ని కాట్రిడ్జ్‌లు లభించాయని రంజన్ విలేకరులకు తెలిపారు.




# తెలంగాణ ఉద్యమజ్వాల కాళోజి



ప్రజాకవి కాళోజి నారాయణరావు పేరు వినగానే మనసుకు మొదట గుర్తుకొచ్చేది ఒక నిర్భయ పోరుడి స్వరం. సమాజంలోని దోపిడీని, అన్యాయాన్ని దిగజార్చే పదఘోష. ఆయన ప్రతి రచనా ఒక విప్లవ గర్జన. ఒక విధేయతలేని గళం. ఒక మానవతా మేలుకొలుపు. ప్రజల భాషలో రాయడం, ప్రజల నిజమైన బతుకులను ఆవిష్కరించడం కాళోజి కవిత్వ ప్రత్యేకత. 'ప్రజాకవి' అనే బిరుదు ఆయనకు అతికినట్టు సరిపోతుంది. ఆయన మాటలు.. కవితలు నేరుగా పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోతాయి. ఆలోచింప చేస్తాయి. వాస్తవాలను కళ్లకు కడతాయి. అబద్ధపు ప్రచారాలను.. ఆర్భాటపు ప్రసంగాలను చాకిరేపు పెడతాయి. ఆయన కలం నిర్లిప్త సమాజాన్ని నిద్రలేపే ఘంటారావం. తెలంగాణ స్వభావం, పేద ప్రజల వేదన, గ్రామీణ కూలీల కష్టాలు, నిరుపేద విద్యార్థుల నిరాశ, రైతుల శ్రమ, తెలంగాణ అస్తిత్వ పోరాటంలో నెలరాలిన రక్తబిందువులు... వీటినే కాళోజి ప్రస్తావిస్తారు. సమాజానికి అద్దం పడుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తారు. కాళోజి అంటే బక్కపలుచని శరీరం.. నెరసిన గడ్డం... మేధస్సుతో మెరిసే ముఖం... కళ్లల్లో తెలంగాణ పట్ల అవాజ్యమైన.. తెలంగాణ ఆత్మగౌరవం కాళోజి.. తెలంగాణ గుండచప్పుడు కాళోజి.. తెలంగాణ భాష ప్రేమికుడు కాళోజి.. అధునాతన తెలంగాణ సాహిత్య ప్రేరణ కాళోజి. ఒక్క మాటలో చెప్పాలంటే, తెలంగాణకు ఆయన పర్యాయపదం. తెలంగాణ సాహిత్యానికి ఆయన మూల బలం. అందుకే, ఆ మహాకవి జయంతి తెలంగాణలో తెలుగు భాషా దినోత్సవమైంది. విద్యార్థి దశ నుంచే అన్యాయాన్ని ఎదిరించడం ఆయన అలవాటు. అణచివేతను ధిక్కరించే ధైర్యం ఆయన సొత్తు. భూస్వామ్య వ్యవస్థ, జమీందారీ అణచివేతలు ఆయనను మరింతగా కదిలించాయి. తెలంగాణ భాష, సంస్కృతులు అడుగడుగునా అవమానాలు ఎదుర్కోవడం ఆయనను నిద్రపోనీయలేదు. అంతులేని సమస్యలు ఆయన ఆలోచనల్లో తుపాను రేపాయి. అందుకే, స్పందించాడు. తెలంగాణ వాణిని వినిపించాడు. తెలంగాణ బాణిని ఆలపించాడు. అణచివేతలను ఎదిరించాడు. సమాజ కుళ్లును తూర్పారబట్టాడు. రాజ్యహింసను నిరసించాడు. దోపిడీకి వ్యతిరేకంగా అక్షర తూటాలు సంధించాడు. తాడిత, పీడిత, బాధితుల తరఫున నిలబడి రాజ్యాంగ హింసను ఎదుర్కొన్నాడు. 1914 సెప్టెంబర్ 9న రంగారావు, రమాబాయమ్మ దంపతులకు కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించిన రఘువీర్ నారాయణ్ లక్ష్మీ కాంత్ శ్రీనివాస రాం రాజా కాళోజి అందరికీ కాళోజి నారాయణరావుగా సుపరిచితుడు. తల్లి కన్నడిగుల ఆడపడుచు. తండ్రి మహారాష్ట్రీయుడు. కాళోజి అచ్చమైన తెలంగాణ వాది. నాటి నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కొడ్డి, రాజ్యహింసను ప్రశ్నించి, ప్రజాపోరాటాలకు మార్గదర్శకం చేశాడు. అక్షరాలే ఆయుధంగా సమరశంఖం పూరించాడు. ప్రజాకవిగా వెలుగొందాడు. 1992లో 'పద్మవిభూషణ'ను అందుకున్న కాళోజి ప్రత్యేక తెలంగాణ కోసం కలలుగన్నాడు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. ఆయన రచనలు రగిల్చిన ఉద్యమ నెగడులే ప్రజాపోరాటాల అగ్నిజ్వాలలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి పుష్కరం ముందు, 2002 నవంబర్ 13న తుదిశ్వాస విడిచిన కాళోజి జీవితంలో ఏ పుటను తెరచినా తెలంగాణయే కనిపిస్తుంది. ఏ అక్షరాన్ని స్పృశించినా తెలంగాణ గీతమే వినిపిస్తుంది. కాళోజి తెలంగాణపై అవాజ్య ప్రేమకు నిలువెత్తు సంతకం కాబట్టే, 'ఇదీ నా గొడవ' అంటూ ఆత్మకథను రాసుకున్నా, అందులోనూ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష దర్శనమిస్తుంది. 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి' అని ఘంటాపథంగా చెప్పిన కాళోజి 'అన్యాన్ని ఎదిరించన వాడే నాకు ఆరాధ్యుడు' అని కుండబద్ధలు కొట్టాడు కూడా. ఆయన తపనంతా బలహీనుల కోసమే. ఆయన ఆరాటమంతా బాధితులకు అందాల్సిన న్యాయం కోసమే. అన్యాయాలకు బలైన వారి గొంతుకగా మారే ఆయన రచనలు, అణచివేతను ఎదిరించే సాహసాన్ని బడుగుజీవి అణువణువునా నింపుతాయి. ఆయన కవితలు శ్రద్ధగా రాసిన అలంకార పదవిన్యాసాలుకావు.. గుండెల్లో మండుతున్న కసికి నిలువెత్తు ప్రతీకలు. ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసే అధికార వ్యవస్థలపై నిరసన అనేది ఆయన కవిత్వంలో ప్రముఖంగా కనిపించే భావం. ఎటువంటి రాజకీయ ముసుగులు లేకుండా ఆయన మనసాక్షికి మాత్రమే కట్టుబడతాడు... మాట్లాడతాడు... రచనలు చేస్తాడు. ఆయన పద్యం ఆడంబరాలపై వ్యంగ్యం కాస్త వినోదంగా కనిపించినా, లోపల వ్యథ, ఆగ్రహం ఉంటుంది. పేదవాడి ఆకలి ఆయన పద్యంలో నిజమైన మానవతా విలువగా ప్రతిధ్వనిస్తుంది. కవి అనగానే ఓ నాలుగు కఠిన పదాలు... మరో నాలుగు అవసరంలేని అలంకారాలు అనుకునే వారికి, నిజమైన కవిత్వం ఎలా ఉండాలో చూపించినవాడు కాళోజి. ప్రజల మాటలే కవిత్వానికి ప్రాణం కావాలన్న నమ్మకాన్ని ఆచరణలో చూపిన కవి ఆయన. అందుకే ఆయన కవిత్వం చదివిన ప్రతీసారి పాఠకుడికి ఇది మనదే అన్న భావన కలుగుతుంది. ఆయన వాడినది తెలంగాణ మాండలిక భాష.. ఆయన ఎంచుకున్నది తెలంగాణ ఎదుర్కొంటున్న వివక్షపై పోరాట పంథా. ఆ లక్ష్యంతోనే ఆయన సాహితీ ప్రస్థానం మొదలైంది.. తెలుగు నాట ప్రకంపనలు రేపింది.. నేటికీ స్ఫూర్తినిచ్చే కేంద్రకంగా విరాజిల్లుతునే ఉంది. రాజ్యహింసను ఎదరించడానికి ప్రతిహింసకు దిగరాదనేది ఆయన సిద్ధాంతం. అయితే, ఉనికికే ప్రమాదం వాటిల్లినప్పుడు హింస తప్పుకాదని తేల్చిచెప్పారు. 'నియంతృత్వ ధోరణి మారనప్పుడు.. రాక్షస ప్రవృత్తికి కొనసాగుతున్నప్పుడు.. పరివర్తన ఎండమావిగా కనిపిస్తున్నప్పుడు... ఎదురు తిరగడం తప్పుకాదు. ప్రతిహింస నిషిద్ధమూ కాదు' అంటాడు కాళోజి. ఆ లక్షణంతోనే రాజ్యహింసను ఎదరించాడు. స్వేచ్ఛకోసం పరితపించాడు. సమకాలీన సామాజిక సమస్యలపై ఆయన సాహితీ విల్లును ఎక్కుపెట్టి, అక్షర బాణాలు సంధించాడు. ఆయన రాసిన ప్రతి అక్షరంలోనూ తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం కనిపిస్తాయి. ఆయన ప్రతి మాటలోనూ తెలంగాణ పోరాటతత్వం, మడమతిప్పని ఆత్మవిశ్వాసం ఆవిష్కృతమవుతాయి. ఉన్నది ఉన్నట్టు చెప్పడంలో ఆయన ఏనాడూ వెనుకంజ వేయలేదు. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించడం ఆయన అలవాటు. అన్యాయాన్ని ఎదిరించడానికి కటువుగా ఉండడం ఆయన నైజం. కాళోజి స్వేచ్ఛావాది. తన అస్తిత్వాన్ని అమితంగా ప్రేమిస్తాడు. అది భాష కావచ్చు.. వేషం కావచ్చు.. మాట లేదా తీరు కావచ్చు... ఏదైనా తనదైన తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చాడు. పరాయి భాష.. పరాయి యాస, పరాయి చూపులు.. పరాయి చెవులు.. పరాయి నడక.. పరాయి చేతలు తనకు వద్దేవద్దని ఖరాఖండింగా చెప్పాడు. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని నలుదిశగా రెపరెపలాడించాడు. ఇజాల పేరుతో నిజాలను తొక్కిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఏదో ఒక వాదానికి కట్టుబడిపోవడాన్ని స్వేచ్ఛా రహిత జీవితంగా ఆయన అభివర్ణించాడు. 'నరుడనేను, నరుడ నేను, మనిషి బ్రతుకు బ్రతుకుతాను.... నా ఇష్టం వచ్చినట్లు నా మనసుకు నచ్చినట్టు మాట్లాడుతా.. రాస్తా.. ప్రకటిస్తా .. నా ఆలోచన నాది.. అభిప్రాయ భేదానికి అవకాశం లేకున్న, సభ్య ప్రపంచం సున్నా' అంటూ, తన మనసును.. తన నడతను.. తన నైజాన్ని వెల్లడించాడు. ఆయద దృష్టిలో కవిత్వం అనేది భావ ప్రకటన లేదా ఆత్మరంజక వ్యసనం కాదు. ఆయన తత్వం ప్రకారం, కవిత్వం సమాజానికి గళం. ఒక కవి కేవలం పూలను, చంద్రుణ్ని, ప్రేమను వర్ణించడం ద్వారా తన బాధ్యత పూర్తిచేయలేడు. కవిత్వం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై కూర్చున్న చీకటిని తొలగించే మిణుగురుపురుగు. స్వేచ్ఛే కాళోజి మతం. తనను తనగానే చూడాలన్నది ఆయన అభిమతం. అది తన స్వతఃసిద్ధమైన హక్కుగా పేర్కొంటారు. ఆ హక్కు లేని జన్మ ఎందుకని ప్రశ్నిస్తారు కాళోజి. బతుకుమీద తీపి, ప్రాణం పట్ల మమకారం లేవు కాబట్టే పోరాట యోధుడయ్యారు. సమాజంలోని సమస్యలు.. జరిగిన సంఘటనలు.. తన స్పందనలు.. ఇవే కాళోజి రచనలు. 'నాకున్నది కోరిక.. నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని.. చదువురులకు కవిత్వంగా ఉండాలని.. భావుకులకు మెదడుగా ఉండాలని.. మేధావులకు ఎడదగా ఉండాలని.. తార్కికులకు కరుణ పుట్టించేదిగా ఉండాలని.. అమాయకులకు ఆపద గుర్తించేదిగా వుండాలని..' అంటూ తన కోరికలను ప్రకటిస్తాడు. కవిత్వాన్ని ఆయన కేవలం హృయదస్పందనగా చూడలేదు. భావోద్వేగాల సరుకుగా పరిగణించలేదు. ప్రజలను చైతన్యవంతులను చేసే ముడిసరుకుగానే కవిత్వాన్ని భావించాడు. సమకాలీన రాజకీయాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టడమే కవిత్వ లక్ష్యమని నమ్మాడు. బతుకు బాటలో తుది మలుపువరకూ అదే ఆచరించాడు. . తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, తెలంగాణ వాదాన్ని ఎలుగెత్తి చాటుతూ. ప్రజాకవిగా ఎదిగి నిత్యస్మరణీయుడయ్యాడు. తెలంగాణ యాసకు, భాషకు పట్టం కట్టి, తెలంగాణ ముద్దుబిడ్డ అయ్యాడు. కాళోజి జయంతిని భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు మనమిచ్చే గౌరవం అనడం కంటే, ఆయన మనకు ఇచ్చిన వరం అనడంలోనే ఔచిత్యం ఉంటుంది.




**'సాగిపోవుటె బ్రతుకు**
**ఆగిపోవుటె చావు**
**సాగిపోదలచిన**
**ఆగరాదిచటెపుడు**
**ఆగిపోయిన ముందు**
**సాగనే లేవెపుడు**
**వేచియుండిన పోను**
**నోచుకోనే లేవు.**
**తొలగి తోవెవడిచ్చు**
**త్రోసుకొని పోవలయు.**
**బ్రతుకు పోరాటము**
**పడకు ఆరాటము.**
**బ్రతకదలచిన పోరు**
**సుతరాం తప్పదు.**
**చూపతలచిన జోరు**
**రేపనుట ఒప్పదు'** అంటాడు కాళోజి తన 'బ్రతుకు' కవితలో. బతుకు పోరాటమైనా.. స్వరాష్ట్ర సాధన ఆరాటమైనా.. ఆగిపోతే చావుతో సమానమే.

- సత్యశ్రీ

## హేతువాదం.. గోపీచంద్ తత్త్వం

త్రిపురనేని గోపీచంద్ హేతువాదాన్ని తన తండ్రి త్రిపురనేని రామస్వామి నాయుడు నుంచి వారసత్వంగా పొందినట్టున్నాడు. అందుకే, ప్రశ్నించే నైజాన్ని నరనాన జీర్ణించుకున్నాడు. తన రచనలు ద్వారా సమాజం, మతం, రాజకీయ వ్యవస్థలను విశ్లేషించాడు. హేతువాదం ద్వారా సామాజిక రుగ్మతలను తరిమికొట్టవచ్చని నమ్మాడు. తన రచనల్లో ప్రతిబింబించాడు. గోపీచంద్ తత్వం సమాజానికి ఆయన ఇచ్చిన విజ్ఞానదీపం. ఆయన మానవతా సంకల్పం, విప్లవ భావాలు, హేతువాద వివేచన సాహిత్య వేదికగా నిలిచాయి. ఈ కోణంలో ఆలోచిస్తే, హేతువాదం సాహిత్యంలో ఒక సార్వత్రిక, నిత్య కీలక భావనగా పరిణమించగలదని స్పష్టమవుతుంది. గోపీచంద్ రచనలు హేతువాదం లక్షణాలను పొందిపుచ్చుకున్నాయి. సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయి. కారణాలని, ప్రమాణాలను, వాస్తవాలను ఆధారంగా ఉంచుకుని నియమాలు, సిద్ధాంతాలను విశ్లేషించి, మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాలు, సాంప్రదాయాలు వంటి పరిహాసనీయమైన, అనిర్దిష్టమైన ఆలోచనలను విమర్శించే వైజ్ఞానిక దృక్పథమే హేతువాదం. ఇది సమాజ పురోగతికి మూలస్తంభం. గతమంతా తప్పులతడకేనని, అప్పటి వారు అనుసరించిన విధానాలన్నీ ఆలోచనా రహితమైనవని అనుకోవడానికి వీల్లేదు. కానీ, అదే సమయంలో గుడ్డిగా నమ్మడం కూడా సరికాదు. ఏది సరైనది? ఏది మూఢత్వానికి దారి తీస్తుంది? అనేది ప్రశ్నించి, సమాధానం వెతుక్కోవడం వల్లే తెలుస్తుంది. హేతుబద్ధమైన ఆలోచనలకు ఇదే మూల సూత్రం. దీనిని నూటికి నూరుశాతం అనుసరించి చూపిన రచయిత, విశ్లేషకుడు, కవి గోపీచంద్, తన రచనల మాధ్యమంగా సమాజంపైకి ఎన్నో ప్రశ్నలు సంధించాడు. ఛాందసవాదాన్ని నిలదీశాడు. నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నిబద్ధతగల రచయిత గోపీచంద్‌ను ఆయన జయంతి రోజు (సెప్టెంబర్ 8) స్మరించుకోవడం తెలుగు సాహితీలోకం తనను తాను గౌరవించుకోవడమే.


# మానసిక సంఘర్షణలతో 'అసమర్థుని జీవయాత్ర'




ప్రముఖ రచయిత, హేతువాది, సామాజిక ఉద్యమకారుడు త్రిపురనేని గోపీచంద్ (8 సెప్టెంబర్ 1910–2 నవంబర్ 1962) అద్భుత సృష్టి 'అసమర్థుని జీవయాత్ర'. బహుశా తెలుగులో ఇదే తొలి మనో వైజ్ఞానిక నవల కావచ్చు. కథ ఎవరి చుట్టూ తిరుగుతుందో, అతనే హీరో అనుకుంటే... ఈ నవల్లో సీతారామారావు కథానాయకుడు. మరొకరి జీవితాన్ని తప్పుతోవ పట్టించి, అర్థాంతరంగా ముగించేవాడిని విలన్ అంటారు కాబట్టి, ఈ నవల్లో ప్రతికథానాయకుడు కూడా సీతారామారావే. అతనికి అతనే మిత్రుడు. అతనికి అతనే శత్రువు. పెళ్లి, భార్య, పిల్లలు... వాళ్ల కోసం యాంత్రికంగా మారే జీవితం అంటే సీతారామారావుకు పడదు. కానీ, పెళ్లి చేసుకొని పిల్లల్ని కంటాడు. తండ్రి మరణించే ముందు కుటుంబ గౌరవాన్ని కాపాడాలని కోరుకున్నా లెక్కచేయడు. అతని ఆదర్శాలు ఉన్నతమైవి. విలాసాలు ఖరీదైనవి. ప్రశ్నిస్తాడుకానీ, సమాధానం వెతుక్కునే ఓపిక ఉండదు. కళ్ల ముందున్న వాస్తవాలను గ్రహించకుండా, కలల్లో బతుకుతాడు. వాటిని తలచుకొని భయపడతాడు. లోపల ఉన్న ప్రేమను వ్యక్తపరచలేక సమాజానికి, కుటుంబానికి దూరమవుతాడు. విలాసాలకు విచ్చలవిడిగా ఖర్చుచేసి, మామను అప్పు అడుగుతాడు. అతను తిరస్కరించడాన్ని జీర్ణించుకోలేక పోతాడు. ఆఫీసు కాగితాలపై మామ బొమ్మ వేసి, ఉద్యోగం పోగొట్టుకుంటాడు. తాను నిజ జీవితంలో చేయలేని పనులన్నీ కలల్లో పూర్తవుతాయి. అందుకే, కళ్లు తెరచి, నిజం చూడడానికి ఇష్టపడడు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడు. పాత సిద్ధాంతాలను తప్పుపడతాను. కొత్త మార్పులను నిర్లక్ష్యం చేస్తాడు. తనకు తానే ఒక ప్రశ్నగా మారిపోతాడు. చివరికి అర్థాంతరంగా మరణిస్తాడు. ఈ నవల చదివిన ప్రతి ఒక్కరికీ తనను తాను అద్దంలో చూసుకున్నట్టు అనిపిస్తుంది. సీతారామారావు వ్యక్తిత్వం దాదాపు ప్రతి సగటు మనిషిలోనూ ఉంటుంది. కానీ, హేతువును, వాస్తవ పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే జీవితం ఒక నిర్దిష్ట దిశగా ముందుకు సాగుతుంది. లేకపోతే ఏం జరుగుతుందో సీతారామారావు జీవితం మనకు వివరిస్తుంది. నవల రాసి 77 సంవత్సరాలైనప్పటికీ, నేటికీ అది నిత్యనూతనంగానే ఉందంటే, గోపీచంద్ దార్శనికతను అర్థం చేసుకోవచ్చు. సీతారామారావుకు రామయ్య ద్వారా చెప్పించిన మాటలు గోపీచంద్ ఆంతర్యాన్ని ఆవిష్కరిస్తాయి. 'జ్ఞానం కావాల్సిందే. జ్ఞనం లేకపోతే అభివృద్ధే ఉండదు. మానవుడు ప్రకృతిలో భాగమే అవటంవల్ల, జ్ఞానమే లేకపోతే, ప్రకృతి దాసుడుగానే ఉండేవాడు. ప్రకృతి నుంచి మానవుడ్ని వేరు చేసింది జ్ఞానమే' అని సీతారామయ్యకు చెప్తాడు రామయ్య. అయితే, జ్ఞానానికి రెండు వైపులా పదును ఉంటుందని, జ్ఞాన భాండాగారాన్ని ఎప్పటికప్పుడు నింపుకుంటూ ఉంటేనే అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చేస్తాడు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, జ్ఞానం అనేది మానవ జాతినే సర్వనాశనం చేస్తుందని హెచ్చరిస్తాడు కూడా. ఈ మాటలు అనేక రకాలుగా నేటి సమాజానికి, పరిస్థితులకూ వర్తిస్తాయన్నది నిజం. పాత సిద్ధాంతాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అసంపూర్ణమని తెలుసుకొంటేనే కొత్త సిద్ధాంతాలు వస్తాయని కూడా రామయ్య పాత్రచేత చెప్పిస్తాడు రచయిత. కొత్త సిద్ధాంతాన్ని సైతం ప్రశ్నించే స్థాయికి మనిషి చేరుకోవడం ఆహ్వానించతగిన పరిణామమని చెప్పిస్తాడు. కానీ, పాతతోపాటు, కొత్త సిద్ధాంతాలు కూడా తప్పు అనే నిర్ధారణకు రావడం తగదని అంటాడు. జ్ఞానాన్ని తన్ను తాను నాశనం చేసుకోవడానికి ఉపయోగించే వ్యక్తిని మానవుడు కాదని, పరమ కిరాతకుడు, ఘోర రాక్షసుడని గోపీచంద్ ఆ పాత్ర ద్వారా స్పష్టం చేస్తాడు. ఎన్నో వైవిధ్యాలను, మరెన్నో మానసిక అంశాలను పొందపరచిన 'అసమర్థుడి జీవయాత్ర' తెలుగు సాహితీ రంగంలో ఒక గొప్ప క్లాసిక్‌గా నిలిచిపోయింది.

### పుస్తకం పేరు

**అసమర్థుని జీవయాత్ర**
**రచయిత: త్రిపురనేని గోపీచంద్**
**వెల: రూ. 120**



## చదవాల్సిన పుస్తకం

# అమరవీరులకు అరుణాంజలి

్యూనిస్టు త్యాగధనుల జీవిత చరిత్రలు




ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా.. రాజ్యాలు ఏలినా.. నిరంతరం ప్రజల్లో ఉండేది మాత్రం కమ్యూనిస్టులే. అధికారం కోసం వెంపర్లాడకుండా, ప్రజా వాణిని వినిపించడానికి, ప్రజా ఉద్యమాలు నడిపించడానికి వామపక్ష పార్టీలు ఎప్పుడూ ముందుంటాయని కమ్యూనిస్టు దిగ్గజం, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. ప్రజల కోసమే ఏర్పడి.. ప్రజల కోసమే పని చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చరిత్ర అంటేనే త్యాగధనుల చరిత్ర. అమరవీరుల చరిత్ర. ప్రజా ఉద్యమాల చరిత్ర. సిపిఐ శ తవార్షికోత్సవం సందర్భంగా అనిల్ రాజింవాలె సంకలనం చేసిన పలువురు త్యాగధనుల జీవిత చరిత్రలను ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు అనువదించి, ఎడిట్ చేసిన 'అమరవీరులకు అరుణాంజలి' పుస్తకం అందిస్తున్నది. సిపిఐ ఆవిర్భావం పూర్వాపరాలను మక్కెన సుబ్బారావు తమ ఉపోద్ఘాతంలో సంక్షిప్తంగా వివరించారు. పార్టీ నిర్మాణానికి, ఎదుగుదలకు, దేశంలో కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి కృషి చేసిన ప్రముఖుల జీవిత చరిత్రలతో కూడిన ఈ పుస్తకంలో, ఐదు అధ్యాయాలు ఉన్నాయి. సత్యభక్త, పిసి జోషి, సచ్చిదానంద్ విష్ణు ఘాటె, చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరిప్రసాద్ వంటి సిపిఐ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శులను మొదటి అధ్యాయంలో పరిచయం చేశారు. రెండో అధ్యాయం 'మార్గదర్శకులు'లో మౌలానా హస్రత్ మొ హానీ, ఫిలిప్ స్ప్రాట్, ఎంఎస్ రాయ్, అమీర్ హైదర్‌ఖాన్ తదితరుల సంక్షిప్త జీవిత చరిత్రలు ఉన్నాయి. ఎకె గోపాలన్, సి. అచ్యుత మీనన్, హీరేన్ ము ఖర్జీ, కెటికె తంగమణి, షకీర్ అలీఖాన్, రాహుల్ సాంకృత్యాయన్, బలరాజ్ సాహ్ని వంటి 30 మంది 'పార్టీ నిర్మాతలు' మూడో అధ్యాయంలో కనిపిస్తా రు. ఇక, నాలుగో అధ్యాయంలో పేర్కొన్న 'తెలుగు నేలపై ఉద్యమ నిర్మాతలు' గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మోహియుద్దీన్, రాజబహదూర్ గౌర్, కెఎల్ మహేంద్ర, బొమ్మగాని ధర్మభిక్షం వంటి అతిరథమహారథులు వామపక్ష ఆలోచనా ధోరణులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన విధానాలు, ఆ క్రమంలో వారు ఎదుర్కొన్న సమస్యలు, చేసిన పోరాటాలు సంక్షిప్త రూపంలో పలకరిస్తాయి. చివరిదైన ఐదో అధ్యాయంలో 14 మంది కమ్యూనిస్టు 'మహిళామణులు' పరిచయమవుతారు. వీరి లో తొలి మహిళా కమ్యూనిస్టు సుహాసినీ చటోపాధ్యాయ, బొంబాయి (నేటి ముంబయి)లో తొలి మహిళా పార్టీ సభ్యురాలు పార్వతీబాయి భోర్, 'చిట్టగాంగ్ వీరనారి' కల్పనా దత్తా, క్విట్ ఇండి యా ఉద్యమ వీరనారి, 'భారతరత్న' అరుణ అసఫ్ అలీ, ట్రేడ్ యూనియనిస్ట్ పార్వతీ కృష్ణన్ తదితరుల స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకం చేస్తాయి. మొత్తం మీద ఈ పుస్తకంలో పొందుపరచిన 74 మంది జీవిత చరిత్రలు, వే టి కవే ప్రత్యేకం. అయితే, అందరూ ప్రజల పక్షాన నిలిచిన వారే. ప్రజా సమస్యలపై నినదించిన వారే. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, వ్యాప్తిలో కీలక భూ మిక నిర్వహించిన వారే. ఇంత మంది ని గురించి పరిచయం చేస్తున్నది కాబ ట్టే, 'అమరవీరులకు అరుణాంజలి' తప్పక చదవాల్సిన పుస్తకం.




### పుస్తకం పేరు

**అమరవీరులకు అరుణాంజలి**
**కమ్యూనిస్టు త్యాగధనుల జీవిత చరిత్రలు**
**సంకలనం: అనిల్ రాజింవాలె**
**ఎడిటింగ్, అనువాదం: మక్కెన సుబ్బారావు**
**వెల: రూ. 220**

ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

ఈ వారం కవితలు

## నేటి రాజకీయ స్థితిగతులు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి రాజకీయ పార్టీలు
సిద్ధాంతాలు లేకున్నా చెలామణిలో ఉంటున్నాయి
తామర తంపరగా పెరుగుతున్నారు నాయకులు
మతం, కులం, ప్రాంతం, భాషాపరంగా రాజకీయాలు
గల్లీ నుండి ఢిల్లీ వరకు విలువలు లేని రాజకీయాలు

ఇంటికో రాజకీయం, వీధికో రాజకీయం
తల్లిదో పార్టీ, తండ్రిదో పార్టీ, పిల్లలది మరో పార్టీ
ఒకే ఇంట్లో అన్నీ పార్టీల వాళ్ళు ఉన్నారు
ఇదే ప్రస్తుతం జరుగుతున్న రాజకీయం
దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు

ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన వాళ్ళదే పైచెయ్యి
ఆ ఇంట పూర్తిగా అవినీతి పంటే
ప్రజాస్వామ్యంలో ఇదో బంపర్ ఆఫర్

ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని స్థితి
ఎప్పుడు ఎలా మారుతుంటారో అర్థం కాని పరిస్థితి
నేటి రాజకీయలకు పట్టిన దౌర్భాగ్య దుస్థితి
నాలుగు రాళ్ళు వెనకేసుకోవడమే నేటి రాజనీతి
గుడినీ గుడిలో లింగాన్ని మింగే వాళ్ళు ఉన్నారు
ప్రజాసేవ పేరుతో గడ్డిను వదిలిపెట్టడం లేదు
ఇసుకను సైతం వదిలి పెట్టడం లేదు
సహజ వనరులను దోచుకోవడం వాళ్లకు సహజం

దేశంలో పేదరికం పోనే పోదు
నిరుద్యోగ సమస్య పరిష్కారం కానే కాదు
నాయకుల ధన దాహం తీరాలంటే
సమస్యలు ఉండే తీరాలి
వరదలు, ఉప్పెనలు భూకంపాలు వచ్చే తీరాలి
నేతల కలలు సాకారం కావాటానికి అదే కదా మార్గం



నీతిలేని నేతలతో రాజకీయాలంటే రోత పుడుతుంది
నేరస్తులు చట్టసభలలో ఉంటే బాధ కలుగుతుంది
ఊసరవెల్లి నేటి నేతలను చూసి సిగ్గు పడుతుంది
తనకన్నా వేగంగా రంగులు మారుస్తున్నందుకు
విలువలు లేని రాజకీయాలతో ప్రజాస్వామ్యం గోవిందా
దేవుడా! రక్షించు దేశ రాజకీయాలను..
నేరస్తులు నుండి, రౌడీల నుండి,
ముఠా నాయకుల నుండి

**ఆచార్య గిడ్డి వెంకట రమణ,**
**9440984416**

## చీకటి చెలిమి

తిమిరంతో నాకు సమరం లేదు
అది నా ప్రియమైన దోస్త్
పొద్దుతో యుద్ధం చేసి
అలసిపోయి సేద తీరుతానా
చీకటి చిక్కని
కలల పాలపుంతల్ని నాపై వంచి
జోలపాడుతుంది

చీకటి నా అనేకానేక
ఆలోచనల వారధి
నా ఆకాంక్షల మెట్లెక్కించే సారథి
నిర్మలంగా నిశ్చలంగా
నన్ను నిద్రాదేవత ఒడిలోకి
చేర్చేది చీకటే అందుకే
రాతిరి అంటే నాకు మక్కువ
చీకటిని నేనెందుకు
ద్వేషించాలి..

చీకటితో చెలిమి చేసి చూస్తే
రాత్రి విలువ హృదిని
చుట్టు కుంటుంది
చీకటిని అల్లుకున్న రాత్రి
ఎన్నో నిశీధి గీతాలను
మనసు పలకపై పరుస్తోంది

చీకటి గుమ్మనంగా
నిశ్శబ్దంగా నా కవితాక్షరాలను
స్వాగతిస్తుంది
ఎన్నో కవితలకు
పురుడు పోసిన సమయం అదే
నా ఊహలకు ప్రాణం పోసే
అమృత ఘడియలు రాత్రులే
నా కన్నీళ్ళను బాధల్ని
నెమరువేసుకునే
నా ఆత్మీయ వాతావరణం చీకటే

చీకటి నా తోబుట్టువు
నన్ను రేపటి ఉదయానికి
శక్తివంతంగా ముస్తాబు చేసే
అపురూపమైన నేస్తం

నాలోకి నేను అవలోకన మయ్యేది
చీకటి వాకిటి తోవలోనే
అవునన్నా కాదన్నా...
వెలుగు నా అర్ధాంగి
చీకటి నా ప్రియ దోస్త్....!

**డా.కటుకోఝ్వల రమేష్**
**సెల్:9949083327**

## లండన్‌లో పాలస్తినా యాక్షన్ ర్యాలీ 425 మంది అరెస్టు

**లండన్:** గాజాలో దారుణ మారణకాండను ఆపేయాలని కోరుతూ నిషేధిత "పాలస్తినా యాక్షన్" నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న 425 మందిని లండన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. పాలస్తినా ప్రజలకు న్యాయం చేయాలని, తక్షణం ఇజ్రాయెల్ యుద్ధం నిలిపివేయాలని కోరుతూ వందలమంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు తమ విధులు నిర్వహించకుండా పాలస్తినా యాక్షన్ ప్రదర్శకులు అడ్డుపడ్డారని, పోలీసులపై దాడిచేసి, వారిని గెంటేసి, ఘర్షణకు దిగారని ఆరోపిస్తూ ఈ అరెస్టులు చేశారు. ఆదివారంనాడు పోలీసులు ఈ అరెస్టులు చేశారు. పాలస్తినా యాక్షన్ ప్రదర్శకుల చర్య సహింపరానిదని మెట్రోపాలిటన్ పోలీస డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ క్లెయిర్ స్మార్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్‌లో వందలమంది ప్రదర్శకులను అడ్డుకోవడానికి దాదాపు 2,500 మంది పోలీసులను మోహరించినట్లు ఆయన చెప్పారు.

## కుట్టుమిషన్ అందజేత



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్‌శ్రీను ఇటీవలరోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం తెలిసిందే. అతనికి భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. దీంతో ఆదివారం గ్రామంలో సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డిలు రూ.23వేలు విలువచేసే కుట్టుమిషన్‌ను అందజేశారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాయితి శ్రీనివాస్‌రెడ్డి, జంగీర్, బాలజంగయ్య, బాలీశ్వర్‌గౌడ్, లక్ష్మయ్య, శ్రీను, బాలస్వామి, లాలు, కృష్ణయ్య, నిరంజన్, రామస్వామి, పెంటయ్య, శివ పాల్గొన్నారు.

## మిలాద్- ఉన్- నబీ ర్యాలీ శాంతియుతంగా జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సోమవారం రోజు మిలాద్ ఉన్ నబి ర్యాలీ ఉన్న సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో మిలాద్ ఉన్ నబీ పండగ ర్యాలీనీ శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు. ముస్లిం కమిటీ సభ్యులు మిలాద్ ఉన్‌నబి ర్యాలీని శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని అందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం, పోలీస్ పికెట్స్ ఏర్పాటు, ప్రధాన చౌరస్తాలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందరూ శాంతియుతంగా కులమతాల కతీతంగా పండుగ ర్యాలీని నిర్వహించుకోవాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా పోస్టులు చేస్తే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## సోషల్ మీడియాలో అసత్య వార్తలు వద్దు : ఎస్పీ జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, రెచ్చగొట్టే పోస్టులు, మతపరమైన, కులపరమైన, రాజకీయపరమైన విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు అలాగే ఏదైనా గ్రూపులకు లేదా సంఘాలకు వ్యతిరేకంగా అసత్యప్రచారం చేయడం వద్దని, ఇలాంటి చర్యలు సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరు అయినా సోషల్ మీడియాలో అసత్య వార్తలు, తప్పుడు సమాచారం, ద్వేషపూరిత వ్యాఖ్యలు, రాజకీయపరమైన లేదా మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు చేస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మతాలు, కులాలు, రాజకీయ పార్టీలు,సంఘాలు లేదా గ్రూపులకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయడం నేరమని, సమాజంలో శాంతి సామరస్య వాతావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, నిర్ధారణ లేని వార్తలను నమ్మకూడదని, షేర్ చేయకూడదని సూచించారు. ఇలాంటి పోస్టులు గమనించిన వారు వెంటనే తమకు సమీపంలోని పోలీసు స్టేషన్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 100/112 కి సమాచారం అందించాలన్నారు. సమాజ శాంతి భద్రతల కోసం ప్రతి ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు.



## కన్నతండ్రిని హత్యచేసిన కొడుకు అరెస్టు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలో తండ్రిని హత్యచేసి మృతదేహాన్ని తల, మొండెంలను వేరుచేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టుచేసినట్లు కల్వకుర్తి డిఎస్‌పి సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 3వ తేదీన బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో తండ్రి బాలయ్యను కర్రతో కొట్టి హత్యచేసి తనబంధువైన అంజి సహాయంతో కారులో వంగూరు మండలం చింతపల్లి దుందుభి నది వద్ద యాక్సాబ్లేడుతో మృతదేహాన్ని తల, మొండెంలను వేరుచేసి చెవులకు నాలుగు బంగారు చెవిపోగులు తీసుకొని మృతదేహాన్ని దుందుభి నదిలో పడేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. హత్యచేసిన వారిలో బీరయ్య(ఎ1), అంజి(ఎ2)గా గుర్తించినట్లు తెలిపారు. తండ్రిని హత్యచేయడానికి కారణం తన కుమార్తె మూడునెలలక్రితం అమావాస్యరోజున ఆత్మహత్యచేసుకుందని, తనతండ్రి బాలయ్య చేతబడిచేసి తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడని నిందితుడు చెప్పినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామశివారులో దుందుభినదిలో బాలయ్య తలలేకుండా మొండెం దొరికిందని, శనివారం చింతపల్లి దుందుభినదిలో తలభాగం దొరికిందని చెప్పారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామని తెలిపారు. నిందితుల నుండి ఒక కారు, ఒక బైకు, యాక్సల్ బ్లేడు, నాలుగు బంగారు చెవిపోగులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి ... వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** విధి నిర్వహణలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పై తాగిన మైకంలో ఉన్న వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ కె.రాణి కథనం ప్రకారం మండల పరిధిలోని కల్వరాలలో శనివారం సాయంకాలం వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన మండ్ల నర్సింహ అనే వ్యక్తి తాగిన మైకంలో వీరంగం సృష్టిస్తూ నిమజ్జనం ఊరేగింపుకు ఆటంకం కలిగిస్తుండటంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ , కానిస్టేబుల్స్ ఖాజా జగదీష్ గౌడ్‌లు ఊరేగింపు వద్దకు వెళ్లిన తాగి వీరంగం సృష్టిస్తున్న మండ్ల నర్సింహను అదుపులోకి తీసుకుంటుండగా ఎండి ఖాజా అనే కానిస్టేబుల్ పై దాడికి పాల్పడి అతను చొక్కాకున్న నేమ్ ప్లేట్‌ను చించి వేసినట్లు తెలిపారు. నర్సింహను పోలీస్ వాహనంలో పోలీస్ స్టేషన్‌ను తీసుకువస్తుండగా వాహనం అద్దాలను తన్ని పగలగొట్టినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె. రాణి తెలిపారు. మద్యం మత్తులో అల్లరి చేస్తూ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

## మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో పాల్గొని, ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు మాజీ మంత్రి వర్యులు డా.సి.లక్ష్మారెడ్డి తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం సౌభ్రాతృత్వం, శాంతి, కరుణ సందేశాన్ని అందించే పవిత్ర సందర్భం. మన సమాజంలో శాంతి, ఐక్యత ఎల్లప్పుడూ నెలకొనాలని అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# ప్రజా ఉద్యమాలకు సిద్ధంకావాలి

సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజా ఉద్యమాలకు సిద్ధంకావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశాలు ఇందిరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే ప్రభుత్వంపై ప్రజాపోరాటాలు చేయడానికి సిపిఐశ్రేణులు, ప్రజాసంఘాలు సిద్ధంకావాలని అన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, వాటిని సరిచేయకపోతే సిపిఐ పక్షాన కొల్లాపూర్ నియోజకవర్గంలో త్వరలోనే అన్ని మండల కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఒకవైపు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కమ్యూనిస్టులు ముందుంటారని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెబుతున్నా దానికి భిన్నంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతుందని, కమ్యూనిస్టులు ఎన్నికలప్పుడు మాత్రమే అవసరం, తర్వాత వారి అవసరంలేదనే విధంగా మంత్రి ప్రవర్తిస్తున్న తీరు సరైనదికాదన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందాలని లేకపోతే విడతలవారిగా ప్రభుత్వంపై ప్రజలతరపున పోరాటం చేయడానికి వెనకడుగువేసేదిలేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పార్టీబలం ఉన్నప్రతిచోట పోటీ చేస్తామన్నారు.
కార్యక్రమంలో సిపిఐరాష్ట్రసమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గసభ్యులు నర్సింహ్మా, విజయుడు, జిల్లా కౌన్సిల్‌సభ్యులు కృష్ణాజి, మర్యాదవెంకటయ్య, శంకర్‌గౌడ్, బిజ్జశ్రీను, బండిలక్ష్మిపతి, శివశంకర్, రవీందర్, తుమ్మలశివుడు, మల్లేష్, పరుషరాములు, గడ్డంశ్రీను,గోపాల్, మధుగౌడ్, నరేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

# సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ముదిరాజ్‌లో సమస్యలు తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముదిరాజ్ లకు బిసిడి నుంచి బిసిఎ లోకి మార్చాలని స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో తెలంగాణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ముదిరాజ్ రిజర్వేషన్ సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోకుండా విస్మరించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నారాయణపేట వేదిక గా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్ లను బిసిడి నుంచి బిసిఎ లోకి మార్చుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కావున మీ సమస్య వీలైనంత త్వరగా సాకారం అవుతుందని ఆయన చెప్పారు. ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ఇప్పుడు రాష్ట్ర మంత్రితో చర్చించి సూచనలు సలహాలు తీసుకొని ముందుకు పోతామన్నారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను, ఎమ్మెల్యేలను కలుపుకొనిపోయి వీలైనంత త్వరగా పరిష్కారించేందుకు నా బాధ్యత గా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దోరేపల్లి లక్ష్మి రవీందర్, మైత్రి యాదయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గోనెల శ్రీను, ముదిరాజ్ సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు ఎన్.శ్రీనివాసులు, వెంకటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** విద్యారంగంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎస్.అంతిరామ్ నాయక్ పదవి విరమణ మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడు అంకితభావంతో చేసిన సేవతోనే విద్యార్థికి, ఆ కుటుంబానికి తద్వారా దేశానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అంతిరామ్ నాయక్ మంచి ఆలోచన కలిగిన వ్యక్తి సమాజానికి ఉపయోగపడే విధంగా ఆయన జీవితం సాగిందన్నారు. న జీవిత కాలంలో 37 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడుగా వేలమంది విద్యార్థులు వారి లక్ష్యాలు చేరేందుకు కృషి చేశారనుటలో సందేహం లేదన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అంతిరామ్ నాయక సఫలీకృతం అయ్యారన్నారు. మీరు ఉపాధ్యాయుడిగా పదవివిరమణ చేస్తున్నారు. కానీ, ఇంకా మంచి సమాజం కోసం, మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం మీ సేవలు ఎంతో అవసరం ఉన్నాయన్నారు. అనంతరం అంతిరాం నాయక్ దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, రాంచందర్, రాజ్ సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# 'అక్రమ కేసు' ఫిర్యాదు బూటకం

శానిటరి అధికారి రాంనాయక్ నరేందర్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలి

నరసింహ, ఎఐటియుసి ఏరియా ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షుడు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై నిత్యం కార్మికుల హక్కులకై సంక్షేమానికి నిస్వార్ధంగా అలుపెరగని కార్మిక పోరు సల్పుతున్న ఎఐటియుసి అనుబంధం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పై పెట్టిన అక్రమ కేసు ఫిర్యాదు పచ్చి బూటకమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు నరసింహ ఆరోపించారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులపై, వేతనాల పెంపుకై మాట్లాడడానికి వెళ్లిన మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పై జనరల్ ఆసుపత్రి సిహెచ్‌ఓ రాంనాయక్ , ఎస్‌హెచ్‌ఓ నరేందర్‌లు కుట్రపూరితంగా అనుచిత వ్యాఖ్యాలు చేయడమే కాక దాడి చేసి, వారే మళ్లీ దొడ్డి దారిన యూనియన్ నేతలపై అక్రమ కేసుల ఫిర్యాదులు చేయడం నిరసిస్తూ ఆదివారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ కార్మికులకు జరుగుతున్న అన్యాయం అక్రమాలపై మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ చేస్తున్న పోరాటాలతో శానిటరీ అధికారుల, ఏజెన్సీల కాంట్రాక్టర్ల చీకటి ఒప్పందాలు వారి అవినీతి అక్రమాలు, అధికారుల నీచ వ్యసనాలు బయటపడుతున్నాయని, యూనియన్ పోరాటాన్ని ఎదుర్కొలేక దుర్బుద్ధితోనే యూనియన్ నేత పి.సురేష్ పై తప్పుడు కేసులు దౌర్జన్యాలు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో సిహెచ్‌ఓ రాంనాయక్, ఎస్‌హెచ్‌ఓ నరేందర్ లాంటి కొద్దిమంది అధికారులను గుప్పెట్లో పెట్టుకుని కార్మికులను మానసిక శారీరక వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాం నాయక్ పై ఇప్పటికే అనేక పర్యాయాలు కార్మికుల ఫిర్యాదులు ఇచ్చారని ఇందుకు వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకుని మారడానికి అవకాశం ఇచ్చిన తన వక్ర బుద్ధి మారడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నవీన్, శేఖర్, రవీందర్, ఫేర్మల్ విజయలక్ష్మి, మనేమ్మ, పద్మ, అలివేలు, లక్ష్మి, నరసమ్మ, భార్గవి, నీరజా, శివలీల, సుక్కమ్మ, స్వాతి, నరసమ్మ, మంగమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

# కోర్టుకు స్థలం కేటాయింపు అభినందనీయం

జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్ షాకీర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల కేంద్రంలోని కోర్టు భవనం శిథిలావస్థలో ఉండటంతో నూతన భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని 2022లో అప్పటి జిల్లా జడ్జి , జిల్లా కలెక్టర్‌కి లేఖ రాయడం జరిగింది. కానీ కొంత కాలం ఈ అంశం నిలిచిపోయిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో మేము జడ్చర్ల బార్ అసోసియేషన్ సభ్యులమంతా కలిసి గత మే నెలలో స్థానిక శాసనసభ్యులు జానంపల్లి అనిరుద్‌రెడ్డిని ఆయన క్యాంపు ఆఫీసులో కలిసి ఈ సమస్యను వివరించాము. మా అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌తో స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి, అనంతరం స్వయంగా మా సభ్యులందరినీ కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి రాతపూర్వకంగా కూడా తన లెటర్ హెడ్‌పైన కోర్టు నిర్మాణానికి కావలసిన స్థలాన్ని కేటాయించాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్డీవో, ఎమ్మార్వో అధికారులను పంపి పరిశీలన చేయగా, ప్రస్తుత కోర్టు భవనం శిథిలావస్థలో ఉందని, కొత్త భవనానికి 3 ఎకరాలు కాకపోయినా 2 ఎకరాలు 10 గుంటలు స్థలం కేటాయించే అవకాశం ఉందని అధికారులు వివరణ ఇచ్చామని తెలిపారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి కోర్టు ఆవరణను స్వయంగా పరిశీలించి, ప్రస్తుత భవనాలు, రెసిడెన్సియల్ క్వార్టర్స్ స్థలం సహా మొత్తం భూభాగాన్ని న్యాయశాఖకే కేటాయించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో అధికారులను పలుమార్లు కోరారు. మా అసోసియేషన్ తరపున కూడా అవసరమున్నప్పుడల్లా ఎమ్మెల్యే అధికారులతో సమన్వయం చేస్తూ ఈ సమస్యపై నిరంతరం పట్టుదలతో కృషి చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే నిరంతర కృషి ఫలితంగా ఈ నెల 4వ తేదీన 2 ఎకరాలు 10 గుంటల స్థలాన్ని కోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదం ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధ్యమైనందుకు స్థానిక శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి కి జడ్చర్ల బార్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు

**ప్రజాపక్షం/మక్తల్ :** పట్టణ కేంద్రంలో వివిధ కాలనీలలో వెలసిన గణనాథులు 11 రోజులు పూజలు అందుకుని ఆదివారం గంగమ్మ ఒడికి చేరాయి. పట్టణ కేంద్రంలోని ఆజాద్ నగర్ చౌక్ లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణపతి మండప నిర్వాహకులకు బహుమతులను అందజేశారు. గణనాధుని మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి డాన్సులు దాండియా కోలాటాలతో అందరికీ దేవుడు ఒకటేనని మతసామరస్యంగా పట్టణ కేంద్రంలోని ట్యాంక్ బండ్ పెద్ద చెరువులో గణనాథులని మండప నిర్వాహకులు అధికారులు నిమజ్జనం చేశారు. పోలీస్ శాఖ వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామ్ లాల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు విద్యుత్ అధికారులు పోలీస్ శాఖ అధికారులు బజరంగ్దళ్ విశ్వ హిందూ పరిషత్ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వనపర్తి పట్టణంలో 19వ వార్డు గాంధీనగర్‌కు చెందిన మండ్ల లోకేష్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని ఎస్టీ థామస్ హై స్కూల్ ముందు ఏర్పాటు చేసిన బెల్లం టీ హోటల్ ను ప్రారంభించారు. యువత అన్నిరంగాల్లో ముందుకు వెళ్లి ఆర్థికంగా బలోపేతం కావాలని, పట్టుదలతో సాధిస్తే ఆర్థికంగా ఎదగడానికి యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లి మంచి విజయాలు సాధిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జిల్లపల్లి చంద్రయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న హమాలి సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించినవారిలో సలేశ్వరం, లక్ష్మయ్య, మల్లయ్య, రాములు, సత్తయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

## మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతలకు అనుమతులు ఇప్పించాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా రైతులకు సాగునీరు, తాగునీరు అందించే మక్తల్‌నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంకు అన్నిరకాల అనుమతులు ఇప్పించుటకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని జల సాధన సమితి కోకన్వీనర్ హెచ్.నర్సింహా విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ లో వేసిన కేసును వెంటనే విచారణ చేపించి అనుమతులు ఇప్పించుటకు పాలమూరు ఎంపీ డికే అరున కేంద్ర జల శక్తి మంత్రితో మాట్లాడాలని కోరారు. ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే ఈ ఎత్తిపోతల పై ప్రత్యేక దృష్టి పెట్టి కాలయాపన చేయకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చిన్న నర్సిములు, కుర్మప్ప, కిష్టప్ప, మహేస్, గోవింద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి సిఎంఆర్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన దాడి హర్షవర్ధన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబం సిఎంఆర్ఎఫ్ పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేయగా, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన రూ. 29,000 చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపోతుల రాంబాబు నాయుడు, పలుచ రామన్ గౌడ్ , మంగదొడ్డి తిరుపతయ్య, మామిళ్లపల్లి సత్యం రావులు , బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సహాయం అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మ సమాజ్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో 90% బిసి, ఎస్సీ, ఎస్టీల రాజకీయ వేదిక అయిన ధర్మ సమాజ్ పార్టీ నూతన కార్యాలయాన్ని ముఖ్యఅతిథి ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జ్ హరప్పన్ మహారాజ్ నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కన్వీనర్ గువ్వల శివరాజ్ పోర్ల డేవిడ్, ఈశ్వర్, దశరథ్ అడ్వకేట్, జి.కృష్ణ, ఏర్పుల ఆంజనేయులు, గోపాల కృష్ణ, వీరేష్ బలిజ, ఆంజనేయులు, నాగేష్, నరేష్, ముదిరాజ్, వేణు వివిధ హోదాలలో పనిచేస్తున్న జిల్లా మండల గ్రామ స్థాయి ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని వెల్గొండ గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లోఉన్న విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే కూచుకుళ్లరాజేష్‌రెడ్డి చొరవతో సమస్య పరిష్కారమైంది. ప్రజాప్రభుత్వంలో వెల్గొండ గ్రామానికి రూ.50లక్షలతో విద్యుత్ స్తంభాలు, ఇతర విద్యుత్ సామాగ్రితోపాటు గ్రామంలో కొత్త విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయడంతో కాంగ్రెస్ నాయకులు, గ్రామప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రశాంతంగా నిమజ్జనం కార్యక్రమం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం అర్ధరాత్రి వరకు కొనసాగగా పోలీస్ అధికారులు సిబ్బందితో, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ గణేష్ నిమజ్జనం పూర్తి అయ్యే వరకు సలహాలు, సూచలనలు చేస్తూ గణేష్ నిమజ్జనం సజావుగా ముగిసినందుకు గణేష్ ఉత్సవ సమితి సభ్యులను, ప్రజలను, ఈ కార్యక్రమంలో శ్రమించి పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందినీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు.

## నిమజ్జనానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవం ఎలాంటిదైన అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో జరుపుకున్నారని, గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్న స్ఫూర్తి భవిష్యత్తులో కూడా చూపాలని ఎస్‌పి కోరారు. ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి భద్రత రక్షణ ఎల్లప్పుడు కల్పించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులకు, బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.



## ఉచిత కంటి పరీక్ష శిబిరం

**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌వివిఎస్ ఆసుపత్రి మేనేజర్ కందూరు రామిరెడ్డి ఈ శిబిరంలో కంటి చూపు బాధితులు చూపు మందగించడం దగ్గర చూపు దూరపు చూపు కంటి పోరలుతో కంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న 50 సంవత్సరాల పై బడ్డ వారికి ఈ గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించడం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌వివిఎస్ హస్పిటల్ మేనేజర్ కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి కంటి నిపుణులచే పరీక్షలు నిర్వహించుకుని వారి సలహా సూచనలతో కంటిపోరలు ఉన్నవారికి కందూరు రామిరెడ్డి కంటి ఆసుపత్రి మహబూబ్‌నగర్ తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. వారిని సొంత వాహనంలో తీసుకెళ్లి భోజన వసతులు కల్పించి ఆపరేషన్ ఈ శిబిరము జల్లాపురం గ్రామపంచాయితీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరిగింది.కావున ఈ గ్రామంలో ఉన్న కంటిచూపు బాధితులు అధికంగా పాల్గొని కంటి పరీక్షలు చేసుకోవడం జరిగింది.



## ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలోని ప్రతి రైతుకు సరిపడా యూరియా అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయా మండలాలకు చెందిన ఏవోలు, ఏఈవోలు, సీఈవోలతో, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు యూరియా అందేవిధంగా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌లకు తరలకుండా చర్యలు తీసుకోవాలని, యూరియా పక్కదారి పట్టకుంటా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టే విధంగా కేంద్రం ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి రైతులందరికి యూరియా అందించడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ ధీరావత్ సైదానాయక్, ఏవోలు సరిత, రుషేంద్రమణి, కిశోర్‌కుమార్, శివరాంకుమార్, ఏఈవోలు షఫి, గోపి, లావణ్య, ప్రియాంక, నరేష్, రమేష్, నితిన్‌నాయక్, వేణుగోపాల్, పీఏసీఎస్ వెంకట్‌రెడ్డి, రవీందర్, మల్లయ్య, అంజయ్య, సతీష్, సైదులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




**ప్రజాపక్షం/మునగాల:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం ముకుందాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నడిగూడెం మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట తండాకు చెందిన బాణోతు సేవ్య(60) కూరగాయల వ్యాపారం చేస్తుంటడాన్ని, రోజు మాదిరిగానే తన ఎలక్ట్రికల్ బైకుపై కూరగాయలను ముకుందాపురం గ్రామంలో అమ్ముకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఎన్‌హెచ్65 జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా హైద్రాబాద్ నుండి విజయవాడ వెళ్తున్న ఇన్నోవ క్రిష్ట కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా కారు నడిపి సేవ్య నడుపుతున్న ఎలక్ట్రికల్ బైకుకు టక్కర్ ఇవ్వగా సేవ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని మనువడు బాణోతు సాయిభరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ప్రోటోకాల్ పాటించని విద్యాశాఖ అధికారులను, డిఈఓ, ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కెవిజీవిబి పాఠశాలలో నూతన అదనపు తరగతి గదుల నిర్మాణం శంకుస్థాపనకు కార్యక్రమానికి శాసనమండలి సభ్యుడు సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ను ఆహ్వానించకుండా ప్రోటోకాల్ పాటించకుండా అవమానపరిచిన విద్యా శాఖ, డిఈఓ, కస్తూరిబా పాఠశాల ఎస్ఓలను సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చన గోని గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిలాఫలకం వద్ద నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు ప్రజలకు గౌరవం ఇవ్వడం ప్రతి అధికారి విధి అని ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సభ్యుడు చిలువేరు అంజయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, యాదగిరి, యాది పాల్గొన్నారు.

## 'రావి' జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి





**ప్రజాపక్షం/దేవరకొండ :** పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్, సిపిఐ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపి అమరజీవి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, నేటి యువత రావి నారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, మైనోద్దీన్, పట్టణ శాఖ కార్యదర్శులు వెంకటయ్య, శ్రీను, జ్యోతిబస్, నాయకులు పర్వతాలు, రాజమల్లయ్య, ఆనందచారి, జాకీర్, శ్రీను, పాండు, పర్వతాలు, బక్కయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వారి స్తూపం వద్ద సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల సిపిఐ పార్టీ సమితి సభ్యులు మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి వెల్లంకి మహేష్, పోలేపాక యాదయ్య, సల్వాద్రి రవీందర్, బొడిగే సుదర్శన్, సుద్దాల సాయికుమార్, పులిపలుపుల మల్లేష్, కొయ్యగూర రాములు, పాల్గొన్నారు.



# సాగర్ 14గేట్లు ఓపెన్





### ప్రాజెక్టుకు పెరిగిన వరద... 14 గేట్ల ద్వారా నీటి విడుదల...

**ప్రజాపక్షం/నందికొండ:** ఐదు రోజుల విరామం తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ముచ్చటగా మూడోసారి తెరుచుకున్నాయి.గత బుధవారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 585.20 అడుగులుగా ఉండి 50 వే ల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వద్ద ప్రాజెక్టు అధికారులు గేట్లను మూసివేశారు అయితే అప్పటి నుండి శనివారం రాత్రి వరకు వేలల్లో కొనసాగిన ఇన్ ఫ్లో ఒకేసారి లక్ష కు పైన క్యూసెక్కులకు పెరగడం అదే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం కూడా గరిష్ట సాయికి చేరుకోవటంతో వెంటనే మొదట 2గేట్లను తరువా త 8 గేట్లను ఆ తరువాత 10 గేట్లను,సాయంత్రం 14 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 112966 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఈ సీజన్ స్వల్ప వ్యవధిలోనే ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం ఇది మూడవసారి కావటం గమనార్హం.

**రిజర్వాయర్ సమాచారం** : నాగార్జునసాగర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి589.70 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టిఎంసిలకు311.1486 టిఎంసిలుగా ఉన్నది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి 33820 క్యూసెక్కులు కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు ఎస్ఎల్‌బిసి ఎఎంఆర్‌పి ద్వారా 2400 క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా వస్తున్న 167440 క్యూసెక్కుల నీటిని అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.

**సాగర్ లో పర్యాటకుల సందడే..సందడి**

ఐదు రోజుల విరామం తర్వాత ప్రాజెక్టు గేట్లు మళ్లీ తెరుచుకోవడంతో ఆదివారం సాగర్ లో పర్యాటకుల సందడి నెలకొంది వరసగా సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లో ఆదివారం పర్యాటకులు బారులు తీరారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో విద్యార్థులు పర్యాటకులు తరలి వచ్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడి నుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల జలపాతం, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు.

## ప్రభుత్వ హాస్టల్లో మౌలిక సదుపాయాలలో
# రాజీ ప్రసక్తే లేదు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
### కెవిజివిబిలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రభుత్వ హాస్టల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలలో రూ.62 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే పాఠశాల మొత్తం పరిశీలించారు. అంతకుముందు మండల కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కస్తూర్బా పాఠశాలను కలియతిరిగి విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ హాల్, బాత్రూం, టాయిలెట్స్, ప్లే గ్రౌండ్స్, లాంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయా అని పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. డార్మెటరీ హాల్‌లను పరిశీలించి విద్యార్థినుల సంఖ్యకు సరిపడా అదనపు గదుల నిర్మాణం, 12 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్స్, బాత్రూం సరిపడేలా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ లో మౌలిక వసతులపై తన వ్యక్తిగత ఇంజనీర్ల తో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఆయన వెంట మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**రైతులకు అన్యాయం జరిగితే పోరాటం**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం ట్రిబుల్ ఆర్ భూముల నిర్వాసిత రైతులతో సమావేశమైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజలకు మరోసారి రైతులకు అన్యాయం విషయంలో తన ఎప్పటికీ రాజీపడనని స్పష్టం చేశారు. మునుగోడునియోజకవర్గ రైతులకు ప్రజలకు అన్యాయం జరిగితే ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని అవసరమైతే ప్రభుత్వంపై ఏ స్థాయిలోనైనా పోరాటానికి సిద్ధంగా ఉంటానని మీరు కూడా సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. గతంలో తన రాజీనామా వల్ల చౌటుప్పల్ నారాయణపురం రోడ్డు నిర్మాణం వంద పడకల ఆసుపత్రి ఘట్టుప్పల్ మండల ఏర్పాటు, చండూరు రెవిన్యూ డివిజన్, శివన్న గూడెం రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం లభించాయని గుర్తు చేశారు. రైతుల సమస్యలపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించే దిశగా తాను కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం, ఘట్టుప్పల్ మండలాల రైతులు పాల్గొన్నారు.



## యూరియా కొరత నివారించాలి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం మండల కేంద్రంలో సల్వాద్రి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ కేంద్ర ప్రభుత్వం యూరియాను కృత్రిమ కొరతను కొనసాగిస్తుందని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియాను రాష్ట్రానికి సరఫరా చేయాలని రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమయానికి ఏరువులు అందకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇదే అదునుగా కొంతమంది ఫెర్టిలైజర్ యజమానులు బ్లాక్లో యూరియాను అమ్ముకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారని వారి పైన వ్యవసాయ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. తక్షణమే యూరియాను సొసైటీల ద్వారా వేగవంతంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు బోలోగోని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్,ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, బొడిగె సుదర్శన్, బాలగోని సత్యనారాయణ, కట్ల యాదగిరి పాల్గొన్నారు.

## మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో యువత పయనించాలి: డిఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** యువత మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో పయనించి సమాజానికి సేవ చేయాలని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి సూచించారు.ఆదివారం మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినం సందర్భంగా పట్టణంలోని గడియారం సెంటర్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రవక్త కరుణ, మానవత్వం, సత్యనిష్ఠలను స్మరించారని తెలిపారు.మిలాద్ కమిటీ ప్రతి ఏడాది దాదాపు 15 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎన్నో ప్రమాదాల బారిన పడ్డ రోగులకు రక్తాన్ని అందించి రక్తదాతలుగా నిలుస్తున్నారని మిలాద్ కమిటీని అభినందించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మిలాత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి తరానికి సాయుధ పోరాట అమరుల జీవిత చరిత్ర

### సాయుధపోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సిపిఐ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన ఆ పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి స్వార్థానికి తావివ్వకుండా, ప్రజా సంక్షేమ కోసమే తమ జీవితాలను అంకితం చేసిన నాటి తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల జీవిత చరిత్రను నేటి తరానికి అందించాలని అందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో జిఎస్‌టి తగ్గించామని గప్పాలు కొడుతున్న కేంద్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందికి జీతాలు రాక ఆరు నెలలు అయిందని తక్షణమే వారి జీతాలను విడుదల చేయాలని ఒక్కనెల జీతం రాకపోతేనే ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని అలాంటిది ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వారి జీతాలను ఏజెన్సీ ద్వారా ఇచ్చే విధానాన్ని మార్చి కార్పోరేషన్ ఏర్పాటు చేసి నెలనెలా జీతాలు ఇవ్వాలని వారికి జీతాలు చాలా తక్కువ మొత్తంలో ఇస్తారని అలాంటిది ఆ ఇచ్చే వాటిని కూడా సక్రమంగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వారికి సిపిఐ అండగా ఉంటుందని అవసరమైతే ఉద్యమిస్తానికి కూడా వెనుకాడబోమని హెచ్చ రించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్‌కె సాయిబల్లి, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, ఉప్పతల కోటమ్మ, జడ శ్రీనివాస్, చేపూరి కొండలు, యల్లావుల రమేష్, అనంతుల మల్లీశ్వరి, కాంపల్లి వెంకటయ్య, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, కడియాల అప్పయ్య, కందుల వెంకటేశ్వర్లు, యల్లబోయిన సింహాద్రి, ఏ లక్ష్మి , భరత్, జానయ్య, భద్రారెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో పోలీసు రాజ్యం

### అర్థం లేని కేసులో అర్ధరాత్రి అరెస్టులు అక్రమం..
### చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దు..

**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణలో పోలీసుల రాజ్యం నడుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అర్థం లేని కేసుల్లో పోలీసులు అర్ధరాత్రి అరెస్టులు చేయడం అక్రమమన్నారు. చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దని హితవు పలికారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట 5వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భాషామియాను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా పైన ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. యూరియా కోసం రైతులు లైన్‌లో నిలబడితే వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు పెడితే కూడా కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. ఓ తాగుబోతు ఇచ్చిన ఫిర్యాదుకు మా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ భాషామియాపై పోలీసులు కేసులు పెట్టడం చట్టవిరుద్ధమన్నారు. అక్రమ అరెస్టుపై ప్రజలు తిరగబడి ఒత్తిడి చేయడంతో భాషామియాను వదిలిపెట్టడం జరిగిందన్నారు. కేసులకు ఏ మాత్రం భయపడమని, తాము తెలంగాణ ఉద్యమ కాలంలో ఇలాంటివి ఎన్నో చూశామని చెప్పారు. చిల్లర కేసులకు బిఆర్ఎస్ భయపడదని గంజాయి మూకలతో సమాజం ఆగం అవుతుందని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సూర్యాపేట, నల్లగొండ ఎస్‌పిలకు తాను మరొక సారి చెబుతున్నానని లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతుందని వాటిపై దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులను కాపాడుకునేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు.



# చివ్వెంల పోలీసు స్టేషన్ ఎదుట 'హై'డ్రామా!

### మాజీ కౌన్సిలర్ భాషామియా అరెస్టుపై బిఆర్ఎస్ నేతల ఆందోళన..

**ప్రజాపక్షం/సూర్యాపేట :** చివ్వెంల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం హైడ్రామా కొనసాగింది. సూర్యాపేట మున్సిపాలిటిలోని 5వ వార్డు మాజీ కౌన్సిలర్ భాషామియాను తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీనికి ప్రధాన కారణం తన శిష్యుడిగా కొనసాగుతున్న మున్నీర్‌పై హత్యాయత్నం చేశాడనే ఫిర్యాదు మేరకు పోలీసులకు అతనిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో వార్డు ప్రజలు దాదాపు 5 వందల మంది ప్రజలు స్టేషన్ వద్దకు తరలివచ్చి ఒక్కసారిగా స్టేషన్‌ను చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఇద్దరు వ్యక్తుల మధ్యన జరిగిన చిన్న పంచాయితీని పోలీసులు పెద్దదిగా చూపి అర్ధరాత్రి అరెస్టు చేయడమేమిటని తప్పుపడుతూ వారిని నిలదీశారు. మాజీ రాజ్యసభ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, ఎమ్మెల్యే వ్యక్తిగత పిఏ ప్రభాకర్ రెడ్డి తోపాటు నియోజక వర్గంలోని బిఆర్ఎస్ ముఖ్య నాయకులందరూ భాషామియాకు మద్ధతుగా స్టేషన్ వద్దకు వెళ్ళి దురాజ్‌పల్లి వార్డు ప్రజలు చేస్తున్న ఆందోళనకు మద్ధతు పలికారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్‌ను రంగంలోకి దింపారు. అక్కడకు చేరుకున్న ఆయన పరిస్థితిని చేదాటకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఆందోళనకారులతో మాట్లాడి భాషామియాపై చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఆయనను విడుదల చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో ధర్యాప్తు కొనసాగుతుందని మీడియాకు చెప్పారు. భాషామియా విడుదల కావడంతో బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన విరమించారు.

**కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి..**

భాషామియా అరెస్టుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్పందిస్తూ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లుగా పోలీసులు నడుచుకుంటూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తుందని ప్రజలనుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక బిఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని అన్నారు. అర్థం లేని కేసుల్లో అర్ధరాత్రి అరెస్టులు చేయడం అక్రమమన్నారు. ఓ తాగుబోతు ఇచ్చిన ఫిర్యాదుతో తమ పార్టీ సీనియర్ నాయకుడు భాషామియాను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రజల ఒత్తిడితోనే అరెస్టు చేసిన భాషామియాను పోలీసులు విడుదల చేశారన్నారన్నారు. దీని వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తముందంటూ ఆరోపించారు.




**చిల్లర పంచాయితీకి మాకు సంబంధం లేదంటూ కాంగ్రెస్ నేతల ఖండన..**

చిల్లర పంచాయితీకి మాకు సంబంధం లేదంటూ కాంగ్రెస్ నేతలు సోషల్‌మీడియా వేదికగా భాషామియా అరెస్టుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. భాషామియా గురించి ఆ వార్డు ప్రజలకు ఆయన ఏంటో తెలుసని దీనిలో మమ్ములను ఎందుకు లాగుతున్నారంటూ ప్రశ్నించారు. భాషామియాపై ఫిర్యాదు చేసిన మున్నీర్ బిఆర్ఎస్ నాయకుడేనని తమకు అతనికి ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు.

# క్రీడ



## హాకీ ఆసియా కప్‌లో విజేత భారత్

### కొరియాపై ఘన విజయం..

హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఆరంభం నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో దక్షిణకొరియాను చిత్తుగా ఓడించింది. అద్భుత విక్టరీతో నాలుగో ఆసియా కప్ టైటిల్‌ను దక్కించుకుంది. తద్వారా ఎనిమిదేళ్ల తర్వాత ఈ మెగా టోర్నీలో విజేతగా నిలిచింది భారత్. అంతేకాదు ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ బెర్తును కైవసం చేసుకుంది హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరిగిన ఆసియా కప్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు ఓ రేంజ్‌లో విరుచుకుపడింది. లీగ్ దశ నుంచి తిరుగులేని ఆధిపత్యంతో టైటిల్ కొల్లగొట్టింది. సూపర్ 4లో చైనాపై 7–0తో గెలుపొందిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చుక్కలు చూపించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడి 4–1తో కొరియా ను మట్టికరిపించింది. ఇంతకుముందు 2003, 2007, 2017లో ఆసియా కప్‌ను తన్నుకుపోయింది టీమిండియా. తొలి అర్ధ భాగంలో గోల్ ప్రయత్నాలను అడ్డుకున్నారు. అయితే.. రెండో అర్ధ భాగంలో సుఖ్‌జీత్ సింగ్ తొలి గోల్ అందించాడు. అనంతరం దిల్‌ప్రీత్ సింగ్ ఆధిక్యాన్ని 20కు పెంచాడు. అతడే కాసేపటికే మరో గోల్ తో భారత్ విజయం ఖాయమైంది. అనంతరం పెనాల్టీ కార్నర్‌ను అమిత్ రోహిదాస్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత లభించిన పీసీని కొరియా సద్వినియోగం చేసుకొని ఖాతా తెరిచింది. అప్పటికే భారత్ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. చివరి వరకూ మరో గోల్ చేసేందుకు పోరాడారు. కానీ, భారత డిఫెండర్లు వాళ్ల ఎత్తుల్ని చిత్తు చేశారు.



## సెంట్రల్ జోన్‌కు ఆధిక్యం

### వెస్ట్, నార్త్ జోన్స్‌కు నిష్క్రమణ ముప్పు!

**బెంగళూరు:** దులీప్ ట్రోఫీలో సెమీస్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి 118 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించి ఫైనల్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో వెస్ట్ జోన్ 438 రన్స్‌కు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. 229/2తో మూడో రోజు ఆట ఆరంభించిన 'సెంట్రల్'కు శుభమ్ (96), కెప్టెన్ రజత్ పాటిదార్ (77), ఉపేంద్ర యాదవ్ (87), హర్ష్ దూబే (75) రాణించడంతో నాలుగో రోజు స్టంప్స్ సమయానికి ఆ జట్టు 556/8తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఇక సౌత్‌జోన్ కూడా ఫైనల్‌కు ఐదు వికెట్ల దూరంలో నిలిచింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ నాలుగో రోజు ఆట చివరికి 278/5తో నిలిచింది. ఆ జట్టు ఓపెనర్ శుభమ్ ఖజూరియా (128*) శతకంతో రాణించగా నిషాంత్ 82) కీలక ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టును ఆదుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్.. ఇంకా 258 పరుగులు వెనుకబడి (సౌత్‌జోన్ 536 ఆలౌట్) ఉంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప నార్త్, వెస్ట్ జోన్ జట్లు ఫైనల్ చేరడం కష్టమే.

## 72కే దక్షిణాఫ్రికా ఆలౌట్..

### అతిపెద్ద విజయంతో చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్!



వన్డే ఫార్మాట్‌లో అతిపెద్ద విజయంతో ఇంగ్లాండ్ చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో 342 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా వన్డేల్లో పరుగుల పరంగా అతిపెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది ఇంగ్లాండ్ గతంలో భారత జట్టు పేరిట ఉన్న రికార్డును బద్ధలు కొట్టింది హ్యారీబ్రూక్ సేన. సౌతాంప్టన్ మైదానంలో తొలుత జాకబ్ బెథెల్(110), జో రూట్ (100) సెంచరీలకు జోస్ బట్లర్ (62 నాటౌట్), జేమీ స్మిత్(62) అర్ధ శతకాలు తోడవ్వడంతో 414 రన్స్ కొట్టింది ఇంగ్లాండ్ అనంతరం పేసర్ జోఫ్రా ఆర్చర్ (418) ధాటికి సఫారీ జట్టు 72కే కుప్పకూలి దారుణ ఓటమి మూటగట్టుకుంది. నామమాత్రమైన మూడో వన్డేలో ఇంగ్లాండ్ బ్యాటర్లు దక్షిణాఫ్రికా బౌలర్లను ఊచకోత కోశారు. బౌండరీల మోతతో జట్టు స్కోర్ నాలుగొందలు దాటించారు. కుర్రాడు జాకబ్ బెథెల్(110), జో రూట్ (100), శతకాలతో భారీ స్కోర్‌కు పునాది వేయగా.. మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ (62 నాటౌట్) సైతం దంచేశాడు. దాంతో.. నిర్ణీత ఓవర్లలో ఇంగ్లండ 5 వికెట్ల నష్టానికి 414 రన్స్ చేసింది. ఈ ఫార్మాట్‌లో ఆ జట్టు 400 ప్లస్ చేయడం ఇది ఏడోసారి. తద్వారా టీమిండియా రికార్డును సమం చేసింది ఇంగ్లీష్ టీమ్. అనంతరం భారీ ఛేదనకు దిగిన సఫారీలకు జోఫ్రా ఆర్చర్ (418) తొలి ఓవర్లోనే షాకిచ్చాడు. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(0)ను డకౌట్ చేసి ఒత్తిడిలోకి నెట్టాడు. రియాన్ రికెల్టన్‌ను వెనక్కి పంపి సఫారీల పతనాన్ని శాసించాడు. ఆర్చర్ విజృంభణకు.. కార్సే, ఆదిల్ రషీద్ తోడవ్వగా.. క్రీజులోకి వచ్చినవాళ్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. దాంతో. 20.5 ఓవర్లలోనే 72 పరుగులకే తెంబా బవుమా బృందం కుప్పకూలింది.

# ఫోకస్ ఆరోగ్యం



## మధుమేహానికి కొత్త చికిత్స!


సాధారణ భాషలో 'సుగర్'గా పిలిచే మధుమేహ సమస్య ఇటీవల చాలా ఎక్కువగా కనిపిస్తున్నది. మందులతో ప్రారంభమయ్యే చికిత్స చివరికి ఇంజక్షన్ల వరకూ కొనసాగుతుంది. వీటికితోడు అంతులేని ఆహారపు నియంత్రణలు... జీవనశైలి నిబంధనలు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు చైనాలో పరిశోధకులు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొత్త చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చే పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ సానుకూల ఫలితాలనిచ్చాయి. చైనా శాస్త్రవేత్తలు స్టెమ్ సెల్ థెరపీ ద్వారా మానవ రోగుల్లో టైప్ 1, టైప్ 2 మధుమేహాన్ని విజయవంతంగా నియంత్రించారు. ఇప్పటికే ఇద్దరు రోగులు ఇన్సులిన్ తీసుకోవడం మానేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కోసం నిజమైన ఔషధాన్ని సూచించే అద్భుతమైన ఫలితం. అయితే, అమెరికా వంటి దేశాలు ఈ పరిశోధనను ఎంత వరకూ అంగీకరిస్తాయన్నది అనుమానంగానే ఉంది. అమెరికా, ఐరోపా దేశాలతోపాటు, ఆసియా ఖండంలోనూ అనేక ప్రాంతాల్లో ఇన్సులిన్ వాడకం ఎక్కువగా ఉంది. అమెరికా ఇన్సులిన్ మార్కెట్ విలువ 20 బిలియన్ డాలర్లు. ఈ చికిత్సను వృద్ధి చేయడంలో పరిశ్రమ దిగ్గజాలు తీవ్రమైన ప్రతిఘటన చూపే అవకాశం ఉంది. ఏదిఏమైనా, చైనా శాస్త్రవేత్తల పరిశోధన, లక్ష్యం ప్రశంసనీయం. మధుమేహానికి స్టెమ్ థెరపీ ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి రావాలని ఆశిద్దాం.



## ఐస్‌తో జాగ్రత్త..

చాలా వరకు ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్స్‌లో అందించే ఐస్ గురించి వివిధ అధ్యయనాల నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలో ఇప్పుడు ఈ వార్త సంచలనం సృష్టిస్తున్నది. సాధారణంగా ఐస్ అనగానే అది శుభ్రంగానూ, ఎటువంటి రోగకారక బ్యాక్టీరియా లేకుండానూ ఉంటుందని భావిస్తాం. కానీ కొద్ది సంవత్సరాల శాస్త్రీయ అధ్యయనాలలో, పేరుమోసిన పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోని ఐస్‌లో బాక్టీరియా చాలా ఎక్కువగా ఉందని తేలింది. ఈ బాక్టీరియా మరుగుదొడ్ల నీటిలో కంటే ఈ ఐస్‌మీదే ఎక్కువగా ఉందన్న వార్త అమెరికాలో హాట్‌టాపిక్‌గా మారింది. అమెరికన్ న్యూస్ చానెల్స్ ప్రకారం, కొన్ని ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్స్ నుంచి సేకరించి, విశ్లేషించిన ఐస్‌లో భయానక స్థాయిలో ఆరోగ్యానికీ ముప్పు కలిగించే బ్యాక్టీరియా ఉన్నాయని గుర్తించారు. కొన్ని ఐస్ నమూనాల్లో ఈ.కోలై, సాల్మొనెల్లా లాంటివి బాక్టీరియాను సైతం కనుగొన్నారు. రెస్టారెంట్లు ఐస్ మెషీన్లను తగిన విధంగా శుభ్రం చేయకపోవడం ఈ పరిస్థితికి మొదటి కారణంగా పేర్కొంటున్నారు. ఆ మెషీన్‌లలో ఉపయోగించే నీటి నాణ్యతను నిర్లక్ష్యం చేయడం కూడా మరో కారణం. కొన్నిసార్లు రెస్టారెంట్ సిబ్బంది శుభ్రమైన చేతులతో ఐస్‌ని తాకకపోవడంవల్ల కూడా బాక్టీరియా పెరుగుతుంది. ఇలాంటి ఐస్ వల్ల అనేకానేక ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. శుభ్రతపై శ్రద్ధ లేని హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ స్టోర్స్ లాంటి ప్రదేశాల్లోని ఐస్ మురుగునీటి కన్నా ప్రమాదకరమైనదిగా మారుతుంది.

## కేన్సర్‌ను జయించిన వారిలో 'సర్వైవల్ సెల్స్'



కేన్సర్ వ్యాధిని జయించి, ఆ మహమ్మారి నుంచి బయటపడిన వారిలో ప్రత్యేకమైన 'సర్వైవల్ సెల్స్' అని పిలిచే 'టి' కణాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఆవిష్కరణ కేన్సర్ చికిత్సలో కొత్త విధానాలకు శ్రీకారం చుడుతుందని అంటున్నారు. 'టి' కణాలు శరీర రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన భాగం. ఇవి హానికరమైన కణాలను గుర్తించి, అవి పెరగకుండా నశింపజేస్తాయి. కానీ, సాధారణంగా ఈ ప్రభావం ఎక్కువ కాలం కొనసాగదు. అయితే, సర్వైవల్ 'టి' కణాలు మాత్రం దీర్ఘకాలం చురుగ్గా ఉంటాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి కేన్సర్‌ను జయించడమేగాక, తిరిగి ఆ వ్యాధి సోకితే, మళ్లీ పోరాడేందుకు కేన్సర్ కణాలను గుర్తుంచుకుంటాయి. కాగా, ప్రస్తుతం కేన్సర్ చికిత్సకు అనుసరిస్తున్న కీమోథెరపీ, రేడియేషన్ తదితరాలు రోగి శరీరంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయి. సర్వైవల్ సెల్స్ శక్తిని అనుకరించడం ద్వారా, రోగిలో రోగనిరోధక శక్తిని బలపరచి, కేన్సర్‌కు వ్యతిరేకంగా సహజంగానే పోరాడే రీతిలో చికిత్సను అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి కేన్సర్ తుది స్టేజ్‌లో ఉన్నప్పుడు మెరుగైన చికిత్స అందించడం సాధ్యమవుతుంది. దీని వల్ల రోగులకు దీర్ఘకాలిక ఆశ కలుగుతుంది. ఈ కొత్త ఆవిష్కరణ కేన్సర్‌తో జపురుతున్న యుద్ధంలో పెద్ద మలుపు తీసుకురాగలదని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

## గ్రీన్ టీతో అల్జీమర్స్ దూరం!



జ్ఞాపకశక్తి నశించడం, ఆలోచించే నైపుణ్యం తగ్గడం వంటి రుగ్మతలను కలిగించే ప్రమాకరమైన అల్జీమర్స్‌ను గ్రీన్ టీ నియంత్రిస్తుంది. మెదడు వృద్ధాప్యాన్ని పూర్తిగా తొలగించకపోయినా, వాని ఉధృతిని మందగింప చేస్తుంది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, ఇర్విన్‌లో పరిశోధనలు జరిపిన శాస్త్రవేత్తల అధ్యయన నివేదికను అనుసరించి గ్రీన్ టీ తాగడం వల్ల మనసును ప్రశాంతంగా ఉంటుంది. మెదడు త్వరగా వృద్ధాప్యానికి లోనుకాదు. గ్రీన్ టీలో సహజంగా లభించే ఎపిగల్లోకాటెచిన్ గెల్లేట్ (ఇజిసిజి), నికోటినామైడ్ (విటమిన్ బి3 ఫారమ్) వృద్ధాప్యానికి గురవుతున్న మెదడు కణాలలో శక్తిని పునరుద్ధరించి, అల్జీమర్స్ రోగంలో ప్రధాన కారణమైన అమాయలాయిడ్ బీటా వంటి హానికరం అయిన ప్రోటీన్ గుంపులను శుభ్రం చేస్తాయి. న్యూరాన్‌లు వృద్ధాప్యంగా మారుతూ ఉంటే మైటోకాండ్రియా శక్తిని కోల్పోతుంది. దీని వల్ల మెదడులో స్వాభావిక శుభ్రత వ్యవస్థ ఆటోఫ్యాజీ మందగిస్తుంది. ఆ ప్రాసెస్ సరిగా జరుగకపోతే, పాడైపోయిన ప్రోటీన్‌లు, చెత్త కణ భాగాలు అందులో చేరిపోతాయి, న్యూరోడెజెనరేషన్ ప్రమాదం పెరుగుతుంది. ఇజిసిజి, నికోటినామైడ్‌తో 24 గంటల పాటు న్యూరాన్‌లను సప్లిమెంట్ చేసినప్పుడు, మెదడులో శక్తి పునరద్ధరణ జరిగినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆటోఫ్యాజీని పునరుత్తేజం చేస్తుందని, కణాలు మెరుగుపడి, యువ మెదడు లాగా పనిచేస్తాయని తెలుసుకున్నారు. ఇజిసిజి సామాన్యంగా గ్రీన్ టీ, దాని సప్లిమెంట్లలో ఉంటుంది. కాగా, ఆరంభ పరిశోధనలు ఇంకో అల్జీమర్స్ లక్షణమైన టై టాంగిల్స్‌ని కూడా ఇది విభజించగలదని సూచిస్తున్నాయి. మెదడు ఆరోగ్యానికి శక్తివంతమైన సహజమైన మార్గం గ్రీన్ టీ సేవనమేనని స్పష్టం చేస్తున్నాయి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# తెలంగాణ పోరాట స్ఫూర్తి 'రావి'


ఖమ్మం..

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### సిపిఐ జిల్లా కార్యాలయాల్లో నారాయణరెడ్డి వర్ధంతి సభలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం, తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించిన అగ్ర నాయకులు రావి నారాయణరెడ్డి అని, వారి జీవితం స్ఫూర్తి దాయకమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి చిత్రపటానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సాయుధ పోరాటం ఒక మహోజ్వల ఘట్టమని తెలిపారు. ఆ పోరాటంలో రావి నారాయణరెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. నల్లగొండకు నందికొండ ప్రాజెక్టు, నడికుడి రైల్వే జంక్షన్ తీసుకురావడంలో కీలకపాత్రను పోషించారన్నారు. తనకున్న వందల ఎకరా ల భూమిని రైతు కూలీలకు పంచిన ఆదర్శ నాయకుడని తెలిపారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ఏ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, మలోత్ శంకర్ నాయక్, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండ...

### తెలంగాణ పోరాట నిప్పు కణిక :బాగం

**ఖమ్మం :** తెలంగాణలో పోరాట అగ్గి రగిల్చిన వారిలో సుప్రసిద్ధ కమ్యూనిస్టు రావి నారాయణ రెడ్డి ఒకరని ఆయన పోరాట నిప్పు కణిక అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు అన్నారు. రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణలో నాటి పరిస్థితులను చూసి తెలంగాణ విముక్తి తప్ప మరో మార్గం లేదని సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి ముందు వరుసలో నిలిచారన్నారు. రాజకీయాలకతీతంగా యావత్ తెలంగాణ ప్రజలు మహోన్నతుడిగా గౌరవించే రావి నారాయణరెడ్డి తన జీవిత కాలం కమ్యూనిస్టుగా జీవించారన్నారు. ఆ మహనీయుడి అడుగు జాడల్లో నడిచేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దోజు శ్రావణ్, బోడా వీరన్న, జాకీర్, సురేందర్, శ్రీనాథ్‌రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్‌సిటీ :** నిజాం పాలన విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చిన మహోన్నతమైన కమ్యూనిస్టు యోధుడు రావి నారాయణరెడ్డి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా సమితి ఆద్వర్యంలో రావి వర్ధంతి జరిగింది. నారాయణరెడ్డి చిత్రపటానికి పంజాల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ, శాఖ కార్యదర్శులు చెంచల మురళి, గామినేని సత్యం, నగునూరి రమేష్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, మునావత్ శ్రీనివాస్, పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** తెలంగాణ రైతాంగ సాయుధపోరాట ఉద్యమానికి రూపశిల్పి కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నర్సింహ్మా, పెబ్బేటి విజయుడు, ఆర్.ఇంద్ర, సిపిఐ జిల్లా ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, కృష్ణాజి, బొల్లెద్దుల శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ శ్రీనివాస్, తుమ్మల శివుడు, మర్యాద వెంకటయ్య, శంకర్‌గౌడ్, రవీందర్, దళితహక్కుల పోరాట సమితి జిల్లాప్రధాన కార్యదర్శి బండి లక్ష్మిపతి, పరుషరాం, కిరణ్, మల్లయ్య, గోపాల్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, మధుగౌడ్, ఎస్‌టియు నాయకులు మద్దిలేటి పాల్గొన్నారు.


నల్లగొండ...

### గర్వించదగ్గ నాయకుడు : నెల్లికంటి

**నల్లగొండ :** భూమికోసం, భుక్తి కోసం, సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణ రెడ్డి ప్రజలు గర్వించదగ్గ నాయకుడు అని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావినారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూం భవన్‌లో రావి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నెహ్రూ కంటే అత్యధిక ఓట్లు సంపాదించి పార్లమెంటులోకి అడుగు వేసిన ఘనత రావి నారాయణరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు పల్లా నర్సింహారెడ్డి , జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్ రెడ్డి, లోడింగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు బోల్గురి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్.అంజచారి, నల్పరాజు రామలింగయ్య, తూము బుచ్చిరెడ్డి. పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి, లెనిన్, మదర్, యూసుఫ్ పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణరెడ్డి అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిపిఐ ధర్మబిక్షం భవన్‌లో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్‌కె సాయిబల్లి, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, ఉప్పతల కోటమ్మ, జడ శ్రీనివాస్, చేపూరి కొండలు, యల్లావుల రమేష్, అనంతుల మల్లీశ్వరి, కాంపల్లి వెంకటయ్య, కత్తి శ్రీనివాస్ రెడ్డి, కడియాల అప్పయ్య, కందుల వెంకటేశ్వర్లు, యల్లబోయిన సింహాద్రి, ఏ.లక్ష్మి, భరత్, జానయ్య, భద్రారెడ్డి పాల్గొన్నారు.

**అబ్దులాపూర్‌మెట్ :** తెలంగాణ సాయుధపోరాట యోధుడు రావి నారాయణరెడ్డి జివిత చరింత్రను నేటి యువత తెలుసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి అన్నారు. పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కూంట్లూర్‌లోని రావి నారాయణరెడ్డి కాలనీలో సిపిఐ అధ్యర్యంలో రావి నారాయణరెడ్డి వర్ధంతి నిర్యహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మా, అరుణ, నవనీత, దాసరి ప్రసాద్, గోపి, దేవమ్మ, అవుల యాదగిరి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో రావి నారాయణరెడ్డి వర్ధంతి సభ సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆర్ ఎన్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలె సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరు రాజయ్య, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్ బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, చిగుళ్ల లింగం, చుక్క స్వామి, సలిగంజి వీరస్వామి, అన్నెపు వెంకట్, ఊట్కూరు నరసింహ, ఎల్లంకి మహేష్, కాశపాక దయాకర్, జక్క దయాకర్‌రెడ్డి, మారుపాక వెంకటేష్ పాల్గొన్నారు.


సూర్యాపేట...


భువనగిరి..


కరీంనగర్


నాగర్‌కర్నూల్..


అబ్దులాపూర్‌మెట్ ..



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## గణేశుడిని దర్శించుకున్న టిపిసిసి మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటిలోని దేవరయాంజాల్‌లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి పలు యూత్‌ల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధులను దర్శించుకున్నారు. ఆదివారం తూం కుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లో సాయి యూత్, బాబు జగ్జీవన్‌రామ్, బిఆర్ అంబేద్కర్ కమిటి యూత్, ఫ్రెండ్స్ యూత్, వినాయక యూత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డిని పలు యూత్ సంఘా లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై రైతుల్లో ఉత్కంఠ

### స్పీకర్ ప్రసాద్‌ను కలిసిన రైతులు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో ఎక్కడ చూసిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంటుపై, రిజనల్ రింగ్‌రోడ్డు కొత్త ప్రతిపాదనపై చర్చ జరుగుతుంది. ప్రభుత్వం మూడు రోజులక్రితం వెబ్‌సైట్‌లో ఉంచిన విషయం తెలిసిందే దీంతో ట్రిపుల్ ఆర్ జిల్లా మీదగా దాదాపు ఖరారైంది. ఈ నేపథ్యంలో అన్నదాతల్లో చర్చ మొదలైంది. ట్రిపుల్ ఆర్ కలుపుతూ వెళ్లే పడమర భాగం అలైన్‌మెంట్ మారుస్తూ ప్రతిపాదించడంతో పాటు గ్రామాల ,సర్వే నంబర్లు కూడా వెల్లడించిన నేపథ్యంలో పొలాలు కోల్పోనున్న రైతులు అధికారుల నేతలు చుట్టూ తిరుగుతున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు వెళితే తమ గ్రామానికి ఎటువైపు నుంచి వెళ్తతుంది ... ఎవరి పొలంలోనుంచి వెళ్తుంది అని చర్చించుకుంటున్నారు. తెలిసిన ప్రతి ఒక్కరిని అడుగుతున్నారు. తమ గ్రామం మీదుగా వెళ్లాలి. అభివృద్ధి జరగాలి కానీ మా పొలాల్లో పోకంటే బాగుండు దేవుడా అంటు వేడుకుంటున్నారు. గతంలో ప్రతిపదించిన డిపిఆర్ ప్రకారం రీజీనల్ రింగ్‌రోడ్డు పడమర ప్రాంతంలో వికారాబాద్ జిల్లాకు దిగువన రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం నుంచి వెళ్లేలా తయారు చేశారు. తాజాగా మార్చిన అలైన్‌మెంట్ జిల్లా పరిధిలోని సుమారు 60 గ్రామాల వరకు ట్రిపుల్ ఆర్ పరిధిలోకి రానున్నాయి. దీంతో ఎవరి భూములు పోతాయోననే అందోళన రైతుల్లో మొదలైంది. రైతులు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతిపత్రలు ఇచ్చారు. కొందరు రైతులు హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ కార్యాలయానికి వెళ్లి తమ అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో తయారు చేసిన డిపిఆర్‌లో పొందుపర్చిన ఆలైన్‌మెంట్ పడమర ప్రాంతలో జిల్లా జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని అలురు , కౌకుంట్ల గ్రామాల మధ్యలో నుంచి తంగెడిపల్లి మీదగా వెళ్లాలా ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనల్లో మన జిల్లాకు చెందిన నవాబుపేట్ ,పూడుర్ మండలాకు చెందిన ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలోంచి ట్రిపుల్ ఆర్ వెళ్లేలా డిజైన్ చేశారు. తాజాగా ప్రాదిపదనల్లో రెండు మండల పరిధిలోని , 20గ్రామాలకు పైగా ట్రిపుల్‌ఆర్ పరిధిలోకి వస్తుండగా,వికారాబాద్ ,మోమిన్‌పేట్ మండలాల పరిధిలోని ఐదరు గ్రామాలను కలుపుతూ కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో ఈ ప్రాంతంపై రియల్టర్ల కన్నుపడింది.

ఆయా గ్రామాల్లో పర్యటిస్తు అం దుబాటులో ఉన్న సమాచారంతో ట్రిపుల్ ఆర్ ఎయే గ్రా మాలు, ఎటువైపు నుంచి వెళ్తుందనే విషయాన్ని అంచనా వేస్తూ ఆయా ప్రాంతాల్లో భూములు కొనుగోళ్లకు ప్రయత్నిస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి దగ్గరగా వెళుతుండటంపై సంతోషం వ్యక్తం చేస్తుండగా భూములు కొల్పోతున్న రైతులు మాత్రం అందోళనకు గురవుతున్నా రు. వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మం డల పరిధి లోని దేవరంపల్లి రైతులు ఎమ్మెల్యే కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు .

## మానసిక రుగ్మతలను అధిగమించి లక్ష్యాలు చేరుకోవాలి

### అరుందతి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మానసిక రుగ్మతలను అదిగమించి ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని మానసిక వైద్యురాలు అమెల్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని జగద్గిరిగుట్ట మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో అరుందతి ఆస్పత్రి వారి సౌజన్యంతో మానసిక రుగ్మతలు నివారణోపాయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసికంగా ప్రశాంతంగా లేనప్పుడు ఇతరుల పైన మనం చెడు మాటలు మాట్లాడేందుకు ప్రబావాన్ని చూపిస్తాయని చెప్పారు. మానసికంగా ప్రశాంతంగా ఉంటే జీవితంలో ఏదైనా సాదించవచ్చని అన్నారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని మనస్సును ఎప్పుడు ప్రశాంతంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ విద్యార్థులకు అరుందతి ఆస్పత్రి వైద్యులు మానసిక రుగ్మతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా అవసరమైన విద్యార్థులకు వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు శిల్పా, సుచరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### రాష్ట్ర మహిళ కమిషన్ పద్మజ రమణ



**ప్రజాపక్షం/ ఘట్కేసర్ :** సమాజంలో ప్రతి ఒక్క అమ్మాయి ఉన్నత చదువులు చదవడంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర మహిళ కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ అన్నారు. బతుకమ్మ పౌండేషన్ అంకుషాపూర్ గ్రామం వద్ద ఉపాధ్యక్షులు పిట్టల మంగా నేతృత్వంలో కుట్లు, అల్లికలు, చేతి వృత్తులపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ మహిళలు ఇంట్లో తమ అనేక బాధ్యతలను నిర్వహించడంతో పాటు మహిళలు గౌరవంగా నేర్చుకోవడానికి అర్హులని కుటుంబాన్ని చూసుకోవడం మాత్రమే కాదు ఇప్పుడు మనకు కోత్త అవకాశాలు నేర్చుకుని సంపాదించుకునే అవకాశాలు ఉన్నాయని పద్మజ తెలిపారు.మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ సెంటర్ ద్వారా మహిళలు ఇంట్లోనే డబ్బులు సంపాదించవచ్చునని చిన్నచిన్న చేతి వృత్తులపై ఆధారపడితే చదువుతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చునని సుదర్శన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ రిటైర్డ్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద, బతుకమ్మఫౌడేషన్ కార్యదర్శి మంజుల,ముచుకుంద ఫౌడేషన్ కార్యదర్శి పిట్టల ముచుకుంద,ఉపాధ్యక్షురాలు పిట్టల మంగ తదితరులు పాల్గొన్నారు.

## మన స్థాపంతో వృద్ధ దంపతులు ఆత్మహత్య



**ప్రజాపక్షం/తాండూరు :** తీవ్ర మనస్థాపంతో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాస్నం గ్రామంలో కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధి రాస్నం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి(68) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలుసుకున్న భార్య భాగ్యమ్మ (60)గ్రామ సమీపంలోని వాగులో దూకి ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు. గ్రామంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం సృష్టించంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాస్నం గ్రామానికి చెందిన మంచాన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యమ్మలు దంపతులు. వీరికి కురణాకర్‌రెడ్డి, ధయాకర్‌రెడ్డిలు అను ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో ఆకుటుంబంలో నిత్యం గొడవలు జరిగేవని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన వృద్ధ దంపతులు వేరు వేరుగా ఆత్మహత్య చేసుకున్నారని స్థానికులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న యాలాల పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించడంతో పాటు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## పెన్షన్లు పెంపునకు నేడు 'చలో కలెక్టరేట్'



**ప్రజాపక్షం/వికారాబాద్:** వృద్ధులు,వితంతువులు,ఒంటరి మహిళలు చేయుత పెన్షన్ రూ.2000నుండి 4000కు పెంచాలని వికలాంగుల పెన్షన్ 4000లనుండి 6వేలకు పెంచాలని, కండరాల క్రీణిత కలిగిన వారికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు నేడు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు అనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వందలది మంది పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాకమందు వృద్ధులకు విత్తంతువులకు, ఒంటరి మహిళలు వికలాంగుల పెన్షన్ పెంచుతమని హామీ ఇచ్చి 20నెలలు గడిచిన పెన్షన్లు పెంచకపోవడం దురదృష్టాకరం అన్నారు. మందకృష్ణ మాదిగా పిలుపు మెరకు కలెక్టర్ కార్యాలయం మట్టడించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు సుభాష్ మాదిగా మహేందర్ తదితరలు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ ప్రొసీడింగ్ కాపీలు అందజేత

**ప్రజాపక్షం/వికారాబాద్ :**వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 7లోని గుడుపల్లి గ్రామానికి సంబంధించిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పోసిడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందజేసిన పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి , ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇంటి నిర్మణం కోసం అందించడం జరుగుతుంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## డ్రగ్స్ తయారీ పరిశ్రమపై దాడితో ఉలిక్కిపడ్డ మేడ్చల్ జిల్లా

### అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పలు పారిశ్రామిక వాడ (ఐడిఎ)లతో వందలాది పరిశ్రమ సంస్థలున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని చర్లపల్లి ఐడిఎ ప్రాంతంలో నడుస్తున్న వాగ్దేవి లాబెరేటరీస్ పేరిట కెమికల్స్ పేరిట నడుస్తున్న పరిశ్రమలో డ్రగ్స్ తయారీ చేస్తున్న విషయం వెలుగులోకి రావటంతో ఒక్క సారిగా ఉలిక్కిపడింది. బంగ్లాదేశ్ మహిళా నిందితురాలిచ్చిన సమాచారంతో ముంబయి పోలీసులు ఇక్కడికి చేరుకొని ఫ్యాక్టరీపై దాడి చేసి పెద్ద ఎత్తున తయారైన డ్రగ్స్‌తో పాటు పెద్దపెద్ద డ్రమ్స్‌లో లోపల ఉన్న డ్రగ్స్ తయారు చేసేందుకు వాడే ముడిసరకును స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఏ సంస్థలో ఏం జరుగుతుంది, ఏమేమి తయారీ చేస్తున్నారన్న విషయాలపై పరిశ్రమల శాఖతో పాటు ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల పని తీరులో పూర్తి నిర్లక్ష్యం స్పష్టం అవుతోంది. దీంతో నిఘా సం స్థల నిర్లక్ష్యం సైతం కనపడుతోంది. నాలుగేళ్ల క్రితం చర్లపల్లిలోని జలంధర్‌రెడ్డికి చెందిన శ్రీనివాస్ విజయ్ లీజ్‌కు తీసుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను పనిలో పెట్టుకుని గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ తయారీ చేస్తూ పథకం ప్రకారం ఏర్పాటు చేసుకొన్న డిస్ట్రిబ్యూటర్లతో సరఫరా చేస్తున్నాడు.

ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ తయారీ చేస్తూ నాలుగేళ్ల నుండి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న ఈ ముఠా తతంగం ప్రతి పరిశ్రమను క్రమం తప్పకుండా తనిఖీలు చేసే అధికారుల దృష్టికి వెళ్లక పోవటం వెనుక మర్మం ఏమిటని పలుపురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు తనిఖీలు సక్రమంగా నిర్వహించాలని సిపి ఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం , జిల్లా కార్యవర్గ స భ్యులు శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మ ణ్, వరప్రసాద్, జగ్గరాజు, వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు.



## ఫిట్‌నెస్ కోసం 'సండేస్ ఆన్ సైకిల్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఫిట్‌నెస్ కోసం రోజు అరగంట సైకిల్' నినాదంతో ముందుకు పోవాలని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం సంతోష్ కుమార్ వర్మ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం జరిగిన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి, అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రారంభించారు..ఖేలో ఇండియా పథకం యొక్క ఫిట్ ఇండియా చొరవలో భాగంగా రైల్వే ఉద్యోగులు, సమాజాలలో ఫిట్‌నెస్ సంస్కృతిని ప్రోత్సహించడానికి మా దినచర్యలో ఫిట్‌నెస్‌ను సమగ్రపరిచే లక్ష్యంతో ఎస్‌సిఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సైక్లింగ్ ఈవెంట్‌లో క్రీడాకారులు, రైల్వే ఉద్యోగులు,అధికారులు సహా దాదాపు 150 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ..ఫిట్ ఇండియా ఉద్యమ ప్రచారం నిజంగా ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఆరోగ్యంగా ఉండటానికి పెద్ద ఎత్తున దోహదపడుతుందన్నారు. సైక్లింగ్ కార్యకలాపాలు ఆరోగ్యానికి చాలా మంచిదని, ఇప్పుడు ఇతర దేశాలలో చాలా మంది ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి సైక్లింగ్‌కు తిరిగి వస్తున్నారని గుర్తు చేశారు.

## ప్రమాదకరంగా బాచుపల్లి ప్రధాన రహదారి

### ఎక్కడ చూసినా గుంతలు, గతుకులు
### పట్టించుకోని అధికారులు




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రధాన రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గుంతల మయంగా మారిన రహదారుల గుండ ప్రయాణించాలంటేనే వాహనదారులు నానా అవస్థలను ఎదుర్కొంటున్నారు. గుంతలమయంగా మారిన రహదారులతో భారీగా ట్రాఫిక్ జామవుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రధాన రహదారి మరీ అధ్వాన్నంగా మారింది. బాచుపల్లి చౌరస్తాలో బ్రిడ్జి నిర్మాణపు పనులు కొనసాగుతున్నప్పటికీ బ్రిడ్జికి ఇరువైపులా రహదారి మరీ ధారుణంగా మారింది. మమతా ఆసుపత్రి నుండి రెడ్డీస్ ల్యాబరేటరీస్ పరిశ్రమ వరకు ప్రధాన రహదారి గుంతలమయమైంది. కనీసం మరమ్మతులైనా చేయకపోవడంతో వాహనదారులు నానా అవస్థలను ఎదుర్కొంటున్నారు. రోజురోజుకి పెరిగిపోతున్న వాహనాల రాకపోకలతో పాటు రహదారులు అధ్వాన్నంగా మారడం వాహనదారులకు శాపంగా మారింది. ఓ వైపు బ్రిడ్జి నిర్మాణ పనులతో ఇరు వైపులా ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు పాఠశాలల బస్సులు అధికంగా తిరిగే ఈ రహదారి మరీ అధ్వాన్నంగా తయారైంది. బ్రిడ్జి నిర్మాణపు పనుల్లో కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గుంతలమయంగా మారిన రహదారిని కనీసం మరమ్మతులైనా చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

**నిజాంపేట్ మున్సిపల్ కమీషనర్‌కి వినతి**

బాచుపల్లి రహదారి దుస్థితిపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు రవికాంత్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ మమతా ఆసుపత్రి నుండి రెడ్డీస్ ల్యాబొరేటరీస్ పరిశ్రమ వరకు రోడ్డు మరీ అధ్వాన్నంగా మారిందని, తక్షణమే మరమ్మతులను చేయాలని కోరారు. స్థానిక మాజీ కార్పొరేటర్ డివిజన్‌లో పాఠశాల లేదని ఎంపి, కలెక్టర్‌లకు వినతులు సమర్పించారని, కాని రహదారి దుస్థితి మాజీ కార్పొరేటర్‌కి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఫ్లై ఓవర్ నిర్మాణపు పనుల్లో కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా పనులను చేస్తున్నా ఎవరూ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని రవికాంత్ డిమాండ్ చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

### తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఎల్‌ఎ బిఎందర్ ఆద్వర్యాన తాండూరు పట్టణంలో వినాయక కన్వేన్షన్ హాల్ ఏర్పాటు చేసిన తాండూరు నియోజకవర్గం ఉత్తమ ఉఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రధాన్యతను ఇస్తున్నాడని అన్నారు. ఉపాధ్యాయులు ఉన్నత లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు. కార్పోరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్యను అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కావున ఉపాధ్యాయులు జిల్లాతో పాటు రాష్టానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడంతో పాటు అభినందించారు.ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, పిఎస్‌సిఎస్ చైర్మన్ సురేదంర్‌రెడ్డి, అజయ్ ప్రాసాద్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ విఠల్ నాయక్, తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండల విద్యాధికారులు వెంకటయ్యగౌడ్, నర్సింగ్‌రావు,ఉపాధ్యాయులు తదతరులు ఉన్నారు.

శివసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జనం

## రూ.90వేలకు లడ్డూ కైవసం చేసుకున్న గడ్డం అరవింద్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ పద్మనగర్ ఫేస్2లో రోడ్ నెంబర్ 18లో శివసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది రోజుల గణేష్ నవరాత్రి వేడుకల్లో గణపయ్యకు విశేష పూజలు నిర్వహించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆదివారం వినాయకుని లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గడ్డం అరవింద్ రూ.90వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం లడ్డూను కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం యూత్ అసోసియేషన్ సభ్యులు గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం గణేష్ నిమజ్జనం శోభయాత్ర అంగరంగ వైభంగా కొనసాగింది. ఈ గణేష్ నిమజ్జనం వేడుకల్లో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళ హారతులతో ఆటపాటలతో చిన్నారుల నృత్యాలతో ఊరేగింపు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బ్రిజేష్ కుమార్ మిశ్రా, వెంకటేష్, మహి పటేల్, విశ్వ, సాత్విక్, సతీష్, శ్రీశాంత్, శశి, తరుణ్, నిర్వాన్, శేషు, వరుణ్, శివసేన యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో 'ఆప్' గెలుపే లక్ష్యం

### డా.దిడ్డి సుధాకర్



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** వచ్చే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యాచరణ రూపొందించామని పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదుకు ఆప్ నేతలు బుర్రా రాము గౌడ్, అబ్దుల్ ముక్తాదీర్, విజయ్ మల్లంగితో ప్రత్యేక కమిటీ వేశామన్నారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమై సభ్యత్వ నమోదు చేపడుతుందన్నారు. ఆప్ లక్ష్యాలను, ప్రజలకు చేసిన సేవలను పార్టీ నేతలు వివరించాలని సూచించారు. జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఆప్ పోటీ చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత ముందుకొచ్చి, సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆప్ నగర నేతలు మహమ్మద్ మజీద్, హేమ సుదర్శన్ జిల్లోజు, సాదిక్, శివాజి, రమ్య గౌడ్, ఎస్ఎన్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, దర్శనం రమేశ్, అజీమ్ బైగ్, లియాఖత్ ఖాన్, ముక్తర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి : జిలుకర



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దక్షిణాది రాష్ట్రాల ఎంపిలు రాజకీయాలకతీతంగా సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఈ నెల 9న జరిగే ఎన్నికల్లో ఓటు వేసి ఉపరాష్ట్రపతిగా గెలిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ తక్షణమే జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. సుదర్శన్‌రెడ్డికి మద్దతిచ్చిన ఎంఐఎం అధినేత ఎంపి అసదుద్దీన్ ఒవైసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య బలోపేతానికి, రాజ్యాంగ రక్షణకు సుదర్శన్‌రెడ్డి గెలుపు అత్యంత అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు దాసరి శ్యామ్ రావు, గరుగుల నర్సింహులు, సుధాకర్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరె కటికల అభ్యున్నతికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరే కటికల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అఖిల భారత ఆరె కటిక సంఘం దక్షిణాది రాష్ట్రాల కమిటీ కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హనుమంత్‌కారి హరి కృష్ణ అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో హనుమంత్ కారి హరి కృష్ణను అఖిల భారత ఆరె కటిక సంఘం సన్మానించింది. ఈ కార్యక్రమంలో జాతీయ కోకన్వీనర్ ప్రశాంత్ మురారికర్, సౌత్ కోకన్వీనర్ సంతోష్ హింగోలేకర్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అత్తికారి మల్లేష్ ,రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ కమ్టేకర్, హీరేకార్ నాగేశ్వర రావు, మల్లికార్జున కమ్టేకర్, రాజేష్ గోగికార్, సురేష్ గౌలికర్, గోగికార్ హర్షిత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## 9న ఉద్యోగ మేళా

### రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి జయశ్రీ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగములు కలిపించేందుకు సెప్టెంబర్ 9 జిల్లా ఉపాధి కార్యాలయం నందు ఉద్యోగ మేళా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి జయశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాద్ లోని రిటైల్, ఈకామర్స్,బ్యాంకింగ్,వాయిస్ అండ్ నాన్ వాయిస్ ప్రాసెస్,నాన్ ఐటీ,ఫార్మా,మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలలో పోస్ట్ లలో పని చేసేందుకు విద్యార్హత 10వ తరగతి,ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ,ఐటిఐ తోపాటు డిప్లొమా పూర్తిచేయడం తోపాటు వయసు 18సంవత్సరా ల నుండి 30సం"ల లోబడి ఉండవలెనని ఆమె వివరించారు.ఆయా అర్హత లు కలిగిన వారు మల్లేపల్లి లోనిశాంతినగర్ ఐటిఐ క్యాంపస్ రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కార్యాలయం,అడ్రస్ లో మరిన్ని వివరములకు 9063099306,8977175394 నంబర్లకు సంప్రదించవలసిందిగా రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ తన ప్రకటన లో పేర్కొన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/గండిపేట :** రంగారెడ్డి జిల్లా పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట మండలం కోకాపేటలో నియో పోలీస్ ప్రాంతంలో గోదావరి జలాల తరలింపు పనులకు శంకుస్థాపన చేయనున్న సభాస్థలిని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం కోకాపేట ఔటర్ రింగ్ రోడ్ ట్రంపెట్టు పారంభించి అనంతరం గండిపేటలోని కోకాపేట్ నియో పోలీస్ జలమండలి గోదావరి జలాల తరలింపు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడనున్న సిఎం మాట్లాడతారు. సిఎం రాక సందర్భంగా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో డిసిపి శ్రీనివాస్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి ఏసిపి రమణ గౌడ్, సిఐ హరికృష్ణ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల



**ప్రజాపక్షం/కొందుర్గు:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు జడ్పిటిసి, ఎంపిటిసి ఓటర్లకు సంబంధించిన ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. ఆదివారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో అనురాధ లక్ష్మీ విడుదల చేశారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. విడుదల చేసిన తాజా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 8వ తేది ఉదయం 11:30 వరకు ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరు కావాలన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయాల మూసివేత



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** చంద్రగ్రహణం సందర్భంగా శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు మూసివేశారు. ఆలయంలో స్వామి వారికి మహానువేదన మంగళనీరాజనం భజన కార్యక్రమాలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు చేసి ద్వార బంధనం చేశారు. తిరిగి సోమవారం ఉదయం గం. 5లకు సంప్రోక్షణ, తిరుమంజనము పూజల అనంతరం భక్తులకు సర్వదర్శనాలు, అర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని అర్చకులు తెలిపారు.

## నిమజ్జనానికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు : ఎసిపి కృష్ణయ్య

**ప్రజాపక్షం/హయత్ నగర్:**ఎల్‌బి నగర్‌లో గత పది రోజులుగా గణపతి నవరాత్రులు, నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకున్న ప్రజలకు భద్రత ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకున్న పోలీస్ సిబ్బందికి ఎల్ బి నగర్ ఎసిపి కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమకారుడు వెంకట్‌రాంరెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఫరూఖ్‌నగర్ మండల మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డిని జర్నలిస్టులు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని వారి కార్యాలయంలో మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డిని టియుడబ్ల్యుజె (ఐజెయు) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కోనియాల భాస్కర్, సంయుక్త కార్యదర్శి ధన్నారం రమేష్‌లు శాలువాతో సత్కరించారు.

## వాసవీకాలనీ గణనాథుడి లడ్డు వేలం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కెపురం డివిజన్ వాసవికాలనీ సంక్షేమ సంఘం నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి లడ్డును రూ.5లక్షల22వేలకు రాజేంద్రప్రసాద్ కళ్యాణి దంపతులు ఆదివారం దక్కించుకున్నారు. వాసవీకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త ఆధ్వర్యంలో మహాగణపతినవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, మాద్యం సుధాకర్‌గుప్తా, బందం దామోదర్‌గుప్తా, బచ్చు ప్రభాకర్, వెంపటి కృష్ణామోహన్, గౌరిశెట్టి శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా గణేశ్ నిమజ్జనోత్సవం





### నిర్విరామంగా పారిశుద్ధ్య పనులు చేపట్టిన జిహెచ్ఎంసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**హైదరాబాద్ నగరంలో భక్తి, సేవలకు నిలువుటద్దంగా నిలిచిన వినాయక చవితి వేడుకలు అంగరంగ ముశాయి. ఈ వేడుకల్లో జిహెచ్ఎంసి యంత్రాంగం అహర్నిశలు శ్రమించింది. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి మహా నిమజ్జనం వరకు అన్ని కార్యక్రమాలు ఎటువంటి ఆటంకం లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు జిహెచ్ఎంసి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించింది. ఆదివారం సాయంత్రం వరకు గణేశ్ నియోజ్జనోత్సవం జరిగింది.

### నిమజ్జనంలో జిహెచ్ఎంసి పాత్ర

ఈ సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా దాదాపు 3 లక్షల 3 వేలకు పైగా గణేశ్ విగ్రహాలు నిమజ్జనం జరిగిందని అధికారులు తెలిపారు. ఒక్క హుస్సేన్ సాగర్ లోనే సుమారు 25 వేల ప్రతిమల నిమజ్జనం జరిగింది. ఈ భారీ ప్రక్రియ నిర్వహణకు జిహెచ్ఎంసి యంత్రాంగం శ్రమించింది.

### నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ..

నిమజ్జనం ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా జిహెచ్ఎంసి తన బాధ్యతలను కొనసాగించింది. పండుగ అనంతరం నగర పరిశుభ్రతపై దృష్టి సారించి, భారీ స్థాయిలో పారిశుద్ధ్య చేపట్టింది. ఊరేగింపు మార్గాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన ప్రాంతాలు, నిమజ్జన పాయింట్లను శుభ్రం చేయడానికి సుమారు 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు 24 గంటలు అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. వినాయక చవితి వేడుకలు ప్రారంభమైన ఆగస్ట్ 27 నుంచి ఈరోజు సాయంత్రం వరకు 20 వేల టన్నుల అదనపు వ్యర్థాలను సేకరించారు. ఈ వ్యర్థాలను జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. సోమవారం కూడా ఈ శుభ్రతా కార్యక్రమం కొనసాగనుంది.

### అధికారుల పర్యవేక్షణ

ఈ విస్తృతమైన శుభ్రత కార్యక్రమాలను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు. నగర పరిశుభ్రత కోసం పగలు రాత్రి తేడా లేకుండా కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కృషిని పౌరులు ప్రశంసించారు.

### సిబ్బందికి అభినందనలు

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడంతో జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందికి మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ అభినందనలు తెలిపారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పోలీస్, విద్యుత్, హెచ్ఎండిఏ, రెవెన్యూ, హైడ్రా ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి కూడా మేయర్, కమిషనర్ అభినందనలు తెలిపారు. ఉత్సవ సమితి సభ్యులు, ప్రజల సహకారం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించాయన్నారు.








## పారిశుద్ధ్య పనుల్లో అపశృతి

### టస్కర్ వాహనం కిందపడి జిహెచ్ఎంసి కార్మికురాలు రేణుక మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న రేణుక ప్రమాదవశాత్తు మృతి చెందారు. బషీర్ బాగ్ సమీపంలో టస్కర్ వాహనం కింద పడి ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బషీర్‌బాగ్ నుంచి లిబర్టీ వైపు వెళ్లే మార్గంలో రేణుక రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం పక్కనే ఉన్న హైదరాబాద్ నర్సింగ్ హోమ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలిసిన వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హుటాహుటిన నర్సింగ్‌హోమ్‌కు చేరుకున్నారు. రేణుక మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా రేణుక మృతి పట్ల సంతాపం తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో అన్ని విధాలుగా అండగా ఉంటామని, కుటుంబానికి సహాయం చేస్తామని మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న రేణుక మృతిచెందడం పట్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (జిహెచ్ఎంఇయు) అధ్యక్షుడు ఊదరి గోపాల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన రేణుక కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కమిషనర్ కర్ణన్‌ను కోరారు. తక్షణ సహాయంగా యూనియన్ తరపున ఆయన రూ.10 వేలను రేణుక కుటుంబ సభ్యులకు అందచేశారు. రేణుక కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## 48 గంటల పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 1లో భాగంగా ముర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 మిల్లీమీటర్ల డయా పంపింగ్ మెయిన్‌పై 900 మిల్లీమీటర్ల డయా వాల్వుల మార్పిడి పనులు చేపట్టనున్నారు. ఈ పనుల కారణంగా ఈనెల 9 ఉదయం 6 గంటల నుంచి 11వ తేదీ ఉదయం 6 గంటల వరకు 48 గంటల పాటు కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నారు.

### నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రాంతాల వివరాలు..

**ఓ అండ్ ఎం డివిజన్– 6 (ఎస్.ఆర్.నగర్):** ఎస్.ఆర్.నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎస్‌పిఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావు నగర్, యెల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్, తాటిఖానాలో కొంత భాగం.

ఓ అండ్ ఎం డివిజన్ 7: లాలాపేట్, తార్నాకాలో కొంత భాగం.

**ఓ అండ్ ఎం డివిజన్– 9:** కుకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, యెల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కెపిహెచ్‌బి, బాలాజీనగర్, హష్మత్‌పేట్ సెక్షన్.

**ఓ అండ్ ఎం డివిజన్– 12:** చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గాజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరి గుట్ట, ఉషోదయ సెక్షన్.

**ఓ అండ్ ఎం డివిజన్– 8:** అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచ్చబోలారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్.

**ఓ అండ్ ఎం డివిజన్– 14** (కాప్రా మున్సిపాలిటీ పరిధి): చర్ల పల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత, కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్లో కొంత భాగం.

**ఓ అండ్ ఎండివిజన్ 15:** కొండాపూర్, డోయెన్స్, మాధాపూర్, గచ్చిబౌలి, నల్లగండ్లలో కొంత భాగం.

**ఓ అండ్ ఎం డివిజన్– 17:** హఫీజ్‌పేట్, మియాపూర్ సెక్షన్లు.

ఓ అండ్ ఎం డివిజన్ 19: పోచారం.

ఓ అండ్ ఎం డివిజన్ 21: కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు.

**ఓ అండ్ ఎం డివిజన్– 22:** నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బోల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు.

ట్రాన్స్‌మిషన్ డివిజన్ 4: మెఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఏఐఐఎంఎస్‌బి నగర్.

**గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్ ) ఆఫ్ :** అలేర్ (భువనగిరి), ఘన్పూర్ (మెద్చల్/శామీర్‌పేట్) ప్రాంతాలు.

పైన పేర్కొన్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.

## ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టి తొలగించడంతో

# పెరగనున్న జీవిత బీమా వ్యాపారం

### ఎల్ఐసి హైదరాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** భారతీయ జీవిత బీమా సంస్థలో ప్రతిభగల భీమా సఖి ఏజెంట్లు ప్రతిభను ప్రదర్శిస్తూ ఉన్నత శిఖరాలలో నిలబడేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని అట్లాంటి ఏజెంట్లను భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్లప్పుడూ గౌరవిస్తూ ఉంటుందని ఎల్ఐసిహైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి అన్నారు, గద్వాల్ బ్రాంచ్ పరిధిలో నూతనంగా ఏజెన్సీ వృత్తిలోకి వచ్చి అద్భుత మైన ప్రతిభ కనబరిచిన ఏజెంట్లను వారి వారి గృహాలలో సన్మానించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి మాట్లాడుతూ భీమా అనేది ప్రతి కుటుంబానికి ధీమాను అందిస్తున్నదని,ఈ అవకాశాన్ని ఈ కుటుంబము సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రతి ఒక్క కుటుంబం భీమాతో సురక్షితంగా ఉండే విధంగా చర్యలు ప్రారంభించిందని అందులో భాగంగానే ప్రతి పాలసీదారుడికి భారం గా మారిన ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్టి నీ రద్దు చేసిందని,ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ఏజెంటు మరి యు ప్రతి ఒక్క బీమా సఖి గమనించు కుంటూ పాలసీదారులకు సమాచారాన్ని చేరవేయాలని ఆమె కోరారు. అభివృద్ధి అధికారి బాదం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో భీమా సఖిలుగా గద్వాల్ పట్టణానికి చెందిన రేణుక విష్ణు అనంతపూర్ గ్రామానికి చెందిన రేఖ కరుణాకర్ కొండేరు గ్రామానికి చెందిన కుమారి భార్గవి తండ్రి బిచ్ పల్లి లను మేనేజర్ సంధ్యారాణి సన్మానించి అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాలలో మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ రావ్ మేనేజర్ సేల్స్ రవీందర్ గద్వాల్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కులశేఖర్, అసిస్టెంట్‌మేనేజర్ శ్రీనివాసులు, ఐసిఇయు గద్వాల్ బ్రాంచ్ సెక్రటరీ రంగారావు పాల్గొన్నారు.

**జీఎస్టీ రద్దుతో తగ్గనున్న ప్రీమియంలు...**కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 22వ తేదీ నుండి ఇన్సూరెన్స్ ప్రీమియం లపై జీఎస్టీ ని వసూలు చేసే విధానాన్ని రద్దు చేయడం జరుగు తుందని, ఈ విధానం ద్వారా రాబోయే రోజుల్లో ఇన్సూరెన్స్ ప్రీమియంలు తగ్గనున్నాయని ఆమె పేర్కొన్నారు, ఈ అవకాశాన్ని భీమా సఖి లు మరియు ఏజెంట్లు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి పిలుపునిచ్చారు.




## నేటి సమాజానికి ఆదర్శవంతుడు

# రావి నారాయణరెడ్డి



### సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:**రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)హయత్ నగర్ మండల పార్టీ కార్యాలయంలో మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ ఎల్.బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరై నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజాపోరాటానికి చూపునిచ్చిన జననేతగా ప్రసిద్ధుడు,ఆంధ్ర మహాసభకు ఆధ్యక్షుడుగా పనిచేశాడు.అని అన్నారు తెలంగాణ విమోచన తరువాత ఆయన సిపిఐ లో చాలాకాలం పనిచేశాడు. రావి నారాయణరెడ్డి విశాలాంధ్ర కోసం ఎంతో శ్రమించాడు,నిజాం ప్రభుత్వం మీద ఆయన చేసిన సాయుధ పోరాటం చిరస్మరణీయం అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శి కర్నే సుజాత,బిఒసి రాష్ట్ర సమితి సభ్యులు మందుల కృష్ణ, ఏఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మండల కార్యదర్శి సరిత, డిహెచ్పిఎస్ ఎల్‌బి నగర్ కార్యదర్శి పాల్వాయి సురేందర్, శాఖ కార్యదర్శులు అరుణ, పారిజాత, సౌజన్య, యమున, సుమతి, అలివేణి, శివజ్యోతి, జ్యోతి, డిహెచ్ పి ఎస్ మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, రాధ, సోషల్ మీడియా అధ్యక్షులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 11 రోజులు జరిగే కథతో ప్రొద్దుటూరు దసరా



బాల్కనీ ఒరిజినల్స్, బుశెట్టి జువెల్లర్స్ సమర్పణలో ప్రేమ్ కుమార్ వలపల నిర్మాతగా తీసిన డాక్యుమెంటరీ 'ప్రొద్దుటూరు దసరా'. మురళీ కృష్ణ తుమ్మ ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించారు. ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు కరుణ కుమార్, విప్లవ్, మహేష్ విట్టా, ఉదయ్ గుర్రాల ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ ఓ ఘటన లేదా, వ్యక్తికి సంబంధించిన విషయాల్ని, నిజాల్ని చూపించే డాక్యుమెంటరీస్ ఉంటాయి. ఓ సరైన డాక్యుమెంటరీకి సినిమా కంటే పెద్ద రీచ్ ఉంటుంది. డాక్యుమెంటరీ అంటే ఎంగేజింగ్గా ఉండదని అంతా అనుకుంటారు. కానీ ఈ 'ప్రొద్దుటూరు దసరా' ఎంతో ఎంగేజింగ్గా, అద్భుతంగా అనిపించింది. డాక్యుమెంటరీ అంటే ఇలానే తీయాలి అనే నియమాల్ని బద్దలు కొట్టారు. యశ్వంత్ నాగ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఆర్ఆర్, పాట చాలా బాగుంది అని అన్నారు. మహేష్ విట్టా మాట్లాడుతూ మా ఊర్లో జరిగే దసరా గురించి అందరికీ చెబుతుంటాను. పది రోజుల పాటు పండుగ అదిరిపోతుంది. ఈ డాక్యుమెంటరీలో చూపించిన దాని కంటే ఇంకా బాగుంటుంది. పది టెంపుల్స్లో దసరా గొప్పగా జరుగుతుంది. 11 వ రోజు మాత్రం వాహనాలు కూడా వచ్చే స్థలం ఉండదు. శివ కాశీ నుంచి తెచ్చిన క్రాకర్స్ని గంట సేపు కాల్చుతారు. ప్రొద్దుటూర్లో దసరా అద్భుతంగా జరుగుతుంది' అని అన్నారు.
ఈ కార్యక్రమంలో దర్శకుడు ఉదయ్ గుర్రాల, నిర్మాత ప్రేమ్ కుమార్, నటుడు విప్లవ్ , జయ సింహా , దర్శకుడు మురళీ కృష్ణ, నటుడు దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న ఓజీ




పవన్ కళ్యాణ్ హీరోగా, ప్రియాంకా హీరోయిన్ గా సుజిత్ తెరకెక్కుతున్న ఓజీ సినీమా ఈ సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి నెలాఖరంలో విడుదల చేయడానికిఊసన్నాహాలు చేస్తున్నామంటూ చెప్పారు సినిమాకు సంబందించిన అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు గ్యాంగ్ స్టార్ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. డివివి దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా అభిమానులకు ఓ పండుగ లాంటి సినిమా అవుతుందని నిర్మాత దానయ్య చెప్పారు.

## మిరాయ్ ఓ అడ్వెంచర్ కథ డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని



సూపర్ హీరో తేజ సజ్జా విజువల్ వండర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది ఈ సందర్భంగా డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఏడేళ్ల క్రితమే ఈ ఐడియా పుట్టింది. ఈ ఆలోచనకి ఇతిహాసాలని ఎలా ముడి పెట్టొచ్చనే ప్రాసెస్ కి చాలా టైం పట్టింది.చిన్నప్పటి నుంచి పురాణ ఇతిహాసాలను గురించి విన్న కథలు, పాషనేటింగ్ ఎలిమెంట్స్ తో మిరాయ్ ని డెవలప్ చేయడం జరిగింది. ఇది మన రూటేడ్ కథలా వుంటుంది. ఆడియన్స్ అందరూ తప్పకుండా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను. అశోకుని వద్ద తొమ్మిది గ్రంధాలు ఉన్నాయానే ఒక మిత్ వుంది. ఆ తొమ్మిది పుస్తకాలు దుష్టుల బారిన పడితే, వాటిని మన ఇతిహాసాలు ఆధారంగా ఎలా కాపాడవచ్చనేది మిరాయ్ ఐడియా. ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానికి పరిష్కారం ఇతిహాసాల్లో పురాణాల్లో వుందనే నమ్మకంతో చేసిన కథ. ఈ కథని యాక్షన్ అడ్వంచర్ గా ట్రీట్ చేశాం. ఇది కంప్లీట్ గా ఫిక్షనల్. ఈ కథ దాదాపు ప్రజెంట్ లోనే జరుగుతుంది. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు యాంబిషన్ పెద్దదని తెలుసు. ఈ సినిమా చేసిన ప్రాసస్ డిఫరెంట్. నటీనటులందరినీ రియల్ లోకేషన్స్ లోకి తీసుకెళ్ళాం. మంచు పర్వతాల్లో , ఎడారుల్లో, అడవుల్లో .. అన్నిట్లో రియల్ గా చేశాం. మొత్తం షూటింగ్ లో ఒక్క సీనియర్ యాక్టర్ కి కూడా కార్వాన్ లేదు. వారి సపోర్ట్ వలన ఈ సినిమాకి అంత అద్భుతంగా కుదిరింది. శ్రీలంక, నేపాల్, రాజస్తాన్, బుర్జ్, థాయిలాండ్.. మొత్తం ఏసియా అంతా తిరిగేశాం. తేజ ఈ సినిమా కోసం థాయిలాండ్ లో ప్రత్యేకం శిక్షణ తీసుకున్నారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. మంచు మనోజ్ ని తీసుకోవడానికి కారణం ఏమిటంటే పాజిటివ్ సైడ్ ఉంటూ నేచురల్ అగ్రేషన్ ఉన్న ఒక యాక్టర్ కావాలి. మనోజ్ కరెక్ట్ గా ఈ క్యారెక్టర్ కి ఫిట్ అవుతారు. మనోజ్ కి మార్షల్ ఆరట్స్ లో కూడా అనుభవం వుంది. అది మాకు హెల్ప్ అయ్యింది. శ్రీయా పర్ఫెక్ట్ గా ఫిట్ అవుతారనిపించి చేశాం. తల్లి కొడుకుల ఎమోషన్ ఈ సినిమాకి చాలా కీలకం. శ్రియా అద్భుతంగా చేశారు. బడ్జెట్ మేము అనుకున్న దానికంటే కొంచెం క్రాస్ అయ్యింది. నిర్మాత విశ్వ ప్రసాద్ మా విజన్ పూర్తిగా సపోర్ట్ ఇచ్చారు. ఆయన పాషన్ తోనే సినిమా ఇంత గ్రాండ్ గా వచ్చింది. ఫస్ట్ కాపీ చూసి ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. జటాయు బ్రదర్ సంపాతి పాత్రని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీక్వెన్స్ చేశాం, అది చాలా సర్ ప్రైజ్ గా వుంటుంది. దీనికోసం యానిమేట్రానిక్ టెక్నాలజీ ఉపయోగించాం. మేము అనుకున్న దానికంటే బెటర్ గా వచ్చిందని ఫీలింగ్ కలిగింది. ఇందులో ఒక ట్రైన్ సీక్వెన్స్ ఉంటుంది. అది పేపర్ మీద చూసుకున్నప్పుడు నిజంగా ఎలా అవుతుందా అనిపించింది. శ్రీలంకలో షూట్ చేసాము. చాలా అద్భుతంగా వచ్చింది, ఆడియన్స్ అందరూ సర్ప్రైజ్ అవుతారు. ప్రతి సీక్వెన్స్ కూడా మేము అనుకున్న దాని కంటే చాలా బెటర్ గా వచ్చింది. మ్యూజిక్ కథని ఎలివేట్ చేసింది. మంచి హై క్రియేట్ చేసేలా మ్యూజిక్ చేశారు. జయరాం అగస్త్య ముని పాత్రలో కనిపిస్తారు. జగపతి బాబు తాంత్రిక గురువు పాత్రలో కనిపిస్తారు. ఈ రెండు పాత్రలు కీలకంగా వుంటాయి. సీక్వెల్ చేసే పొటెన్షియల్ మిరాయ్ కథకి వుంది. ఈ సినిమాకి వచ్చే రిజల్ట్ ని బట్టి అలోచించాలి.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో ది గర్ల్ ఫ్రెండ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు.'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి రిలీజ్ అయిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజిగా ఉన్న ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## స్లిమ్ 'లుక్'లో మంచు మనోజ్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ బరువు తగ్గి స్లిమ్ గా మారారు. సన్నబడి స్టైలిష్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. ఆయన తన కొత్త సినిమా 'మిరాయ్' ప్రమోషన్స్ లో ఈ స్లిమ్ లుక్ లో కనిపిస్తున్న స్టిల్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 'మిరాయ్' సినిమాలో మంచు మనోజ్ బ్లాక్ స్వార్డ్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. ఈ క్యారెక్టర్ యానిమేటెడ్ ఇమేజ్, డీటెయిల్స్ ఉన్న టీషర్టులు ధరించిన మంచు మనోజ్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. 'మిరాయ్' సినిమా తన కెరీర్ కు మరో మంచి టర్న్ అవుతుందని మనోజ్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ మూవీ ఈ నెల 12న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## సైమా అవార్డు బాధ్యత పెంచింది ఉత్తమ నటుడు అల్లు అర్జున్




'సైమా' 2025 అవార్డ్స్ విజేతలు(తెలుగు): ఉత్తమ చిత్రం 'కల్కి', ఉత్తమ నటుడు అల్లు అర్జున్, ఉత్తమ నటుడు (క్రిటిక్స్) తేజ సజ్జా, ఉత్తమ దర్శకుడు సుకుమార్, ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) ప్రశాంత్ వర్మ అవార్డులను అందుకున్నారు. దుబాయ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ నటుడు అల్లు అర్జున్ మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని అన్నారు. అవార్డు అందుకుంటే ఆ ఫీలింగ్ వేరేగా ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం తప్పకుండా అవార్డు ఇస్తున్న సైమాను అభినందిస్తున్నానని తెలిపారు.

**ఉత్తమ చిత్రం : కల్కి**
**ఉత్తమ దర్శకుడు : సుకుమార్**
**ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) : ప్రశాంత్ వర్మ**
**ఉత్తమ నటుడు :అల్లు అర్జున్**
**ఉత్తమ నటుడు (క్రిటిక్స్) : తేజ సజ్జా**
**ఉత్తమ నటి : రష్మిక మందన్నా**
**ఉత్తమ నటి (క్రిటిక్స్) :మీనాక్షి చౌదరి**
**ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్**
**ఉత్తమ సహాయ నటి : అన్నే బెన్**
**ఉత్తమ సంగీత దర్శకుడు : దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ)**
**ఉత్తమ గీతరచయిత : రామ్ జోగయ్య శాస్త్రి**
**ఉత్తమ గాయకుడు : శంకర్ బాబు కందుకూరి**
**ఉత్తమ గాయని : శిల్పా రావు**
**ఉత్తమ ప్రతినాయకుడు : కమల్ హాసన్**
**ఉత్తమ పరిచయ నటి : పంకూరి, భాగ్యశ్రీ**
**ఉత్తమ పరిచయ నటుడు : సందీప్ సరోజ్**
**ఉత్తమ పరిచయ దర్శకుడు : నంద కిషోర్ యేమని**
**ఉత్తమ కొత్త నిర్మాత : నిహారిక కొణిదెల**
**ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : రత్నవేలు**
**ఉత్తమ హాస్యనటుడు : సత్యలకు అవార్డులు అందుకున్నారు.**

# గోదావరి ఫేజ్-2,3 ప్రాజెక్టుకు శ్రీకారం

### సిఎం చేతుల మీదుగా గండిపేట వద్ద శంకుస్థాపన

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి 20 టిఎంసిల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్2, 3 ప్రాజెక్టుకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజిడిల నుంచి 600 ఎంజిడిల నీరు సరఫరా చేస్తున్నారు. 2030వ సంవత్సరం వరకు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 300 ఎంజిడిల అదనపు జలాలను సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నది నుంచి మొత్తం 30 టిఎంసిల నీరు వాడుకునే వెసులుబాటు ఉండటంతో అదనపు జలాల కోసం గోదావరి ప్రాజెక్టు ఫేజ్2,3 లను రూపకల్పన చేసింది. 2027 సంవత్సరం వరకు హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజిడిలకు పెరుగుతుంది. 2047 నాటికి ఈ సంఖ్య 1114 ఎంజిడిలుగా ఉండనుంది. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించనుంది. గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టిఎంసిల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టిఎంసిల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టిఎంసిల్లో 17.5 టిఎంసిలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా, జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టిఎంసిలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌ను వాప్ కోస్ అనే కంపెనీ సిద్ధం చేసింది. ఇందులో పంప్ హౌజ్‌లు, సబ్ స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3000 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. ఘన్ పూర్, శామీర్ పేట్ వద్ద 1170 ఎంఎల్‌డిల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ 2, 3 ద్వారా 300 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు.



ఫైల్ ఫొటో

## 'రేపు' రవీంద్రభారతిలో రమాదేవికి సాహితీ పురస్కారం-2025 ప్రదానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు పేరుతో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటాప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే 'సాహితీ పురస్కారం2025' ప్రస్తుత ఏడాదికి ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవిని ఎంపిక చేశారు. సాహితీ పురస్కార ఎంపిక నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వం లోకకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నెల్లుట్ల రమాదేవిని ఎంపిక చేయగా,ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి ఆమోదించి, అభినందనలు తెలిపారు. కాళోజీ జయంతి ఉత్సవాలలో భాగంగా, తెలంగాణ భాషా దినోత్సవం సంబరాలలో భాగంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈనెల 9న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కాళోజీ జయంతి వేడుకలలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్ తదితర ప్రముఖుల హాజరుకానున్నారు.

## బిజెపి అడ్డుకుంటోంది

**(మొదటి పేజీ తరువాయి)**

సొమ్ము వాటాల పంపకాల్లో తేడా రావడంతో ఎమ్మెల్సీ కవిత బయట పెట్టిందని, ఇదే విషయం ఐదేళ్ల క్రితం చెప్పి ఉంటే కవితను ప్రజలు నమ్మేవారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కామారెడ్డి గడ్డమీద బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించామని తెలిపారు. హామీ ప్రకారం మూడు బిల్లులు చేసి కేంద్రానికి పంపామని అన్నారు. కామారెడ్డిలో ముఖ్య నాయకులతో కాంగ్రెస్ సన్నాహక సమావేశం, బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, వాకాటి శ్రీహరిలతో కలిసి ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో 15న జరిగే భారీ బహిరంగ సభ (ఇందిరాగాంధీ స్టేడియం)లో స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, లక్ష్మీ కాంతరావులతో కలిసి మంత్రుల బృందంతో మహేశ్‌కుమార్ మాట్లాడారు. బిసికు రిజర్వేషన్ అమలు చేసి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకుంటుందన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భారత్ సంచలనం!

**(మొదటి పేజీ తరువాయి)**

ఓడించింది. మూడుసెట్ల తర్వాత ఇరుజట్లు 176–176 పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే నిర్ణయాత్మక చివరి సెట్‌లో భారత జట్టు తమ ప్రతిభను ప్రదర్శించి 59 పాయింట్లు సాధించి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది.

**మిక్స్‌డ్ టీమ్‌కు రజత పతకం**

భారత పురుషుల జట్టు స్వర్ణం సాధించగా.. మరోవైపు జ్యోతి సురేఖ వెన్నం, రిషబ్ యాదవ్‌ల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో నెదర్లాండ్స్ చేతిలో 155–157 తేడాతో స్వల్ప తేడాతో ఓడి రజత పతకాన్ని గెలుచుకుంది. కేవలం రెండు పాయింట్ల తేడాతో స్వర్ణ పతకాన్ని మిస్ చేసుకుంది. ఈ జంట కూడా టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది.

**రిషభ్ యాదవ్, జ్యోతి సురేఖల అద్భుత ఫామ్**

ఈ సంవత్సరం రిషభ్ యాదవ్, జ్యోతి కలిసి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. మేలో షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 2లో వీరు ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే సెంట్రల్ ఫ్లోరిడాలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 1లో స్వర్ణం, మాడ్రిడ్‌లో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్ 4లో కాంస్యం సాధించారు. ఈ విజయాలు భారత ఆర్చరీ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయి.

## మోదీ దేశానికి శత్రువయ్యారు!

**(మొదటి పేజీ తరువాయి)**

విధించారని, 50 శాతం సుంకాల తర్వాత అతను మన దేశ ప్రజలను నాశనం చేశారన్నారు. 'మీరు మీ సిద్ధాంతాన్ని అనుసరించండి కానీ దేశ ప్రజలను రక్షించండి, ఎందుకంటే మొదట దేశం, మీ స్నేహం ద్వితీయం' ఖర్గే హితవు పలికారు. భారత దేశం దశాబ్దాలుగా తటస్థత, అలీన విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోందని, అది ఆ మార్గంలోనే కొనసాగాలని ప్రధానమంత్రి గ్రహించాలని ఖర్గే కోరారు. సవరించిన జిఎస్‌టి రేట్లపై, పేదలకు ప్రయోజనం చేకూర్చే ఏ చర్యనైనా కాంగ్రెస్ స్వాగతిస్తుందని, కానీ బిజెపి ప్రభుత్వం సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తోందని ఖర్గే అన్నారు. తము ఈ అంశాన్ని ఎనిమిది సంవత్సరాల క్రితం లేవనెత్తామని, రెండు శ్లాబులు ఉంటే, అది పేదలకు ప్రయోజనం చేకూరుస్తుందని తాము చెప్పామన్నారు. అయినా పెడచెవిన నాలుగు నుండి ఐదు శ్లాబులను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపించిన తర్వాత కొన్ని ఇబ్బందులను ఎదుర్కొని జిఎస్‌టి శ్లాబులను సవరించారని ఆయన పేర్కొన్నారు. చైనా చొరబాటు సమయంలో 'ఎవరూ భారత భూభాగంలోకి ప్రవేశించలేదు' అని మోదీ గతంలో చేసిన వాదనను కూడా ఖర్గే ప్రస్తావించారు. 'ఇప్పుడు మోదీ స్వయంగా చైనాలోకి ప్రవేశించారు' అని ఆయన ఎత్తి చూపారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నప్పటికీ, మోదీ మద్దతును దుర్వినియోగం చేయడానికి అనుమతించమని కాంగ్రెస్ అధ్యక్షుడు నొక్కి చెప్పారు. 'దేశం విషయానికి వస్తే మనం ఒకటే. అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ మీకు మద్దతు ఇస్తున్నందున, మీరు ఏకపక్షంగా ఏదైనా చేయాలని దీని అర్థం కాదు. మేము దీనిని అనుమతించబోము' అని ఆయన అన్నారు. ట్రంప్‌తో బహిరంగంగా పొత్తు పెట్టుకోవడం ద్వారా భారతదేశ అంతర్జాతీయ ఖ్యాతిని మోదీ దెబ్బతీశారని ఖర్గే ఆరోపించారు. 'ట్రంప్ నా స్నేహితుడు' 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్' (ట్రంప్, మరోసారి) అని చెప్పడం ద్వారా ఆయన భారతదేశ స్థానాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. భారతదేశం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అనుసరిస్తున్న అలీన విధానాన్ని కొనసాగించి ఉంటే అటువంటి పరిస్థితి తలెత్తేది కాదని అన్నారు. బిహార్‌లో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ ఎత్తిచూపాలని యోచిస్తున్న అంశాలను ఖర్గే వెల్లడించారు. 'మాకు చాలా సమస్యలు ఉన్నాయి; నిరుద్యోగం, శాంతి భద్రతలు, మహిళలపై లైంగిక దాడులు... దళితులు, వెనుకబడిన తరగతులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదు, రైతులకు ఎరువులు అందడం లేదు. 'ఓట్ల దొంగతనం' అంశం కూడా మా ప్రధాన ఎజెండా' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించడం గురించి, ఖర్గే మాట్లాడుతూ ఇది మంచి పరిణామమని అన్నారు.

**ఇసి ఓటు చోరులను కాపాడుతోంది**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల కమిషన్ (ఇసి)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఇసి ఓటు చోరులను కాపాడుతూ వస్తూ.. కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని విమర్శించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలకమైన డేటాను ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బయటపెట్టలేదని అన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి.. ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఇసి సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఇసి పదేళ్లుగా పని చేస్తోందన్నారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదన్నారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బిహార్ లోనూ ఓటు చోరీకి పాల్పడడానికి కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న కుట్రలో భాగంగానే ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఎన్డీయే ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని.. బిహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు.

## మంత్రివర్గ భవనం ధ్వంసం

**(మొదటి పేజీ తరువాయి)**



చేసినట్లు ఉక్రేన్ వైమానికదళ అధికార ప్రతినిధి యూరీ ఇహ్నాత్ చెప్పారు. యుద్ధం మొదలైన తర్వాత ఇదే అతిపెద్ద దాడి అని చెప్పారు. వివిధ రకాల 13 క్షిపణులను రష్యా ప్రయోగించిందని చెప్పారు. ఐనప్పటికీ 747 డ్రోన్లు, మరో నాలుగు క్షిపణులను విధ్వంసం సృష్టించకుండా తటస్థీకరించినట్లు చెప్పారు.
జెలెన్‌స్కీసహా ప్రధానమంత్రి యులియా స్విరిడెంకో ఈ దాడులను ఖండించారు. ఇప్పటివరకూ రష్యా ఎప్పుడూ ఉక్రేన్ ప్రభుత్వ ప్రధాన కార్యాలయ భ వంతులపై దాడులు చేయలేదనీ, మొట్టమొదటిసారి శత్రుదాడుల్లో తమ ప్ర ధాన ప్రభుత్వ భవనం ధ్వంసమైందని చెప్పా రు. ఈ భవంతులను తాము తర్వాత పునరుద్ధరిస్తామని, కానీ ప్రాణహాని కలిగిందని చెప్పా రు. ఈ దాడులపై ప్రపంచదేశాలు తక్షణం ప్రతిస్పందించాలని కోరారు. రష్యాపై కఠిన ఆం క్షలు విధించాలని ఆమె కోరారు. గడచిన రెండు వారాల్లో ఉక్రేన్‌పై ఇది రెండో అతిపెద్ద దాడి అని ఆమె చెప్పారు. ఒకసారి ఉక్రేన్‌లో యుద్ధం ముగింపు దశ కు వస్తే, ఆ దేశానికి పూర్తి భద్రతాహామీని ఇస్తామని, 26 దేశాల సేనలను ఉక్రేన్‌లో మోహరిస్తామని పారిస్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ సమావేశం నిర్ణయించింది. దీంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీలు ఇచ్చే విషయం పరిశీలిస్తామన్నారు. నాటో కూటమి ఉక్రేన్‌ను అడ్డుపెట్టుకుని ఉద్దేశపూర్వకంగా రష్యాను లక్ష్యంగా చేసుకుని తన సామ్రాజ్యవాదాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తోందని ఇప్పటికే పలుసార్లు ప్రకటించిన పుతిన్ యూరోపియన్ యూనియన్ ప్రకటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమదేశాలకు హెచ్చరిక చేశారు. జెలెన్‌స్కీ కూడా స్పందిస్తూ, రష్యాపై ఆంక్షలు పెంచాలని ట్రంప్‌ను కోరారు. పుతిన్‌ను కలుసుకుని శాంతి ఒప్పందం చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

**యూరప్ నాయకుల ఖండన**

కీవ్ ప్రధాన ప్రభుత్వ భవంతులపై రష్యా దాడులను పలు యూరప్‌దేశాల నాయకులు ఖండించారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ ఈ దాడులపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పుతిన్‌కు శాంతిపట్ల ఎంతమాత్రం శ్రద్ధలేదని విమర్శించారు. ఉక్రేన్‌కు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ విషయంలో వెనుకంజ వేసేదిలేదన్నారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, ఇయు కమిషన్ ఛైర్‌పర్సన్ ఉర్సులా వోందర్‌లేయన్, యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాసహా నార్వే, ఫిన్‌లాండ్, స్పెయిన్ దేశాల నాయకులు రష్యా దాడులను ఖండించారు. 20220 ఫిబ్రవరిలో ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com